# నడుస్తున్న తెలంగాణ

ISSN 2349-2376

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

సంపుటి:15 సంచిక:1 167 జనవరి 2025 హైదరాబాద్

- ఎవరీ గాజుకళ్ల పిల్లలు!
- యుజిసి ముసాయిదా-2025: ఒక విశ్లేషణాత్మక పరిశీలన
- "తెలుగు భాషోపాధ్యాయులకు ఆంగ్లం, కంప్యూటర్ ..."
- నగనూరు శాసనం-గంగాధరమంత్రి స్వీయ చరిత్ర
- 'జిగిరి' నవల-మానవ సంవేదనలు
- ఇచ్చంత్రపు ఇడుపుకాయిదం



UGC CARE LISTED JOURNAL

# నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

ISSN 2349-2376

జనవరి 2025
సంచిక : 1
సంపుటి : 15

UGC APPROVED JOURNAL

UGC CARE LISTED JOURNAL



గౌరవ సంపాదకులు
**ప్రొ॥ అడపా సత్యనారాయణ**

సలహామండలి
**అల్లం నారాయణ**
చైర్మన్(పూర్వ)-ప్రెస్ అకాడమి
**ప్రొఫెసర్ గణేష్**
ప్రిన్సిపాల్(పూర్వ), ఆర్ట్స్ కళాశాల, ఓయు.

ప్రధాన సంపాదకుడు
**ప్రొఫెసర్ చింతకింది కాశీం**

సంపాదకురాలు
**స్నేహలత ఎం.**

సంపాదకవర్గం

**ప్రొఫెసర్ ఎ. సిల్మానాయక్,** ప్రిన్సిపాల్, టి.ఎస్.పి. కళాశాల
**క్రాంతి,** జర్నలిస్టు
**డా॥చంద్రయ్య ఎస్.** అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)
**డా॥శివరాత్రి సుధాకర్,** అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)
**డా॥ఇమ్మిడి మహేందర్** అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

డిటిపి, లే ఔట్ : స్నేహ
కవర్ డిజైన్ : క్రాంతి



రచనలు పంపాల్సిన చిరునామా
**స్నేహలత ఎం.,**
ఇంటి నెం. 2-95, ఫ్లాట్ నెం. 301,
వైష్ణవి స్మార్ట్, రోడ్ నెం. 2,
కాకతీయ నగర్, హబ్సిగూడ
హైదరాబాద్-500 007.
మెయిల్: nadusthunnatelangana@gmail.com
ఫోన్ నెం.: 9290745490


## సంపాదకుని ఉత్తరం

*గంగ పారుతున్న చోట*
*సూర్యుడు ఎప్పటిలాగే ఉదయించాడు*
*పువ్వులు సహజంగానే పూసాయి*
*మనిషి పాదాలకు మాత్రం*
*మతం కత్తులు మొలిచాయి*
*ఇంకేముంది*
*భూమికడుపులో*
*తొక్కిసలాట*
*భక్తికి పూసిన పువ్వులు*
*ఒక్కొక్కటి గంగపాలయ్యాయి*
*దేవుడు మాత్రం యధాలాపంగా*
*ముసుగుతన్ని పడుకున్నాడు*

*ఆహా!*
*ఇప్పుడు నడుస్తున్నది నమోచరిత్ర*

31 జనవరి, 2025

*నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ అన్నట్లు ప్రజానుకూలమైన భిన్న ఆలోచనలకు మా పత్రికలో చోటుంటుంది. కనుక ఈ పత్రికలో ముద్రించిన అభిప్రాయాలు రచయితలవే. సంపాదకవర్గానికి ఏకీభావం ఉండనవసరం లేదు.*

# తెలంగాణ తొవ్వ

**సంపాదకీయం**

ఎవరీ గాజుకళ్ల పిల్లలు ! | **డా. చంద్రయ్య శివన్న** | 5

**ప్రొఫెసర్ కాలమ్**

ఉద్యమ కవితాస్త్రం అగ్నిధార | **ప్రొ. సూర్యాధనంజయ్** | 6

**సామాజికం**

విద్య–అంబేద్కర్ ఆలోచనలు | **డా. భట్టు కిరీటం** | 11

యుజిసి ముసాయిదా–2025: ఒక విశ్లేషణాత్మక పరిశీలన | **డా. శ్రీరాములు గోసికొండ** | 16

**తొవ్వ ముచ్చట**

"తెలుగు భాషోపాధ్యాయులకు ఆంగ్లం, కంప్యూటర్ నైపుణ్యాలు రెండు రెక్కలు" – ఆత్మకూరి ప్రశాంత్‌చారి | **డా. చంద్రయ్య శివన్న** | 21

**విమర్శ**

జిగిరి నవల – మానవ సంవేదనలు | **డా. గంధం వేణు** | 30

మద్దూరి సుబ్బారెడ్డి సాహిత్యం: పరిశీలన | **మంకముతక శ్రీనివాసులు** | 36

**పరిశోధన**

నగునూరి శాసనం – గంగాధర మంత్రి స్వీయచరిత్ర | **డా. కల్యాడపు రమేష్** | 43

**పల్లెసుద్దులు**

ఇచ్చంత్రపు ఇడుపుకాగిదం | **రవి కుర్మకోరె** | 47

**పరిశోధన పరిచయం**

తెలంగాణ మాండలిక నవలలు–భాషాపరిశీలన | **డా. మంత్రి మల్లేష్** | 49

సంపాదకీయం

# ఎవరీ గాజుకళ్ల పిల్లలు

**చంద్రయ్య శివన్న**

పాతికేళ్లయినా నిండని రోజారాణి దాసరి తను పూయించిన 'ఎర్రమల్లెల్ని' చేతిలో పట్టుకొని హడావుడిగా తిరుగుతోంది. మరో అమ్మాయి రిషిత తను రాసిన తొలి పుస్తకం 'టిట్ బిట్స్' గుండెలకు హత్తుకొని, తొలి ముద్రణ కాపీలన్నీ అమ్ముడుపోయాయి అంటూ ఆనందంతో కేరింతలు కొడుతోంది. అన్నట్టు ఆ సందర్భంగా కేక్ కూడా కట్ చేసిందోయ్. పదకొండు మంది యువకథకులు 'కథల చౌరస్తా'లో నిలబడి కబుర్లు చెప్పుకుంటున్నారు. మరో అబ్బాయి సురేంద్ర శీలం 'సదూరి మిద్దె'మీద నిలబడి తన పుస్తకాలు అమ్మడానికి మొహమాటపడుతూ కనిపించాడు. 'తీరొక్క పూలు'తో పట్నంమధ్యలోకొచ్చి నిలబడ్డాడు 'దండకడియ'ధారి తగుళ్ల గోపాల్. ఇంకో అమ్మాయి కడలి సత్యనారాయణ పాతవి, కొత్తవి కలుపుకొని మూడు పుస్తకాలతో ముప్పై మంది కంటపడుతోంది. అమెజాన్ లాంటి ఆన్లైన్ వేదిక మీదుగా పుస్తకాలను పాఠకుల ఇంటి ముంగిట చేర్చడంలో ఈమెది ప్రత్యేక దారి. యంగ్ పోయట్ హాతీరామ్ తన 'నల్లింకు పెన్ను'తోపాటూ మరికొంతమంది యువ కవులను వెంటేసుకొని తిరుగుతున్నాడు. జమీల్యా, మెమోరీస్ ఆఫ్ మంగలిపల్లె కథల సృష్టి, లయకారుడు నరేష్కుమార్ సూఫీ 'అవి' వెలిగిస్తూనే ఉన్నాడు. చరణ్ దొంతం పాలస్తీనా వెంటా, ప్రొఫెసర్ సాయిబాబా వెంట సూర్యోదయాన్ని కలగంటూ పరుగులు పెడుతున్నాడు. రాము పేర్ల, తెద్దామనుకుంటోన్న తన కవితా సంపుటి ఏ కారణాలచేతనో వాయిదాల పద్ధతిని అనుసరిస్తోంది. భారతదేశ ముఖచిత్రంపై ఉచ్చులుపోసి మలినంచేసినవారు ఈసారి మెర్సీ మార్గరేట్ ను వెంటాడారు. రవి రావెల్ల 'కృష్ణానగర్ వీధుల్లో' తిరగడం ఆపేసి 'బుక్ ఫెయిర్'లో తిరుగుతున్నాడు. చరణ్ పరిమి 'బొంబాయి పొట్టేలు' పోటీల్లో పాల్గొని, కథలమాంసాన్ని వడ్డిస్తున్నాడు. 'బర్మాకేంపు కథల'తో కథాకేంపును నిర్వహిస్తున్నాడు హరి వెంకట రమణ. భగీరథ ప్రయత్నంతో 'భగీరథ కోన'ను అన్వేషిస్తూ రేణుక్ వల్లెపు కనబడ్డాడు. 'ఎక్కడో ఒకరిద్దరికి తప్ప చాలావరకూ మన జీవితాల్లో ప్రత్యేక అద్భుతాలేం జరగవు' అని నమ్మే వివేక్ 'లంకమల దారుల్లో' ప్రయాణిస్తూ కనిపించాడు. రచయితలంటే ఇలాగే ఉండాలేమో అనేట్టు కనిపించే 'గన్స్&మాన్సూన్స్' మహి బెజవాడతో ఆ బుక్ స్టాల్‌కు కళవచ్చింది. నానీలకు సాఫ్ట్వేర్స్ ఇన్ స్టాల్ చేస్తోన్న కుడికాల వంశీధర్, 'లోపలి వాన' బాహిరంగా కురుస్తోంది. పూర్ణిమ తమ్మిరెడ్డి రాసిన 'ఎమోషనల్ ప్రెగ్నెన్సీ' టైటిల్ ఉలిక్కిపడేట్టు చేసింది. 'ద్రవిడ మహాసముద్ర'మంత మనిషి గూండ్ల వెంకటనారాయణను మరిచిపోవడమా అన్నన్నా. బాహుదా సుదర్శన్, 'బతుకు కథల్ని' ఏవో నెమరేసుకుంటున్నాడు. కవనమాలి 'వైతరిణీ ఒడ్డున' నిలబడి నీలికళ్ల చేపలతో సంభాషణలేవో కలుపుతున్నాడు. వీళ్లందర్నీ తమ వర్ణలిపితో సోషల్ మీడియాపై ముఖచిత్రాన్ని గీస్తోన్న కొంతమంది మనుషులున్నారు. ఆ మనుషులకు నాయకుడిగా కనిపిస్తాడు పాలమూరు వంశీ. ఆయనతోపాటూ కాదు కాదు ఆయనలాగే అఖిల, ఆదిత్య, రింగుల జుట్టబ్బాయి ఆరుద్ర ఈశ్వర్ లతో ఆయా రచయితలు ఫోటోలు దిగుతూ తారసపడ్డారు. ఇవన్నీ 'హైదరాబద్ బుక్ ఫెయిర్–2024' కాన్వాసుపై చిత్రితమైన ఈ–బతుకువర్ణచిత్రాలు.

వీళ్లలో చాలామందికి కనీసం పాతికేళ్లయినా నిండలేదు. వీరంతా ఈ–తరం సాహిత్య వారధులు. నిండైన ఆత్మవిశ్వాసం వీళ్ల విజిటింగ్ కార్డ్. విభిన్న సామాజిక నేపథ్యాలు వీరివి. వీళ్లకు తెలిసిన జీవితాల్ని మాత్రమే ఆవిష్కరిస్తారు. సిద్ధాంతాలకు కాకుండా జీవితాలకు అక్షరాలను తాపుతారు. అది బంగారు తాపడంలా మిలమిల మెరిసిపోతుంది. వీరి గాజుకళ్ల చూపులో చురుకుదనం. వ్యక్తీకరణలో నూతనత్వం, వెరసి వీరిది సరికొత్త ప్రచార తోవ. సోషల్ మీడియా వీరి జేబుల్లో చందమామ. దానిపై క్షణాల్లో ప్రపంచమంతా చుట్టివస్తారు. వీళ్ల సాహిత్యాన్ని తూచటానికి పాత ప్రమాణాలూ, భాషామనస్తత్త్వాలు సరిపడవు. ఏ విషయాల్ని దాచుకోని బోల్డ్‌నెస్ వీరి రచనల్లో కనిపించే సాధారణ సూత్రం. వీళ్లు వీరి కాలపు ఆలోచనల సాముదాయిక సంపుటి. ఈ 'కాలపు జీవనాడి' తెలియనివారికి ఏమాత్రం చిక్కని చేపపిల్లలు వీళ్లు. ఇక్కడ మునుగుతారు మరెక్కడో మెరుస్తారు.

అయితే, ఆశ్చర్యకరంగా ఈ ఐదేళ్లలో తెలుగు సాహిత్యం ఒక షిఫ్ట్ తీసుకొన్నట్టు అనిపిస్తోంది. ఈ షిఫ్ట్, 'కవిత్వం'నుంచి 'వచనం' వైపు జరిగినట్టు వీరి రచనలు ప్రకటిస్తున్నాయి. కొంతమంది కవిత్వ ప్రేమికులు ఒప్పుకోకపోయినా ఇదే నిజం. తెలంగాణ రాష్ట్రావతరణ తర్వాత చెప్పుకోదగ్గ, ప్రభావం వేయదగ్గ సామాజిక ఉద్యమాలేవీ లేకపోవడం, ఈ 'వచనం' ఎంపికకు కారణమై ఉంటుందా? ఆలోచించాల్సి ఉంది. సాధారణంగా ఉద్యమం తీరికనివ్వదు. దానికి భావోద్వేగం, ఝటితస్ఫూర్తి ప్రాణం. బహుశా వాటి అవసరంలేకపోవడంవల్ల దొరికిన తీరిక వచనాన్ని ఆశ్రయించేట్టు చేసి ఉండొచ్చు. కారణాలేమైనా వీరికి 'కథా సంగమం' ఏదో కావాలిప్పుడు. ముందుతరమంతా మెరిసే ఈ గాజుకళ్ల పిల్లలతో కలిసి నడవడమే తెలుగు సాహిత్యానికి దొరకే మేలితోవ.

T

# ఉద్యమ కవితాస్త్రం 'అగ్నిధార'

ప్రొ. సూర్యాధనంజయ్

**ఉపోద్ఘాతం:**

తల్లి తెలంగాణ నుదుటి మీద అక్షర కిరణమై ప్రభవించిన ముద్దుబిడ్డ దాశరథి కృష్ణమాచార్యులు. దేశభక్తిని, పుట్టిన గడ్డ మీద అనురక్తిని నరనరాన నింపుకున్న అక్షర శరథి, దాశరథి. మానవత్వమే మహాయుధంగా సత్య, ధర్మాలవైపు నిలబడిన కవితాగ్నేయాస్త్రం. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అంటూ గళమెత్తి దిగంతాలను దద్దరిల్లింపజేసిన కవి దాశరథి. నిరంకుశుల ఉక్కుపాదాల కింద నలుగుతున్న పీడిత ప్రజల గొంతుకగా, సాహితీలోక బంధువుగా తనదైన ప్రస్థానాన్ని కొనసాగించాడు దాశరథి. వీరి కలంనుండి రుద్రవీణ, పునర్నవం, మహాంధ్రోదయం, అమృతాభిషేకం, తిమిరంతో సమరం, కవితా పుష్పకం, గాలిబ్ గీతాలు వంటి గ్రంథ మాలికలు అనేకం జాలువారాయి. ప్రతీది ప్రసిద్ధమైన ఆయన రచనల్లో ఒకటి 'అగ్నిధార'. ఇది ఖండకావ్యం.

విరోధినామ సంవత్సరం 1949, సాహితీ మేఖల సంస్థ వారి ప్రచురణలో ఈ సంపుటి విడుదలైంది. విఖ్యాత రచయిత దేవులపల్లి రామానుజరావు ఈ గ్రంథానికి తొలిపలుకులు రాశారు. ఇందులో మొత్తం నలభై ఎనిమిది కవితలున్నాయి. ప్రతీ కవితా ప్రత్యేకమైనదే. దేశంలోని అగ్రభాగం ఆంగ్లేయుల చేతిలో పాలించబడితే, హైదరాబాదు రాజ్యం నైజాం రాజుల చేత పాలించబడుతూ, వారి పాలెగాళ్ళ చేతిలో అనేక దాష్టికాలను ఎదుర్కుంటున్న కాలమది. ప్రజలు ఎక్కడిక్కడ వీరి అఘాయిత్యాలను ఎదిరిస్తున్నారు. ఆనాటి ప్రజల రాజ్యధిక్కరణకు ఈ కవితా సంపుటి సాక్ష్యంగా నిలుస్తుంది. ఇందులోని కవితలన్నీ తెలంగాణ ప్రజల ఆత్మఘోషను వినిపించేవే. ఈ గ్రంథాత్మను విశ్లేషించుకోవడమే ఈ వ్యాసోద్దేశం.

'అగ్నిధార'లోని కవితలు కవిలోని మాతృభూమిపై, దేశ చరిత్రపై అవగాహనను, పీడిత జన పక్షపాతాన్ని వెలిబుచ్చుతాయి. భారతదేశ కీర్తిని "జెండా ఒక్కటే మూడు వన్నెలది/ దేశంబొక్కటే భారత ఖండా సేతుహిమాచలోర్వర...." అంటూ తొలి కవితలోనే దేశ సమైక్యతను కోరుకుంటాడు. వెనువెంటనే నైజాం చేత పీడితులైన రైతుల ధిక్కార స్వరాన్ని కవితగా వినిపిస్తాడు. **"ప్రాణములొడ్డి ఘోర గహ నాటవులన్ బడగొట్టి మంచి మా/ గాణములన్ సృజించి ఎముకల్ నుసిచేసి పొలాలు దున్నిభో/ షాణముల్ నవాబుకు స్వర్ణము నింపిన రైతుదే, తెలంగాణము రైతుదేబీ ముసలి నక్కకు రాచరీకంబు దక్కునే?.....!** అంటూ సాయుధ, సాహిత్య సమరాన్ని నడుపుతాడు. ఈ దేశంలో పుట్టి, ఇక్కడే పెరిగి, ఈ నేలలోనే చిరశాంతిని పొందే ఇక్కడి రైతులపై రజాకార్లు, దొరలు, దేశ్‌ముఖ్‌లు చేసిన దాడులకు ప్రతిఘాతాలు ఈ కవితా వాక్యాలు. భూమికోసం, భుక్తికోసం, విముక్తికోసం నాగళ్ళు విడిచి రైఫిళ్లను పట్టుకున్న రైతాంగ పోరాటాన్ని చిత్రిక పట్టిన ఈ కవిత అజరామరమైంది. చెమటోడ్చి, కష్టాల్ని చెంగుకు ముడివేసి, అడవులను చదునుచేసి, పొలాలుగా మార్చి పంటలు పండిస్తే గదా! నిజాం బొక్కసం నిండింది. అలాంటిది ఉపకారం మరచి అపకారం తలపెడితే పరిస్థితులు తారుమారైపోతాయని తెలియజెప్పడం ఈ కవిత ఉద్దేశ్యంగా అర్థం చేసుకోవాలి. 'దున్నేవాడిదే భూమి, పన్నుకట్టే వాడిదే రాజ్యం' అన్న సూత్రానికి ప్రాణం పోసిన దాశరథి సామ్యవాద భావానికి అక్షర సంతకంగా ఈ కవిత నిలిచింది.

ఈ కవితాంతంలో..... **"ఓ నిజాము పిశాచమా! కానరాదు/నిన్నుబోలిన రాజు మా కెన్నడేని/ తీగలను తెంపి అగ్నిలో దింపినావు /నా తెలంగాణ కోటి రతనాల వీణ"** అంటూ రతనాల సీమ అయిన తెలంగాణ వైభవాన్ని కొల్లగొట్టి ప్రపంచంలోనే ధనవంతుడైన రాజుగా చెలామణి అయిన నిజాం నిరంకుశ పాలనకు చెక్ పెడతాడు కవి. శ్రమదోపిడి సిద్ధాంతానికి అర్రులు చాచిన ఆనాటి పాలనా వ్యవస్థకు చెంపపెట్టులాంటి మాటలివి. ప్రజల సంక్షేమం గాలికి వదిలి భజన పరుల పొగడ్తల చెరలో బంధిగా మారిన రాజుకు కవి పాడిన నిరసన గీతమిది. అంతేకాదు హెచ్చరిక కూడా! రాజు తన పాలనా విధులను మరిచి క్రూరంగా జనహింసకు పాల్పడితే ప్రజల సహనం నశించి అగ్నిపర్వతాలై బద్దలవుతారు. పసిడి

పంటలతో, సాంస్కృతిక సౌభాగ్యంతో కళకళలాడే మాతృభూమిని రక్షించుకోవడానికి ఏకమవుతారన్న నిజాన్ని ఈ కవితా పాదాలు బట్టబయలు చేస్తాయి. 1788లో ప్రభుత్వ వైఫల్యాన్ని, పాలకుల నిరంకుశత్వాన్ని నిరసిస్తూ ప్రజల్లో పెల్లుభికిన ఫ్రాన్స్( ఫ్రెంచ్) విప్లవం ఈ సందర్భంగా కన్నుల ముందు సాక్షాత్కరిస్తుంది.

'ఉష' అనే మరో కవితలో ఉద్యమానికి, విప్లవానికి ఊపిరులూదుతూ..... **"రక్తిలలోచనమ్ములుక/ళారసధారాల పారణమ్ముతో/ వ్యక్తములయ్యే నా నుదుటి/ యందున కెంపులు దేరి, నిశ్చలా /వ్యక్త సమాధిలోన కల/మంది నిషా విషమెక్కిరాగ నా /రక్తముతో ఉషా కరత /లమ్ములలో కవనమ్ము లల్లెదన్......."** అంటాడు దాశరథి. ఈ కవితా పాదాలు గర్భీకృతమై సలసల మండుతున్న గుండెలకు లావాను అద్దినట్టు అనిపిస్తాయి. రాజ్యధిక్కరణకు, సామాజిక న్యాయానికి, సంఘసంస్కరణకు కదిలిన అభ్యుదయానికి రెక్కలు కడుతున్న దాశరథి ఇక్కడ దర్శనమిస్తాడు. ఆయనలో ఆయనకే తావులేక అమరులను సైతం కదనానికి కదిలించే కదనాగ్ని కనబడుతుంది. భూమికోసం, భుక్తికోసం, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం ఆత్మాభిమానాన్ని గుప్పిటపట్టుకొని సమరానికి సిద్ధమవుతున్న ప్రజల ఉద్యమ దావాగ్నిలా కవి ఇక్కడ కనబడతాడు. ఆయన రాసిన కవితా పంక్తులు పీడనాపరుల పాలిట పాశుపతాలై ప్రభవించాయన్నది అక్షర సత్యం. అలనాటి కవులు, నాయకుల నిజాయితి, సత్యనిష్ఠ, ఉద్యమం పట్ల తత్పరతను పాఠకులు అందుకుంటారు. నాటిని, నేటిని తులనాత్మకం చేసుకొని రాజ్యరక్షణకు నడుంకడతారు.

ఆనాటి ప్రజల జీవితాల్లో జీవనకళ పట్టుతప్పి కళావిహీనమై పేదరికం కోరల్లో ఇరుక్కున్న స్థితిని 'ఉగాది' అనే కవితలో దృశ్యమానం చేస్తాడు కవి. యుగాదికి చిరునామాగా ప్రకృతి పండుగ వైభవాన్ని వివరిస్తూనే పరోక్షంగా ప్రాంత ప్రజల జీవితాలలో దూరమైన వెలుగు జాడలను వెతుక్కుంటాడు మహాకవి దాశరథి. **"రిక్కలు రాలిపోవ విద/ళించు ఉషో గగనాంగ భాగమ/ ట్లోక్కకమారు కొప్పుపువు/లోల్కగ తళ్కుల పైట జార్చుచున్/ చక్కనిలేమ యొక్కతె ని/షా గొని వేపపువుం బ్రసాదముల్ /మెక్కుమటంచు పంచినది/మెక్కితి చక్కదనంపు తీపితో ......."** ఉగాదిని పురస్కరించుకొని దాని ఆరంభాన్ని ఎంతో హృద్యంగా వర్ణించిన కవిత ఇది. ప్రకృతికాంత వసంతాగమన శోభను వెచ్చగా, జీవితానుభవ కమ్మదనాన్ని వెదజల్లుతూ తనకు ప్రతిరూపంగా వేపపువ్వు పచ్చడిని లోకానికి అందించుతూ అరుదెంచిందంటాడు. ఈ ఘట్టాన్ని గమనిస్తే ప్రకృతికాంత ఉగాది పచ్చడి అనబడే అమృత వితరణ చేసినట్టుగా అనిపిస్తుంది. ఇవి లోకానికి ఉగాది ప్రత్యేకతను తెలుపుతున్న పంక్తులు. సమస్త సుఖాలు, సంపదలు, భోగభాగ్యాలు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కలిగి మానవీయ వికాసం ఉన్న సమాజానికి ప్రతీకలు ఈ వాక్యాలు. కాని మానవ సమాజం చెందాల్సిన వికాసం, అభివృద్ధి సంక్షుభితంలో ఉన్నప్పుడు ఆ జీవన విలయంలో విరోధి నామ ఉగాది రేపటి స్వతంత్ర తెలంగాణ ఉదయానికి బాటలు వేసినట్టుగా కవితనల్లాడు కవి. ఆ వాక్యాలు.... **"అవును ఉగాది వచ్చె, పది/ యారు కళల్ నశించిపోయి న/ ల్లవడిన చంద్రికా గృహము/ లన్ కళదేరెను, దారితప్పి పె/ ల్లవిసిన బాటసారి రస / నాగ్రమునందు మధూకమాలికా/ శ్రావ మధు విప్రుషమ్ములు వి/రాజిలె తాపము నింక పెంచగా......"** కవి ఇక్కడ ఉగాదిని ఉద్యమం స్థానంలో చూశాడని అనుకోవచ్చు. ఉద్యమం నాజీలను మించిన నవాబును, అతని సైన్యాన్ని మట్టికరిపించి స్వాభిమాన స్వాతంత్ర్యాల వైపు పయనించిన పలు సందర్భాలను కవి ఈ కవితగా నమోదు చేశాడు. గ్రామగ్రామాన ప్రజా ఉద్యమాలు పురుడుపోసుకొని కమ్యూనిష్టు నాయకుల నీడలో దొరల దాష్టికాలను ప్రజలు ఎదురిస్తున్నారు. ఉవ్వెత్తున ఎగసిన విప్లవ క్రాంతి మంటల్లో సమాజ పీడకులు దహించుకుపోతుంటే కళదప్పిన జీవన కళ కొత్తపొద్దుగా ఉదయిస్తుందంటాడు దాశరథి. దారితప్పిపోయిన మనుషులు ఏకమై మహాజ్వాలగా మారిన వేళ ఆనాడు ఉద్యమం విరోధి నామంతో ఏతెంచి ఉగాదిగా కొత్త ఉషస్సును నింపి నూతన మార్గాన్ని జనం ముందు నిలిపిందంటాడు.

కవి దిన సంధ్యలను, రాత్రి పగళ్ళను కవితా వస్తువులుగా చేసుకొని తెలంగాణ ఆత్మగోషను వినిపించాడు. అటువంటిదే 'పగలు' కవిత. ఈ కవితాంతంలో పాలకుడిని లోక పీడన రక్కసిగా చేసి కవనాన్ని నడిపాడు. **"తన నీడలో తానె కునికి పాటులు పడు / ఇఱ్ఱి గుండెల మీద ఎండ లెఱ్ఱనయ్యే/ పచ్చపచ్చని ఆకు బ్రతుకు చూడగలేక/ మఱ్ఱిపండులకన్న లెఱ్ఱనయ్యే ......"** అంటూ ఎండను నవాబుగా, అతని క్రూర పాలనగా భావించి, అతడు చేసిన అకృత్యాల వల్ల తెలంగాణ ప్రజలు పొందిన వేదనను అక్షరమాలిక చేస్తాడు. ప్రశాంతంగా పనిలో దైవాన్ని చూస్తూ, పసిడిని పండించే కర్షకుల గుండెల మీద పన్నుల కుంపటిని వెలిగించిన పాలకవర్గాల పాలనా తీరును, దొరల దోపిడీ

కారణంగా ఇక్కడి జనులను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేయబడ్డ విధాన్ని కవి కవిత సాక్షిగా ఎండగడతాడు. కవితాంతంలో... **"ఏమిటో ఈ జగత్తు సహింపరాని / షడ్రుతు గణమిది: జీవిత స్వర్గమెల్ల/ నరకమైన విషాద మానవుడు వీడు:/ నరపతులకెల్ల ఘోర దానవుడు వీడు...."** అంటూ పాలకుని కిరాతక పాలనకు అద్దం పడతాడు. ఈ వాక్యాలు చాలు 1940 కాలంలో ప్రజలు రాజుచేత అతని పాలనాధికారుల చేత ఎంతటి ఘోర హింసలను అనుభవించారో అర్థం చేసుకోవడానికి. పాశవీకుడైన ఆనాటి పాలకుని స్వభావాన్ని నేటి పాఠకుల ముందు ప్రత్యక్షం చేయిస్తాయి ఈ వాక్యాలు.

తన రెక్కలను హలాలుగా చేసి, తన రక్తాన్ని చెమటగా చిందించి భూమి పొరల్ని పచ్చదనంతో వికసింపజేసి బంగారు పంటలు పండించే రైతన్నల శ్రమకు అక్షర పుష్పాలతో అర్చన చేస్తాడు దాశరథి. అతని రెక్కలు భారతావని ధాన్యరాసుల భాండాగారాన్ని నింపిన వైనాన్ని లోకపరం చేస్తూ.... **"పంట పొలాలలోన తెల/వారులు నిద్దుర కాచి వేకువన్/ ఇంటికి వచ్చి చద్ది మెతు/కెంగిలి చేసియో చేయకో పసుల్/ వెంటబడంగ కాననము/ వీధుల బోయెడి కాపుబిడ్డ! నీ/ వంటి స్వయం ప్రపోషణ వి/ భావము రాజుల కబ్బజాలునే!....."** అంటూ 'రైతు' అనే శీర్షికతో రాసిన కవితను అతని రెక్కల సాగుకు చిరునామాను చేశాడు. ఎండనక, వాననక, రాత్రనక, పగలనక ధరణిమాతను నమ్ముకొని సేద్యం చేసే రైతన్నకు తినడానికి సరైన తిండికూడా కరువైన ఆనాటి స్థితికి ప్రతిబింబంగా నిలుస్తుంది ఈ కవిత. పశువులనే తన తోబుట్టువులుగా, ఆసరాగా, ఆలంబనగా చేసుకొని అటవీ వీధులలో నిర్భయంగా సంచరిస్తూ సమస్త మానవాళి కడుపులు నింపుతాడు రైతు. కష్టాలను గుండెల్లో దాచుకొని ఖజానా ఖాళీని భర్తీచేస్తాడు. అప్పుల్ని చేతి రాతలుగా తన సర్వస్వాన్ని ధారపోసి భూస్వాముల గుమ్ముల్ని నింపుతాడు. అటువంటి రైతన్న పరోపకారము రాజులకు ఎట్లా అబ్బుతుంది? అంటూ ప్రశ్నను లేవనెత్తుతాడు ఇక్కడ కవి.

ఈ కవితలో ఆనాటి రైతులు దోపిడీకి గురవుతున్న వైనాన్ని కవి చిత్రికపట్టిన తీరును గమనించవచ్చు. రైతుల దుఃఖాల్ని కనులారా చూసిన కవి హృదయం ఎంతగా కమిలిపోయిందో, ఎంతగా ఆర్ద్రంగా స్పందించిందో ఇక్కడ మనం అర్థంచేసుకోవచ్చు. సంవేదన లేనివాడు కవికాలేడు. కవికి మాత్రమే సంవేదనశీలత ప్రబలంగా ఉంటుందన్న సత్యం కూడా ఈ సందర్భంగా పాఠకులు గ్రహిస్తారు.

మరొక కవితలో కూలీనాలి చేసుకుంటూ బతుకు బండిని మగవారితో సమానంగా ఈడ్చే మహిళా కార్మికురాలి గురించి, ఆమె చుట్టూ అల్లుకున్న మోసాల సాలెగూడులాంటి దోపిడీ సమాజాన్ని గురించి  చెబుతాడు. కవి గుండెల్లో మండిన కవితాగ్నికి ప్రతిరుపామా! అన్నట్టుగా ఈ కవిత సాగుతుంది. సామ్యవాద భావనకు సమాజంలో బీజాలు నాటే ఈ కవిత..... **"ఓసి కూలిదానా! అరుణోదయాన/మంటి తట్టాను నెత్తినబెట్టి మరుగులేని/ యెత్తు రొమ్మును పొంగించి ఎందుకొరకు/ ఉస్సురనెదవు? ఆకాశ ముడికిపోవ/ అంబర చుంబి సౌధముల/ కాయువు పోసేది నీశ్రమ ప్రభా/ వంబు నెరుంగలేని ధన/ వంతుల బంగరు పళ్ళేరాలలో/ అంబలి పోసి త్రావు సమ/ యంబులు దగ్గరలెమ్ము! నీ నవాస్యంబున రుద్రనేత్ర విల/ యాగ్నుల కుంకుమ బొట్టు పెట్టుమా..."** అంటూ పల్లెల్లోని పొలాల్లో, పరిశ్రమల్లో, గనుల్లో, నగరాలలో, భవననిర్మాణ పనుల్లో రోజువారి కూలి చేసుకుంటూ పురుషాధిక్య సమాజానికి తన శ్రమతో సవాలుచేసే స్త్రీమూర్తులను ఉద్యమానికి కదిలిస్తాడు కవి. సామ్యవాద స్ఫూర్తితో ప్రపంచ విప్లవాల అనుసరణలో తెలంగాణ మహిళామణులను విప్లవోద్యమానికి సాయుధుల కమ్మంటాడు. పొద్దు పొడిచినప్పటినుంచి పొద్దు గూకేదాక మగవారికి సమానంగా పనిచేసే స్త్రీ కూలీలపట్ల జరుగుతున్న అమానుషతను, అసమానతలను ఎత్తిచూపుతూ హక్కుల ఉద్యమానికి అరుణోదయాన్ని కుంకుమబొట్టుగా ధరించమంటాడు. ఈ కవిత చదివాక మహిళా స్వాతంత్ర్యాలకోనం ప్రపంచవ్యాప్తంగా జరిగిన, జరుగుతున్న ఉద్యమాలు గుర్తుకువస్తాయి. 1832లో అమెరికాలో ప్రారంభమైన స్త్రీవాద ఉద్యమం ప్రపంచమంతా విస్తరించి అభినవ క్రాంతిని రాజేసిన తీరు, దానికి అనుగుణంగా స్త్రీ కార్మికులను కవి కదిలించడం గమనించవచ్చు. కవికి ఉన్న ముందుచూపు ఇక్కడ దర్శనమిస్తుంది. లింగ, గృహ, శ్రమ, శాసన, వేతన, రాజకీయ, ఆర్థిక, సామాజిక సమానత్వం వైపుగా స్త్రీకి ఎంతటి సమాన హక్కులు ఉన్నాయో కవికి ఆనాడే అవగతంగా ఉన్నాయని అర్థమవుతుంది.

తెలంగాణ విముక్త పోరాటంలో కవితాగ్నిబరాటై జ్వలించిన చేతనం దాశరథి. అతని అక్షరాల వేగాన్ని, అవి మండించే విముక్త జ్వాలల వేడిని తట్టుకునే శక్తి అలనాటి

పాలకులవల్ల కాలేదంటే అతిశయోక్తి కాదు. తనలోని మాతృదేశ గౌరవాన్ని, విద్వేషకులు, ప్రజా పీడకుల నుంచి పుట్టిన గడ్డను కాపాడుకొనుటకు ఆయన పడ్డ వేదన అంతాఇంతా కాదు. ఆయనలోని ఉద్యమాగ్ని 'అంతర్నాద'మై కవితగా ప్రభవించింది. **"నా గీతావళి ఎంత దూరము ప్రయా/ణంబౌనొబీ అందాక ఈ/ భూగోళమ్మున అగ్గివెట్టెదనుబీని/ప్పుల్ వోసి హేమంత భా/ మా గాంధర్వ వివాహ మాడెదను: ద్యో/మన్యుష్ణ గోళమ్ముపై/ ప్రాగాకాశ నవారుణాప్ర జలధా/రల్ చల్లి చల్లార్చెదన్....."** అంటూ తన కవితాధారతో ప్రపంచాన్ని విమోచనోద్యమానికి కదిలిస్తానంటాడు. సంవేదనను అర్థం చేసుకునే హృదయాలు, అన్యాయాన్ని అంతం చేయాలనే తలంపుగల వ్యక్తుల మాధ్యమంగా సమస్త విశ్వాన్ని కవితాభావమై అలుముకుంటాడు. అగ్నిగుండాన్ని అర్ధాంగంగా చేసుకొని అనంతాకాశ భూమండలాదుల మీద ప్రభలుతున్న అన్యాయాగ్నిపై వారుణాస్త్రమై వర్షిస్తానంటాడు. కవికి ఉండాల్సిన లక్షణాలను కవి ఇక్కడ అంతర్లీనంగా ప్రకటిస్తాడు. కవి లోకకళ్యాణకారి అని, అతని కవనం జనచైతన్యానికని, లోకోపకారానికి కలం కదిలించాలని గుర్తుచేస్తాడు. నన్నయ, తిక్కనాది, సోమనాథుల 'జగద్ధితంబు' భావనను యాదికి తెస్తాడు. అంతేకాదు తను కవిగా తన కర్తవ్యాన్ని సంపూర్ణ నిష్ఠతో నిర్వర్తిస్తున్నాడు. తెలంగాణ జన కళ్యాణానికి తన సర్వం సహా ఒడ్డుతున్నాడు.

తాను అన్యాయాన్ని ఎదిరించుటకు ఎటువంటి అడుగునైనా వేయడానికి సిద్ధమంటూ తన అంగీకారాన్ని ప్రకటిస్తూ **"మానవుల నెత్తురులు త్రాగు మానవులును/ దానవులె గాక మానవత్వంబు కలదె?/ దానవుల నంతమొందింప నేను కూడ/ రామకృష్ణావతార ధారణము సేతు..."** అంటాడు. తనను తాను పరమాత్మ అంశగా **"యదాయధాది ధర్మశ్య గ్లానిర్భవతి భారత...."** అన్న గీతాశ్లోకాన్ని నిజం చేస్తాడు.

తెలంగాణ విమోచన విప్లవోద్యమాన్ని తన భుజానికెత్తుకొని పయనించినందుకు దాశరథిని తన కార్యక్షేత్రంనుండి వేరుచేసిన ప్రభుత్వం నిజామాబాద్ సెంట్రల్ జైలుకు తరలించింది. నిజామాబాదును ఒకనాడు ఇందుపురమని, ఇందూరు అని పిలిచేవారు. ఆ జైలు గోడల్ని తన కవన సాధనంగా, బొగ్గునుసిని చమురుగా చేసుకొని కవితల్ని ఉద్యమానికి మళ్లించాడు కవి. అంతేకాదు నిజామాబాద్ జైలును, అచటి మట్టికున్న చారిత్రక జిగిని 'ఇందుపురదుర్గం' (నిజామాబాదు సెంట్రల్ జైలు)గా కవిత్వీకరించారు.... **"ఇది చారిత్రకం ఆయిన/ నీ మహదాలయమో! ఇదే మహా/కదనము కోసమై మలచి/కట్టిన దుర్గమో! భారతీయ సం/పదలను కొల్లగొట్టిన న/వాబుల గూబలు గయ్యనన్, బదా/బదలయి ఫోన్ మరాఠీ భట/వర్గము లొత్తిన శంఖపుంఖమో....."** అంటూ తెలంగాణ భూమిని జాగృతం చేసిన వీరులను ఉద్యమోన్ముఖులను చేసిన ఘనమైన జ్ఞానకేంద్రంగా నిజామాబాదు జైలును చెబుతాడు. ఈ ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకొని శివాజీ నాయకత్వంలో మరాఠీ వీరులు గడ్డిపోచలలో సైతం దేశభక్తిని రగిలించి స్వరాజ్యం కోసం కదనం చేయించారంటాడు. భారతీయుల శ్రమను దోచుకొని ఎదిరించిన వారిని హింసించడానికి కట్టిన ఇటువంటి కారాగారాలు నేడు విప్లవ వీరుల శంఖ నాదాలతో మారు మ్రోగుతున్నాయని పాలకులను హెచ్చరిస్తాడు.

ఇదే జైలులో తాను "మా నిజాము రాజు తరతరాల బూజు, నా తెలంగాణ కోటి రతనాల వీణ" అంటూ నినదించి అసమర్థ, అన్యాయ, అధర్మ, నిరంకుశ నైజాం ప్రభువుకు అక్షరాల సాక్షిగా ఎదురుతిరిగాడు. కవి చేసిన ఈ ఒక్క తిరుగుబాటు చాలు అలనాడు ఎంతటి ప్రతిఘటన ప్రజలనుంచి ఎదురైందో అర్థం చేసుకోవడానికి. పుట్టినగడ్డ కోసం సమస్తాన్ని సమర్పించి ప్రాణాలను సైతం ఒడ్డడానికి జనులు సిద్ధపడ్డారనడానికి. 'కవి సమాజ హితకారి' అన్న మాట దాశరథి విషయంలో సంపూర్ణంగా సార్థకమైందని చెప్పవచ్చు.

మరొక కవిత **'వీరాంధ్రుడా!'** అన్న శీర్షికతో తెలుగు జాతి వైభవాన్ని, ఇక్కడి చారిత్రక ప్రశస్త్యాన్ని వివరిస్తూ సాగుతుంది. ఒకనాడు తెలుగు సామ్రాజ్యలత కటకం నుండి కన్యాకుమారి దాకా వ్యాపించి దాని సౌభాగ్య గరిమను సమస్త ప్రపంచానికి చాటింది. అటువంటిది పరదేశీయుల పాలనలో ఇరుక్కొని తన విశాల సాంస్కృతిక, రాజకీయ, సామాజిక అస్తిత్వ మహిమను ఎలా పోగొట్టుకున్నదో తెలియజేస్తూ కవి దాని పునః స్థాపనకు తెలుగు వీరులను ఉద్యుక్తులను చేస్తాడు. **"పటు బాహాబలురైన ఆంధ్రుల గత/ప్రాశస్త్యముల్ వల్లె వే/యుటలో కొన్ని తారలు దాటినవిబీపూ/ ర్వోదంతముల్ నేటి సం/కతముల్ తీర్పవుగాక, నాటి జ్వలితాం/గారమ్ము లీనాటి కుం/పటిలో బూడిద కప్పుకొన్నవి, రగు/ల్పన్ లెమ్ము వీరాంధ్రుడా/ ముక్కలు ముక్కలై చెదరి/పోయెనురా! మనజాతిబీహూణాభూ/భుక్కుల రాజనీతికి....."** అంటూ తెలుగుజాతిని మేల్కొలుపుతాడు. శాతవాహన, ఇక్ష్వాకు, వేములవాడ చాళుక్య, చోళ, కాకతీయ,

విజయనగరాది విష్ణుకుండిన ఘన రాజవంశాల నీడలో సామాజిక, రాజకీయ, సాంస్కృతిక వైభవాన్ని సంపాదించుకున్న తెలుగునేలపై రాహువు నీడలు అలుముకున్నాయి. వాటిని కోటి సూర్యుల తేజంతో రూపుమాపి జాజ్వలమానమైన వైభవాన్ని మళ్ళీ పునరుద్ధరించాలని తెలుగువారికి ప్రబోధిస్తాడు. పరరాజుల పాలనలో మసిబారిన పాలనకు చరమగీతం పాడడానికి వీరులను ముందుకు నడిపిస్తాడు.

ఈ ఖండకావ్యం ఒక జంగుసైరన్. ఒక ఉద్యమగీతం. దాని రాగాలు విప్లవధ్వనులై తెలంగాణ విమోచనానికి కదం తొక్కాయి. ఖండితమైన శిరస్సులు, మానవతుల సమ్మానాలు, సాయుధుల తుపాకులు శ్రామికజాతిలో అగ్నిధారలను ప్రవహింపజేయగా దెబ్బతిన్న బెబ్బులివలె లేచింది శ్రామిక సమాజం. దాని హుంకారాన్ని..... **"తరతరాల/దరిద్రాల/ బరువులతో/కరువులతో/క్రుంగిక్రుంగి/కుమిలి కుమిలి/ కష్టాలకునష్టాలకు/ ఖైదులకూ/కాల్పులకూ/ సహనంతో/ శాంతంతో/ బలిపశువై/ తలవాల్చిన/ దీనపరా/ ధీనజాతి/ శ్రామిక జాతి/దెబ్బతిన్న/బెబ్బులివలె/మేల్కొన్నది/మేల్కొన్నది....."** అంటూ కష్టజీవుల కర్మజలాలు ఉప్పెనలై కదిలిన తీరును వివరిస్తాడు. కార్ల్ మార్క్స్ సిద్ధాంతాలను జీర్ణించుకొని హక్కులకోసం, అభ్యున్నతి కోసం, స్వేచ్ఛకోసం, భూమికోసం. భుక్తికోసం, పీడితజాతి విముక్తి కోసం వెల్లువలై కదిలిన శ్రామికశక్తికి ప్రతిరూపాలు ఈ అక్షరాలు. ఇన్నాళ్ళు భయం చాటున, సామాజిక, ఆర్థిక వివక్ష కారణంగా వెనుకంజ వేసిన వాళ్ళు నేడు నిజం తెలుసుకున్నారు. తమతో జరుగుతున్న దోపిడిని, వివక్షను గురించి తెలుసుకున్నారు. సమరం చేస్తున్న సవాల్ ఈ కవిత. హక్కులు పాడుతున్న సత్యాగ్రహజ్వాల ఈ కవిత.

పంచభూతాలు, ప్రకృతి చేసిన త్యాగాలు, తనను తాను మానవ హితానికి మార్పును బదాలయింపు చేసుకున్న భూగోళం. దాని ఫలితం నేటి ఈ మానవ నివాస గోళం. ఎందరో వీరులు చేసిన త్యాగాలకు ప్రతిరూపం ఈ జన్మభూమి. ఈనాటి మన సమాజం. దీని నిర్మాణానికి సమస్త ప్రకృతి తననుతాను రూపుమాపుకొని మానవుని కోసం సరికొత్తగా అవతరించిన తీరును.... **"ఆ చల్లని సముద్రగర్భం/దాచిన బడబానలమెంతో?/ ఆ నల్లనిఆకాశంలో/కానరాని భాస్కరు లెందరో?/ భూగోళం పుట్టుకకోసం/ కూలిన సుర గోళాలెన్నో ?/నర మానవ రూపంకోసం/ జరిగిన పరిణామాలెన్నో..."** అంటూ మనిషికోసం తన అస్తిత్వాన్ని నిత్యం మార్చుకొనే ప్రకృతిశక్తి త్యాగాన్ని స్మరిస్తాడు. ఇదే కవితలో ప్రకృతి పంచిన సంపదను స్వాధీనం చేసుకోవడానికి బలవంతులు చేసిన ఆక్రమణలు, ఆ స్వార్థపరుల పేరాశకు అసువులు బాసిన అమాయకుల, నిర్దోషుల బలిదానాలను గుర్తుచేసుకుంటాడు కవి. అడుగడుగునా పొంచివున్న సామ్రాజ్యవాద పోకడలను నిరసిస్తూ ప్రాకృతిక సహజ జీవనాన్ని బలపరచిన కవితగా ఈ కవిత నిలిచిపోయింది.

రవీంద్రుని కవితలకు తెలుగు అనువాదం చేస్తూ 'రారమ్ము' అంటూ దేశసేవా భాగ్యాన్ని అందరికీ పంచుతాడు. అందరినీ పంచుకొమ్మంటాడు. **"మనసు క్రోధాన బండవారినవు డెల్ల / కనికరపు వానజల్లుతో కదిలిరమ్ము!/ స్వాంతమందు కారుణ్యంబు సడలు నెడల/ అమర గానముతోడ నన్నరసి పొమ్ము..."** అంటూ నిరాశకు పోక బానిస సంకెళ్ళు త్రెంచి దేశానికి పరదేశీయులనే చొరబాటుదారుల పీడ వదిలిద్దామంటాడు. తన 'మహాలేఖిని' లోకి అనలజ్వాలను ఆహ్వానించి... **"పద్దెము వ్రాయుచున్ వెనక వైపుకు చూడకు లేఖినీ! మహా/పద్దశ దాపురించును గ/బా గబా గుంజుము వేన వేలుగా/ పద్దెముబీ లర్థవాదముల/ పై కనులుంచకుమా! పదావళుల్/ ముద్దులు గార్చుచున్ కనుల/ ముందర తాండవ మాచరించెడిన్ ..."** అంటూ తన కలాన్ని అన్యాంశాల వైపుకు, ప్రాపంచికాల వైపుకు కదలకుమంటాడు. అంతిమంగా **"భయపడను వానగాలికి, వరద దెబ్బ/కాకలికి, అశ్రువులకు, త్రేతాగ్ని కేనిబీ/వెలుగు చీకట్ల మధ్య తప్పించుకొనుచు/భండన మొనర్చు దివ్యకోదండి నేను"** అంటూ నియంతల మీదికి అగ్నిధారను కురిపిస్తాడు. కవిగా, ఉద్యమకారునిగా, భరతజాతి, తెలుగుజాతి ముద్దుబిడ్డగా తననుతాను దేశమాత సేవకు అంకితం చేసుకుంటాడు.

ఈ విధంగా దాశరథి కవితా సంపుటాల్లో ఉద్యమకేతనాన్ని ఎగరవేసిన సంపుటి అగ్నిధార. అక్షరాన్ని ఆయుధంగా చేసుకొని తెలంగాణ సాయుధ పోరాట యజ్ఞానికి వెన్నుదన్నుగా నిలిచిన ఖండకావ్యమిది. కవి హృదయ స్వచ్ఛత, జన్మనిచ్చిన మట్టిపట్ల అంకితభావానికి నిలువుటద్దం. పోరాటమే దాశరథి. దాశరథి అన్న పోరాటం. అన్నట్టుగా ఆయన అస్తిత్వాన్ని చిత్రించిన గ్రంథమిది. సాయుధులను విజయ తీరాలకు నడిపి నవీన సామ్యవాద రాజ్యానికి పునాది రాళ్ళను వేసిన దాశరథి ఉద్యమ స్ఫూర్తి ఈ కవితామాలిక. తొలిమలి దశల తెలంగాణ ఉద్యమాలకు ఊపిరిలూది స్వరాష్ట్రోదయానికి కారణమైన కవి. నేటికి విమోచన పోరాటాల్లో నిత్యం ప్రభవిస్తూనే ఉంటాడు. కవితాగ్నిధారలై కురుస్తూనే ఉంటాడు.

**రచయిత: వైస్‌చాన్స్‌లర్, మహిళా విశ్వవిద్యాలయం**

# విద్య-అంబేద్కర్ ఆలోచనలు

డా॥భట్టు కిరీటం

భారత ప్రభుత్వం 'జాతీయ విద్యావిధానం 2020' (National Education Policy-2020)ను, ప్రవేశపెడుతూ తీసుకున్న నిర్ణయం మేరకు 2020 జూలై, 29న కేంద్ర మంత్రి వర్గం NEPని ఆమోదించింది. ఇది భారతదేశ నూతన విద్యా వ్యవస్థ దృక్పథాన్ని వివరిస్తుంది. ఈ విధానం ప్రాథమిక విద్య నుండి ఉన్నత విద్య వరకు అలాగే గ్రామీణ, పట్టణ భారతదేశంలోని వృత్తిపరమైన శిక్షణకు సంబంధించిన సమగ్ర నివేదిక. ఈ విధానం 2030 నాటికి భారతదేశ విద్యా వ్యవస్థను మార్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. భారతదేశంలో విద్య అనేది ఉమ్మడి జాబితాలో ఉంది. కాబట్టి, దీని అమలుపై రాష్ట్రాలు కూడా బాధ్యత వహిస్తాయి. దీని అమలుపై రాష్ట్రాలు, సంస్థలు, పాఠశాలలు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా విద్యా కమీషన్‌ను ఏర్పరుస్తూ 2024 సెప్టెంబర్ 3న జీఓ 27ను విడుదల చేసింది. శిశు విద్య నుంచి యూనివర్సిటీ విద్య వరకు సమగ్ర విధానాల రూపకల్పన మౌలికమైన మార్పులు తీసుకురావడమే ఈ కమిషన్ లక్ష్యం. అలాగే ఈ మధ్యే స్కిల్ యూనివర్సిటీని కూడా ఏర్పరుస్తూ నిరుద్యోగ యువతకు వివిధ రంగాలలో వృత్తిపరమైన నైపుణ్యతను అందజేస్తామని చెప్తోంది. ఈ దేశంలో 80శాతం బడుగు, బలహీన వర్గాలే ఉన్నాయి కాబట్టి వారి విద్యావసరాల గురించిన సమూలమైన మార్పు చోటు చేసుకుంటున్న సందర్భంలో అసలు దశాబ్దాల క్రితమే పేద ప్రజల విద్యావకాశాల గురించి ఎంతో ముందు చూపుతో ఆలోచించిన మన రాజ్యాంగ నిర్మాతల్లో ఒకరైన డా. బి.ఆర్. అంబేద్కర్ ఆలోచనలేమిటో చర్చించడమే ఈ వ్యాస ఉద్దేశ్యం.

అంబేద్కర్ విద్యపై తన ప్రాధాన్యతను వివరిస్తూ విద్యను ప్రపంచాన్ని మార్చే సాధనంగా మాత్రమే ఆమోదించాడు. ప్రజలు సామాజిక వాస్తవాలను అర్థం చేసుకోవడానికి విద్యావంతులైతే తప్ప ప్రజాస్వామ్యం ముందుకు సాగదని అభిప్రాయపడ్డారు. అందువల్ల అంబేద్కర్ ఒక వ్యావహారికసత్తావాదిగా బహుజనుల విద్యా అభ్యున్నతి సమస్యను సంప్రదించారు. కూడు, గూడు, గుడ్డతోపాటు ప్రాథమిక అవసరాల్లో విద్య కూడా ఒకటని చెప్పారు. డ్యూయీ ఆలోచనలు అంబేద్కర్‌కు సమాజం, మతం, రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థ, చరిత్రకు సంబంధించిన సమస్యల క్రమబద్ధమైన విశ్లేషణకు ఆధారాన్ని అందించాయి. అంబేద్కర్ ప్రకారం విద్య అనేది డ్యూయీ వ్యావహారికసత్తావాదం, బుద్ధుని 'ధమ్మం' కలయిక. విద్య ప్రజల సామాజిక చైతన్యానికి ఒక ఇంధనం మాత్రమే కాదు, వారి ఆధునికీకరణకు తలుపులు కూడా తెరుస్తుంది.

అంబేద్కర్ సామాజిక విముక్తికోసం లౌకిక విద్యను నొక్కి చెప్పారు. అతని విద్యా తత్వశాస్త్రం ప్రాథమిక సూత్రాలు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం, నైతిక స్వభావం. ఈ విలువలను అందరు బాలబాలికలలో పెంపొందించడమే అంబేద్కర్ ప్రధాన దృష్టి. అంబేద్కర్ జ్ఞానం యొక్క రెండు ప్రయోజనాలను గుర్తించారు. అవేమిటంటే ఇతరుల ప్రయోజనంకోసం సంపాదించడం, ఒకరి స్వంత ప్రయోజనంకోసం సంపాదించడం. అంబేద్కర్ సామాజిక పురోగతి భావనలో న్యాయమైన, సమాన సమాజం గురించి అతని దృష్టిలో విద్య విప్లవాత్మక పాత్రను పోషిస్తుంది. ఇది కుల అసమానత, పితృస్వామ్యం అణచివేత నుండి విముక్తికి కీలక సాధనంగా పనిచేస్తుంది. సమాజంలో ఒక కొత్త సామాజిక వ్యవస్థ నిర్మాణానికి ఒక ఛానెల్‌గా గుర్తించబడింది. స్త్రీలు ఈ దూరదృష్టితో కూడిన సమతావాదానికి అనుకూలంగా ఉండాలి. 20వ శతాబ్దం తొలి దశాబ్దాలలో అంబేద్కర్ నేతృత్వంలోని దళిత విముక్తి ఉద్యమంలో దళితులు రాజకీయ స్పృహతో సమీకరించబడ్డారు. అధికారిక విద్యారంగంలో మహిళల రాజకీయ ప్రమేయానికి గణనీయమైన ప్రాధాన్యత ఇవ్వబడింది. స్త్రీలు రాజకీయ విద్యావేత్తలు, విద్యా కార్యకర్తలుగా మౌలికమైన పాత్రను పోషించాలని సూచించారు.

విద్య ప్రభావవంతమైన, పరివర్తనాత్మక లక్షణంపై దాదాపు సిద్ధాంతపరమైన నమ్మకాన్ని అభివృద్ధి చేసిన అంబేద్కర్, కుల లేదా హోదాతో సంబంధం లేకుండా అందరికీ విద్య

అందుబాటులో ఉండాలని భావించారు. “విద్య అనేది ప్రతి ఒక్కరికి అందుబాటులోకి తీసుకురావాల్సిన విషయం.” (డా. బి.ఆర్. అంబేద్కర్ ప్రసంగాలు, సంపుటం – 1, పుట. 376). అంబేద్కర్ భారతదేశంలోని బ్రిటీష్ వారి విద్యావిధానాన్ని లోతుగా పరిశీలించాడు. భారతదేశంలో విద్య ఎల్లప్పుడూ సమాజంలోని ఉన్నతస్థాయి ప్రజలకు మాత్రమే పరిమితం చేయబడిందని కనుగొన్నాడు. “దిగువ తరగతుల సభ్యుల మధ్య విద్యావ్యాప్తి భారతదేశంలో తమ ఉనికికి హాని కలిగిస్తుందని బ్రిటిష్ వారు భయపడినందున, విద్యారంగాన్ని ఉద్దేశపూర్వకంగా ఉన్నత తరగతులకు పరిమితం చేశారు. అటువంటి విద్యావిధానంవల్ల అత్యంత దారుణంగా బాధపడేది అంటరానివారు. పాఠశాలల్లో వారి విభజన ఖచ్చితంగా ఉంది. వారు ఆలయ పాఠశాల పవిత్ర ప్రాంగణం వెలుపల కూర్చోవలసి వచ్చింది. వారికి తాగునీరు అందలేదు. అంటరాని విద్యార్థులకు విధించే శిక్షా విధానం కూడా హిందూ విద్యార్థులను శిక్షించే పద్ధతికి భిన్నమైనది.” (డా. బి.ఆర్. అంబేద్కర్ ప్రసంగాలు, సంపుటం – 1, పుట. 378)

‘విద్యను ప్రతి ఒక్కరికి అందుబాటులోకి తీసుకురావాలని అంబేద్కర్ ఉద్దేశ్యం. అంబేద్కర్ దృష్టిలో విద్యాశాఖ ఒక విభాగం కాదు, ఇది క్విడ్ ప్రోకో ఆధారంగా పరిగణించబడుతుంది. విద్యను అన్ని విధాలుగా సాధ్యమైనంత వరకు చౌకగా ఇవ్వాలి. ఎందుకంటే సమాజంలోని అట్టడుగు వర్గాలు, వెనకబడిన తరగతులు మాధ్యమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లోకి ప్రవేశించే దశకు చేరుకున్నాయి”. (అంబేద్కర్ 1982:40–41).

భారతదేశంలోని వివిధ తరగతుల మధ్య విద్యావకాశాల లభ్యత, వినియోగంలో ఉన్న అసమానతలను అంబేద్కర్ వ్యతిరేకించారు. జనాభాకు అనుగుణంగా విద్యారంగంలో అణగారిన తరగతులు ఎక్కువగా బాధపడుతున్నారని ఎత్తి చూపారు (అంబేద్కర్ 1982: 39–44). “ఆర్థికంగా లేదా సామాజికంగా చెప్పాలంటే, వెనుకబడిన తరగతులు ఇతర ఏ సమాజమూ వికలాంగులు అవని విధంగా వికలాంగులయ్యారు. అందువల్ల వెనకబడిన తరగుతులకు అనుకూలమైన చికిత్సను అందించాలని సూచించారు.

స్వాతంత్ర్యం తర్వాత రిజర్వేషన్ల అంశంపై లేవనెత్తిన విభిన్న వివాదాల సందర్భంలో మరింత అభివృద్ధిచెందగల భారతీయ సమాజంలోని అన్ని బలహీన వర్గాలకు సమాన అవకాశాలను అందించడానికి అనుకూలంగా ఒక తార్కిక వాదనను కూడా అభివృద్ధి చేశారు అంబేద్కర్. “ఈ దేశం విభిన్న వర్గాలతో కూడి ఉందని నేను ఇక్కడ నొక్కి చెప్పాలి. ఈ సంఘాలన్నీ వారి స్థితి, పురోగతిలో అసమానంగా ఉన్నాయి. వారిని సమానత్వస్థాయికి తీసుకురావాలంటే, అసమానత సూత్రాన్ని అవలంబించడం, స్థాయికి దిగువన ఉన్నవారికి అనుకూలమైన చికిత్స అందించడం మాత్రమే పరిష్కారం. నాకు తెలిసి కొందరు దీనిని వ్యతిరేకిస్తారు. చికిత్స యొక్క సమానత్వ సూత్రానికి కట్టుబడి ఉన్నారు. అసమానంగా ఉన్న వ్యక్తులకు సమానమైన చికిత్స అనేది ఉదాసీనత మరియు నిర్లక్ష్యానికి మరొక పేరు అని నేను నిజాయితీగా నమ్ముతున్నాను. వెనుకబడిన తరగతులకు ఈ సూత్రాన్ని వర్తింపజేయాలని ప్రభుత్వం ఇంకా ఆలోచించలేదనేది నా ఫిర్యాదు” (అంబేద్కర్ 1982: 42).

బలహీనవర్గాలకు ప్రాథమిక విద్య చాలా ముఖ్యమని అంబేద్కర్ విశ్వసించారు. అది వారికి ప్రజాజీవితంలోకి ప్రవేశించడానికి అవసరమైన వేదికను అందిస్తుంది. అంబేద్కర్ భవిష్యత్తును రూపొందించడంలో విద్య ప్రాముఖ్యతను గుర్తించి, ‘మేము భౌతిక ప్రయోజనాలను వదులుకోవచ్చు, కానీ అత్యున్నత విద్య యొక్క ప్రయోజనాలను పూర్తి స్థాయిలో పొందేందుకు మన హక్కులు, అవకాశాలను వదులుకోలేము’ అని ఏ అవకాశాన్ని కోల్పోవద్దని హెచ్చరించారు.

“ప్రాథమిక విద్య యొక్క లక్ష్యం ఏమిటంటే, ప్రాథమిక పాఠశాల పోర్టల్‌లోకి ప్రవేశించిన ప్రతి పిల్లవాడు అక్షరాస్యునిగా మారినప్పుడు, అతని జీవితాంతం అక్షరాస్యునిగా కొనసాగేలా చూడటం’’ (అంబేద్కర్ 1982:40) అని అంబేద్కర్ సూచించారు. అంబేద్కర్ కూడా ప్రాథమిక దశలో డ్రాపౌట్ రేటు ధోరణి గురించి హెచ్చరించాడు, “...మేము గణాంకాలను తీసుకుంటే, ప్రాథమిక పాఠశాలలో ప్రవేశించే ప్రతి వంద మంది పిల్లలలో పద్దెనిమిది మంది మాత్రమే నాల్గవ తరగతికి చేరుకున్నారని మేము కనుగొన్నాము. మిగిలిన వారు, అంటే ప్రతి 100 మందిలో 82 మంది తిరిగి నిరక్షరాస్యత స్థితికి చేరుకుంటున్నారు” (అంబేద్కర్ 1982: 40).

అంబేద్కర్ విద్య వ్యాపారీకరణను పూర్తిగా వ్యతిరేకించారు. అంబేద్కర్ బొంబాయి విశ్వవిద్యాలయ సవరణ చట్టం సమయంలో ముఖ్యమైన సూచనలు చేసారు.



భారతదేశంలో ఉన్నత విద్యను ప్రోత్సహించడానికి ఇప్పటికీ చాలా సందర్భోచితంగా ఉన్న విశ్వవిద్యాలయ విద్యపై తన అభిప్రాయాలను అందించారు. అంబేద్కర్ కూడా 1925లో యూనివర్సిటీ రిఫార్మ్ కమిటీ ముందు వ్రాతపూర్వక సాక్ష్యాలను సమర్పించడం ద్వారా ఉన్నత విద్యపై సూచనలు ఇచ్చే అవకాశాన్ని ఉపయోగించుకున్నారు. ''విశ్వవిద్యాలయం పరిశోధనను ప్రోత్సహించడంలో లేదా ఉన్నత విద్యను ప్రోత్సహించడంలో విజయం సాధించలేదని గ్రహించాలి. పరీక్షా విధానం అన్నింటికీ మరియు దాని ఉనికిని అంతం చేస్తుంది'' (అంబేద్కర్ 1982: 45-46).

అంబేద్కర్ ప్రకారం, "యూనివర్సిటీ యొక్క ప్రాథమిక విధులలో ఒకటి, అత్యున్నత విద్యను తీసుకురావడానికి సౌకర్యాలను అందించడం. నిరుపేదలు మరియు పేదల తలుపుల వైపు "నేను విశ్వవిద్యాలయాన్ని ప్రధానంగా ఒక యంత్రాంగాన్ని చూస్తున్నాను, దీని ద్వారా మేధోపరంగా ఆ సౌకర్యాలను ఉత్తమ ప్రయోజనంకోసం ఉపయోగించుకునే సామర్థ్యం ఉన్నవారందరికీ విద్యా సౌకర్యాలు అందించబడతాయి'' (అంబేద్కర్ 1982: 61). ఫలితంగా అంబేద్కర్ విశ్వవిద్యాలయ వ్యవహారాలను నియంత్రించేందుకు సెనేట్‌లో వివిధ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని వాదించారు. డూప్లికేషన్‌ను నివారించడానికి, సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి నగర కళాశాలలు, విశ్వవిద్యాలయాల బోధనావనరులను సమీకరించాలనే అంబేద్కర్ ఆలోచనను ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిన అవసరం ఉంది. ఒక నగరంలోని చాలా కళాశాలలు ఇలాంటి కోర్సులను అందిస్తున్నాయని, కళాశాలల్లోని విద్యార్థులు ఏదైనా ఒక కళాశాలలో ఉపన్యాసాలను వినడానికి, హాజరుకావడానికి అనుమతించబడాలని ఆయన అభిప్రాయపడ్డారు. అండర్ గ్రాడ్యుయేట్ టీచింగ్, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచింగ్ మధ్య వ్యత్యాసాన్ని కూడా వ్యతిరేకించాడు. ఉన్నత విద్య, పరిశోధనలను ప్రోత్సహించడమే బిల్లు యొక్క ఉద్దేశ్యం అయితే, ఇప్పుడు చేసినట్లుగా విశ్వవిద్యాలయం నుండి కళాశాలలను వేరు చేయడం కాదు, విశ్వవిద్యాలయం, కళాశాలలు సంశ్లేషణ చేయడం ఉత్తమ పద్ధతి. సమానత్వ పరంగా భాగస్వాములుగా ఉండండి. అంబేద్కర్ కూడా విశ్వవిద్యాలయాలలో పరిశోధన యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. అండర్ గ్రాడ్యుయేట్ వర్క్ నుండి పోస్ట్ గ్రాడ్యుయేట్ వర్క్ వేరు చేయడం అంటే పరిశోధన నుండి బోధన వేరు చేయడమే. దాని వల్ల పరిశోధన, బోధన నుండి విడాకులు తీసుకున్నట్టయి నష్టపోతామని అన్నారు. (అంబేద్కర్ 1982: 298).

అంబేద్కర్ విశ్వవిద్యాలయ విద్యావ్యవహారాల విషయాలలో అకడమిక్ కౌన్సిల్‌కు అధికారం ఇవ్వాలని కోరిన మొదటి విద్యావేత్త కావచ్చు. ఉపాధ్యాయులు అన్ని అకడమిక్ మరియు అడ్మినిస్ట్రేటివ్ పోస్టులను కలిగి ఉంటారు అనే అర్థంలో టీచింగ్ విశ్వవిద్యాలయం నిజంగా ఉపాధ్యాయుల విశ్వవిద్యాలయంగా పనిచేయాలని ఆయన నొక్కి చెప్పారు. ఒక విద్యా వ్యావహారికసత్తావాదిగా, అంబేద్కర్ సమగ్ర దృక్కోణం నుండి బహుజనుల విద్యా అభ్యున్నతి సమన్యను సంప్రదించారు. విద్యపై అతని అభిప్రాయాలు కాలక్రమేణా

బలపడినట్లు కనిపిస్తోంది. విద్యావేత్తగా అంబేద్కర్ బోధించిన దానిని ఆచరించారు.

లైబ్రరీలు, సామాజిక కేంద్రాలు, తరగతులు లేదా స్టడీ సర్కిల్‌లను తెరవడంద్వారా అణగారిన తరగతుల మధ్య సంస్కృతిని వ్యాప్తిచేయడం జరుగుతుందని చెప్పారు. పారిశ్రామిక, వ్యవసాయ పాఠశాలలను ప్రారంభించడం ద్వారా అణగారిన తరగతుల ఆర్థిక స్థితిగతుల అభివృద్ధి, మెరుగుదల జరుగుతుందని భావించారు.

1928లో అంబేద్కరే తన ప్రజల పాఠశాల విద్యను మంచి ప్రాతిపదికన నిర్వహించడానికి అణగారిన తరగతుల ఎడ్యుకేషన్ సొసైటీని స్థాపించాడు. పేద విద్యార్థులకు వసతి కల్పించే హాస్టళ్లను స్థాపించడానికి తన సొసైటీకి సహాయం చేయాలని బొంబాయి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాడు. బాంబే గవర్నర్ ప్రతిస్పందనగా, అణగారిన తరగతుల మాధ్యమిక పాఠశాల విద్యార్థుల ప్రయోజనంకోసం ఐదు హాస్టళ్లకోసం ఒక పథకాన్ని మంజూరు చేస్తానని ప్రకటించారు (లోఖండే 1982: 124). ఈ సంస్థలకోసం నిధులను సేకరించేందుకు అంబేద్కర్ వ్యక్తిగతంగా కృషిచేశారు.

జూన్ 20, 1946న, పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ స్థాపన వెనుకబడిన తరగతులలో ఉన్నత విద్యను ప్రచారం చేయడానికి అంబేద్కర్ తీసుకున్న ముఖ్యమైన చర్య, అతను ముంబైలో పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీని స్థాపించాడు. శతాబ్దాలుగా విద్యా సౌకర్యాలు నిరాకరించబడిన అణగారిన, అణగారినవర్గాల యొక్క సాంస్కృతిక స్థాయిని పెంచడం, వారి మానసిక క్షితిజ సమాంతరాన్ని విస్తరించడం. పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ యొక్క లక్ష్యం కేవలం సూచనలు ఇవ్వడం మాత్రమే కాదు, మేధో, నైతిక మరియు సామాజిక ప్రజాస్వామ్యాన్ని ప్రోత్సహించే విద్యను అందించడం. ఇది ఆధునిక భారతదేశానికి అవసరమైనది మరియు భారతదేశ శ్రేయోభిలాషులందరూ దీనిని ప్రోత్సహించాలని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ యొక్క నినాదం 'జ్ఞానం మరియు కరుణ'.

క్లుప్తంగా చెప్పాలంటే, పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ బలహీన వర్గాల్లో ఉన్నత విద్యావ్యాప్తికి గణనీయంగా దోహదపడింది. కళాశాలలు నెలవారీ స్కాలర్‌షిప్‌లు ఇచ్చాయి, సరసమైన వసతిని అందించాయి. విద్యార్థుల సమస్యలపై అపారమైన శ్రద్ధ చూపాయి. పురోగతిని ప్రోత్సహించాయి. మరోవైపు, విద్యార్థులు, వారి విద్యను పూర్తిచేసిన తర్వాత, గ్రామాలు, నగరాల్లో వివిధ విభాగాలలో, కార్యాలయాలలో వివిధ హోదాలలో పని చేస్తున్నారు. అంబేద్కర్ స్వచ్ఛంద కృషిలో విద్య ఆధునీకరణ కూడా ఉంది. అయితే, ఇది రాష్ట్రం చేపట్టవలసిన పని అని ఆయన అన్నారు. ఆ విధంగా, రాష్ట్ర సోషలిజంలో, దేశంలోని నిరక్షరాస్యులైన మిలియన్ల మంది పౌరుల విద్యకు సంబంధించి తన విధులను నిర్వర్తించడంలో అతను రాష్ట్రానికి ప్రధాన పాత్రను కేటాయించాడు అంబేద్కర్.

స్త్రీ విద్యతో పాటు పురుషులు కూడా విద్యను కొనసాగించినట్లయితే మన పురోగతి చాలా వేగవంతం అవుతుందని అన్నారు. (కీర్ 1991: 27) ఆడపిల్లల విద్య విషయంలో అంబేద్కర్ మహాత్మా పూలే వారసత్వాన్ని ముందుకు తీసుకువెళుతున్నట్లు కనిపిస్తోంది. అంబేద్కర్‌కు, విద్య సామాజిక మార్పును తీసుకురావడానికి, మహిళలు తమ స్థానాన్ని మెరుగు పర్చుకోవడానికి సహాయపడే ఒక ముఖ్యమైన సాధనం. మహద్ సత్యాగ్రహం సందర్భంగా మహిళలను ఉద్దేశించి అంబేద్కర్ స్త్రీలకు ఇలా సలహా ఇచ్చారు. మీ పిల్లలను పాఠశాలలకు పంపండి. చదువు మగవారికి ఎంత అవసరమో ఆడవారికి కూడా అంతే అవసరం. చదవడం, రాయడం తెలిసి ఉంటే ఎంతో పురోగతి ఉంటుంది. మీరు ఎలా ఉన్నారో, మీ పిల్లలు కూడా అలాగే ఉంటారు" (కీర్ 1991: 104).

అంబేద్కర్ విద్యారంగాన్ని ప్రభావవంతంగా, జవాబుదారీగా చేయడానికి ప్రాథమిక స్థాయి నుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకు విద్య అభివృద్ధికి అనేక విధాన చర్యలను సూచించారు. అతని ఆలోచనలు పూర్తిగా ఆచరణాత్మకమైనవి. విద్య యొక్క ఆర్థిక విలువకు ప్రాధాన్యతనిస్తాయి.

విద్యారంగంలో శాస్త్రీయ పద్ధతి, ప్రయోగాత్మక విధానం, ప్రజాస్వామ్యం, వ్యావహారికసత్తావాదంపై డ్యూయీ ఆలోచనలు అంబేద్కర్‌ను ప్రభావితం చేశాయి. అందుబాటులో ఉన్న

విద్యాసౌకర్యాలను వినియోగించుకుని దళితులు విద్యనభ్యసించాలని, సంఘటితమై వారి అభ్యున్నతికోసం పోరాడాలని ఆయన పట్టుబట్టారు. విద్య వారి సామాజిక చైతన్యానికి ఒక పౌర మాత్రమే కాదు, వారి ఆధునికీకరణకు తలుపులు కూడా తెరుస్తుంది. వ్యక్తి అభివృద్ధికి, సామాజిక మార్పుకు విద్య ఒక కీలకమైన శక్తి అని ఆయన ప్రధానంగా నొక్కి చెప్పారు. అంటరానివారిగా పరిగణించబడుతున్నవారి జీవితాలను మార్చడానికి విద్య ఒక సాధనమని అంబేద్కర్ భావించారు. విద్య తన ప్రజలను జ్ఞానోదయం చేస్తుందని ధనిక, పేదల మధ్య అంతరాన్ని తొలగిస్తుందని అతను భావించాడు. జీవితం, స్వేచ్ఛను కాపాడగల సామూహిక ఉద్యమం యొక్క సమర్థవంతమైన సాధనంగా అతను విద్యను చూశాడు. విద్య అణచివేతకు గురైన వారిని పోరాడటానికి ప్రోత్సహించగలదు మరియు అన్యాయం, దోపిడీని తొలగించి స్వేచ్ఛా ఆలోచనకు మార్గం సుగమం చేస్తుంది.

1920లో అంబేద్కర్ ఇలా అన్నాడు: "మేము త్వరలో మంచి రోజులు చూస్తాము. స్త్రీ విద్యతో పాటు పురుష విద్యను ఒప్పించినట్లయితే మన పురోగతి చాలా వేగవంతం అవుతుంది. అంబేద్కర్ హిందూ సామాజిక వ్యవస్థకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రచారాన్ని ప్రారంభించాడు. దీని కోసం 1920లో 'మూక్‌నాయక్', 1927లో 'బహిష్కృత్ భారత్' పత్రికలను ప్రారంభించాడు. దాని సమస్యల ద్వారా అతను లింగ సమానత్వం, విద్య యొక్క ఆవశ్యకతపై తగిన ఒత్తిడి తెచ్చాడు. అణగారిన, మహిళల సమస్యలను బహిర్గతం చేశాడు. మహిళల ప్రశ్నపై అంబేద్కర్ యొక్క అవగాహన, వారి విద్యాహక్కు, పురుషులతో సమానమైన గౌరవం, ఆస్తి హక్కు మరియు రాజకీయ ప్రక్రియలో ప్రమేయం వంటివి ప్రపంచ స్త్రీవాద డిమాండ్‌ను పోలి ఉన్నాయి. "అవమానాలతో నిండిన జీవితాన్ని గడపడం కంటే వందసార్లు చనిపోవడం మేలు. మా ప్రాణాలను త్యాగం చేస్తాం కానీ మా హక్కులను సాధించుకుంటాం. స్త్రీల యొక్క ఈ ఆత్మగౌరవం, దృఢ సంకల్పం యొక్క ఘనత మహిళల బలం, సంఘ సంస్కరణ ప్రక్రియలో వారి పాత్రను విశ్వసించిన అంబేద్కర్‌కు చెందుతుంది. చారిత్రాత్మకమైన "మహద్ సత్యాగ్రహం"లో పురుషులతో పాటు మూడు వందల మంది మహిళలు పాల్గొన్నారు. దాదాపు 3000 మంది మహిళలతో జరిగిన మరో సమావేశంలో అంబేద్కర్ మాట్లాడుతూ "నేను మహిళలు సాధించిన ప్రగతిని బట్టి సమాజ ప్రగతిని కొలుస్తాను. పెళ్లయిన ప్రతి ఆడపిల్ల తన భర్తకు అండగా నిలవాలి, తన భర్తకు స్నేహితుడినని, సమానమని చెప్పుకుని, అతని బానిసగా ఉండడానికి నిరాకరించండి. మీరు ఈ సలహాను అనుసరిస్తే, మీరే గౌరవం, కీర్తిని తెచ్చుకుంటారని నేను ఖచ్చితంగా అనుకుంటున్నాను.

విద్య, మానవ సమాజంపై అపారమైన ప్రభావాన్ని చూపుతుంది. ఇది మానవ మనస్సును ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవడానికి శిక్షణ ఇస్తుంది. మరోమాటలో చెప్పాలంటే, మానవులు చదువుకున్నప్పుడే హేతువాదులు అవుతారు. విద్య ద్వారానే జ్ఞానం, సమాచారం అందుతుంది. ఒక చదువుకున్న వ్యక్తి బయట ప్రపంచం వైపు అన్ని కిటికీలు తెరిచి ఉండే గదిలో నివసిస్తున్నాడని అర్థం. విద్య అంటే జ్ఞానాన్ని పొందడం లేదా అకడమిక్ హోదాను పొందడం మాత్రమే కాదు. ఇది స్వేచ్ఛా మనస్సు, స్వేచ్ఛా ఆలోచనల సృష్టికి దారితీయాలి అని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు.

**ఆధార గ్రంథాలు**

1. డా॥ బి. ఆర్. అంబేద్కర్ ప్రసంగాలు, సంపుటం -1, తెలుగు అకాడమి, హైదరాబాద్, 2020.

2. డా॥ బి.ఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర, డా॥ కత్తి పద్మారావు, లోకాయత ప్రచురణలు. 2023.

★ రచయిత:అసోసియేట్ ప్రొఫెసర్, నాగార్జున ప్రభుత్వ కళాశాల

**నడుస్తున్న తెలంగాణ ఆన్‌లైన్ వర్షన్ కోసం కింది పేజీలను సంప్రదించవచ్చు.**

**వెబ్ పేజీ:** https://nadustunnatelangana.com

# యుజిసి ముసాయిదా-2025: ఒక విశ్లేషణాత్మక పరిశీలన

డా॥శ్రీరాములు గోసికొండ

స్వతంత్ర భారతదేశంలో ఉన్నత విద్యాసంస్థల పర్యవేక్షణ, నిర్వహణకు విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూజిసి)ని 1953లో ఏర్పాటుచేశారు. కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే ఈ యూజిసిలో ఎన్ఎంసి, ఏఐసిటిఈ, ఐసిఏఆర్, పిసిఐ, ఎన్సిటిఈ, బిసిఐ వంటి 16 రకాల జాతీయస్థాయి వృత్తి విద్యాకౌన్సిల్లతోపాటు అన్ని రాష్ట్రాల ఉన్నత విద్యామండళ్లు భాగంగా ఉంటాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం, దేశంలో 2024 సంవత్సరానికిగాను 1,168 విశ్వవిద్యాలయాలు, 45,473 కాలేజీలు, 12,002 ఏక కోర్సునందించే (స్టాండ్ అలోన్) సంస్థల్లో సుమారు 4 కోట్ల 33 లక్షల విద్యార్థులు చేరగా, 15 లక్షల 98 వేల అధ్యాపకులు పనిచేశారు. అయితే ఇటీవల యూజిసి 'విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో అధ్యాపకులు, ఆచార్యుల నియామకాలు, పదోన్నతికై కనీస అర్హతలు, ఉన్నత విద్యలో ప్రమాణాల నిర్వహణకు మార్గదర్శకాలు-2025' పేరుతో ఒక ముసాయిదాను రూపొందించింది. ప్రపంచీకరణ నేపథ్యంలో విద్యారంగంలో వస్తున్న వేగవంతమైన మార్పులకు అనుగుణంగా ఉన్నత విద్యలో సమూల మార్పులు చేయాలని జాతీయ విద్యావిధానం (ఎన్ఈపి) 2020 సిఫార్సు చేసింది. ఇటువంటి దేశవ్యాప్త మార్గదర్శకాలను యూజిసి రూపొందిచడం కొత్తేమీ కాదు. ఇలా 2010, 2013, 2016, 2018, 2023 సంవత్సరాల్లో యూజిసి కొత్త మార్గదర్శకాలను విడుదల చేయడం, మధ్య మధ్యలో సవరణలు చేయడం కూడా జరిగింది. దేశ భవిష్యత్తు నిర్మాణంకోసం విద్యావంతులైన యువతను తయారుచేయాలంటే ఉన్నత విద్యలో ప్రతిభావంతులైన అధ్యాపకులను నియమించడమే అతి ప్రధానమైందని యూజిసి భావిస్తోంది.

యూజిసి ముసాయిదా-2025 ప్రకారం బోధనా సిబ్బంది నియామకం, పదోన్నతుల్లో భారీ మార్పులుండగా, సెలవులకు సంబంధించి మాత్రం పెద్దగా మార్పులేమీ లేవు. అధ్యాపక-ఆచార్య పోస్టుల నియామకానికి జాతీయస్థాయిలో ప్రకటన వెలువరించాలి. కానీ ఎన్ని రాష్ట్రస్థాయి ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ఇతర రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులకు ఉద్యోగాలు ఇస్తున్నాయి? అసలు కేంద్రీయ విశ్వవిద్యాలయ నియామకాల్లో కూడా ప్రాంతీయతత్వం రాజ్యామేలుతుండడం విచారకరం. ఒక అభ్యర్థి డిగ్రీ/పిజిలో చదివిన సబ్జెక్టులతో సంబంధంలేకుండా పిహెచ్డి లేదా నెట్ (ఎన్ఈటి)లో అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్ట్ను బట్టే నియామకానికి అర్హత ఉంటుంది. ఈ వెసులుబాటుద్వారా విషయాత్మక హద్దులు చెరిపేసి, విద్యార్థి తనకు నచ్చిన విషయంలో పరిశోధన చేయడానికి వీలుంటుంది. ఇది మూసపద్ధతిలో ఒకే సబ్జెక్టులో పరిశోధన చేయకుండా, ఒక అంశానికి సంబంధించిన ఇతర సబ్జెక్టులు కూడా కలుపుకొని ఎంతో లోతైన అంతర-విషయాత్మక పరిశోధనను ప్రోత్సహిస్తుంది. అయితే దీనికోసం యూజిసి తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఏయే పిజి కోర్సులు చేసినవారు ఏ సబ్జెక్టులో నెట్ పరీక్ష రాయవచ్చో స్పష్టంగా యూజిసి పేర్కొనాలి. దీని కోసం విద్యార్థులు, విద్యావేత్తలనుండి సూచనలు తీసుకొని, ప్రతీ సంవత్సరం సమీక్షించాలి. ఇదొక నిరంతర ప్రక్రియ. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు, దివ్యాంగులకు కనీస అర్హతకు కావలసిన మార్కుల్లో 5 శాతం సడలింపునివ్వడం హర్షించదగ్గ విషయం. పాఠశాల విద్య, డిగ్రీ, పిజి, పిహెచ్డి కోర్సుల్లో ఏదో ఒక్క దాన్ని భారతీయ భాషల్లో చదివినవారికి, అలాగే భారతీయ భాషల్లో పుస్తకాలు రాసేవారికి నియామకాల్లో, పదోన్నతుల్లో ప్రోత్సాహకంగా కొన్ని మార్కులు ఇవ్వనున్నారు. దీని ద్వారా విద్యారంగంలో ఆంగ్ల ఆధిపత్యాన్ని, వలసవాద ధోరణులను తొలగించి భారతీయ భాషలకు ఊతం ఇవ్వచ్చని యూజిసి భావిస్తోంది.

బోధనలో నేరుగా జరిగే నియామకాలు గానీ, పదోన్నతి (సిఏఎస్) కోసం గానీ ఒక ఎంపిక (సెలక్షన్) కమిటీని

నియమించాలని యూజిసి ముసాయిదా సూచించింది. ఇది దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు విద్యారంగానికి సంబంధించిన వివిధ అంశాల్లో ఎంత మేరకు పాలుపంచుకున్నారో పరిగణలోకి తీసుకుంటుంది. ఈ ముసాయిదా ప్రకారం వినూత్న బోధనా పద్ధతులు, పరిశోధన/ల్యాబ్ అభ్యున్నతి, కన్సల్టెన్సీ/పరిశోధన ప్రాజెక్టులు, భారతీయ భాషల్లో బోధన, భారతీయ జ్ఞాన వ్యవస్థ (ఐకేఎస్) గురించి బోధన-పరిశోధన, విద్యార్థులకు ప్రాజెక్టులపై మార్గనిర్దేశనం, డిజిటల్ కంటెంట్ సృష్టి (మూక్), సామాజిక సేవ, స్టార్ట్ అప్ వంటి 9 రకాల అంశాలను బట్టి అభ్యర్థుల ప్రతిభను మూల్యాంకనం చేస్తుంది. అంతేకాక పరిశోధనను జర్నల్లలో వ్యాసాలుగా, పుస్తకాలుగా, ఇంకా పుస్తకాల్లో అధ్యాయాలుగా ప్రచురణ చేయాలని పేర్కొంది. అయితే ఆయా అంశాలకు ఎన్నెన్ని మార్కులు కేటాయిస్తారో కూడా యూజిసి స్పష్టంగా తెలపాల్సి ఉంటుంది.

సహాయ ఆచార్యుడిగా దరఖాస్తు చేయగోరే అభ్యర్థికి ఇంజినీరింగ్/టెక్నాలజీ విభాగాల్లో పిజి ఉంటే సరిపోతుందని పేర్కొనగా, మిగతా అన్ని విభాగాల్లో మాత్రం పిజితోపాటు నెట్ లేదా పిహెచ్‌డి ఉండాలని సూచించింది. అలాగే, నేరుగా అనుబంధ ఆచార్యుడు/ఆచార్యుడిగా దరఖాస్తు చేసుకోవాలంటే, పిజితోపాటు పిహెచ్‌డి చేసి ఉండాలి. అనుబంధ ఆచార్య పోస్టుకు అయితే సహాయ ఆచార్యుని స్థాయిలో ఎనిమిది సంవత్సరాల బోధన/పరిశోధన అనుభవంతోపాటు ఎనిమిది పరిశోధక వ్యాసాలు లేదా పుస్తకాల్లో ఎనిమిది అధ్యాయాలు (బుక్ చాప్టర్లు) లేదా ఒకే(సోలో) రచయితగా ఒక పుస్తక ప్రచురణ లేదా సహ-రచయితగా రెండు పుస్తకాలు ప్రచురణ చేయాలి. అదే ఆచార్య పోస్టుకు అయితే అనుబంధ/సహాయ ఆచార్యుని స్థాయిలో పది సంవత్సరాల బోధన/పరిశోధన అనుభవంతోపాటు పది పరిశోధన వ్యాసాలు లేదా పుస్తకాల్లో పది అధ్యాయాలు లేదా ఏక(సోలో) రచయితగా నాలుగు పుస్తకాల ప్రచురణ లేదా సహ-రచయితగా ఎనిమిది పుస్తకాలు ప్రచురణ చేయాలి. అంతేకాక తన పర్యవేక్షణలో (గైడ్) ఒక పిహెచ్‌డి అవార్డు అయ్యుండాలి లేదా సహ-పర్యవేక్షకుడిగా (కో-గైడ్)గా రెండు పిహెచ్‌డిలు అవార్డు అయ్యుండాలి. ఎంపిక కమిటీనే ఏయే జర్నల్లు, ప్రచురణ సంస్థలు నాణ్యమైనవో నిర్ధారిస్తుంది.

అధ్యాపకులు ప్రతిరోజూ 8 గంటలపాటు బోధన, పరిశోధన, పరిపాలనాపరమైన పనుల్లో నిమగ్నం కావాలి. కొత్తగా చేరిన అధ్యాపకుల పరిశీలన కాలం (ప్రొబేషన్ పీరియడ్) ఒక సంవత్సరం లేదా మరో సంవత్సరంపాటు పొడగింపు ఉంటుంది. కొత్తగా ప్రవేశస్థాయి (ఎంట్రీ లెవెల్) లో చేరిన సహాయ ఆచార్యులు రెఫ్రెషర్/ఓరియంటేషన్ కోర్సులను ఆన్లైన్ ద్వారా చేయవచ్చు. వీరు 3 సంవత్సరాల సర్వీసు పూర్తిచేసిన తర్వాత పదోన్నతి (ప్రమోషన్) కోసం 3 సంవత్సరాల అధ్యయన సెలవుల (స్టడీ లీవ్) ను తీసుకోవచ్చు. 7 సంవత్సరాల సర్వీసు చేసిన శాశ్వత (పర్మినెంట్) అధ్యాపకులు/ఆచార్యులు ఒక సంవత్సర కాలంపాటు దీర్ఘకాలిక (సబాటికల్) సెలవులను వారి పదవీవిరమణ అయ్యేలోగా రెండు సార్లు తీసుకోవచ్చు. సెమినార్లు, కాన్ఫరెన్సులు, వర్క్ షాప్స్ హాజరు కావడానికి 30 రోజుల డ్యూటి లీవ్ ఉంటుంది. మహిళా ఆచార్యులు 6 నెలలపాటు మాతృత్వ సెలవులను రెండు సార్లు, మరో 2 సం.లపాటు సెలవులను శిశు సంరక్షణ కింద పొందవచ్చును. అలాగే, పురుష ఆచార్యులకు 15 రోజులపాటు పితృత్వ సెలవులను తీసుకొనే వెసులుబాటు ఉంది. వీటితోపాటుగా, సంవత్సరానికి 8 రోజుల సాధారణ సెలవులు, సర్వీసు మొత్తానికి గరిష్టంగా 300 సంపాదిత సెలవులను పొందవచ్చు.

విద్యార్థులు, సహోద్యోగులు, అధికారులు, సమాజం పట్ల అధ్యాపకులు/ఆచార్యులు బాధ్యతగా వ్యవహరించడానికి ఒక నైతిక-వృత్తి సంబంధిత ప్రవర్తనా నియమావళి రూపుదిద్దుకోనున్నది. ఉన్నత విద్యాసంస్థలు ప్రతీ సెమిస్టర్ కు 15 వారాలపాటు పనిచేయాలి. ప్రతీ డిపార్ట్మెంట్‌లో ఆచార్యులు, అనుబంధ ఆచార్యులు, సహాయ ఆచార్యులు 1:2:4 నిష్పత్తిలో ఉండాలని కూడా పేర్కొంది. యోగా, సంగీతం, లలిత కళలు, దృశ్య కళలు, ప్రదర్శన కళలు, ఇతర సాంప్రదాయ కళలకు సంబంధించిన కోర్సుల్లో సహాయ ఆచార్యుల నియామకానికి ప్రత్యేక పద్ధతిని పాటించాలని సూచించింది. అన్ని యూనివర్సిటీల్లో పిహెచ్‌డి మూల్యాంకనానికి ఒకే పద్ధతిని అనుసరించేలా చర్యలు తీసుకోవాలని ముసాయిదా పేర్కొంది.

కళలు, మానవీయ శాస్త్రాలు, సామాజిక శాస్త్రాలకు ప్రాధాన్యత తగ్గుతున్న తరుణంలో ఆ సబ్జెక్టుల్లో సహాయ ఆచార్యుల ఎంపికకు మాత్రమే జాతీయ అర్హత పరీక్ష (నెట్) లో క్వాలిఫై కావడాన్ని కనీస విద్యార్హతగా నిర్ణయించడం, సాంకేతిక/ఇంజనీరింగ్ కోర్సుల్లో నెట్ ని పెట్టకపోవడం, ఆ పరీక్ష విశ్వసనీయతను దెబ్బతీయడమేకాక, ఔన్నత్యాన్ని తగ్గిస్తుంది. అసలు నెట్ పరీక్ష ఉద్దేశం ఏమిటనే ప్రశ్నలూ తలెత్తుతాయి. మరోవైపు, నెట్ ఉంటే పిహెచ్‌డి అవసరం లేదని చెప్పడం పిహెచ్‌డి విలువను తగ్గిస్తుంది. ఈ రెండూ ఖచ్చితంగా ఉన్నవారే సహాయ ఆచార్య పోస్టుకు దరఖాస్తు చేయడానికి అర్హులనే నియమం ఉండాలి. సహాయ ఆచార్యుల ఉద్యోగానికి నెట్, పిహెచ్‌డి ల్లో ఏదో ఒక్క దాన్ని మాత్రమే కనీస విద్యార్హతగా నిర్ణయించడం ఏ మాత్రం అభినందించదగ్గ చర్య కాదు. ఇది ఆచరణీయం కూడా కాదు. నెట్, పిహెచ్‌డి లు రెండు వేర్వేరు. ఆ రెండు ఎప్పటికీ సమానం కాదు. నెట్ అనేది ఒక అర్హత పరీక్షనేగానీ ఒక డిగ్రీ పట్టా కాదు. నెట్ లో అర్హత పొందడమనేది పిహెచ్‌డి చేయడానికి కనీస అర్హత పొందడమన్నమాట. అంతేగానీ సుదీర్ఘకాలంపాటు 'పరిశోధన చేసి సాధించిన' పిహెచ్‌డి డిగ్రీని 'పరిశోధన చేయడానికి అర్హత ఉంద'ని చెప్పే నెట్ పరీక్షతో అస్సలే పోల్చలేము. అసలు పోల్చడం తప్పు కూడా.

ఉన్నత మాధ్యమిక (హైయర్ సెకండరీ) పాఠశాలలో ఉండే పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పిజిటి) ఉద్యోగానికి కనీస విద్యార్హత పిజి, బిఈడి తో పాటు సి-టెట్ ఉంటుంది. అంటే ఈ లెక్కన చూస్తే, డిగ్రీ కాలేజీల్లో, విశ్వవిద్యాలయాల్లో బోధించేవారికి పిజి, పిహెచ్‌డి తోపాటు నెట్ కనీస విద్యార్హతగా నిర్ధారించడం సమంజసమేనన్నమాట. కానీ యూజిసి ముసాయిదాను బట్టి చూస్తే, సహాయ ఆచార్యుల స్థాయి పిజిటి కంటే చిన్నదైనట్టుగాను, వారు చదువుచెప్పేది సెకండరీ విద్యార్థుల కంటే జ్ఞానంలో, వయస్సులోను చిన్నవారిగానూ పరిగణించినట్టనిపించకమానదు. అయినా డిగ్రీ, విశ్వవిద్యాలయ స్థాయిలోని విద్యార్థులకు, తను నేర్చుకున్న జ్ఞానం, పరిశోధన అనుభవాలతోపాటు వయస్సురీత్యా వచ్చే పరిణతి కలిగియున్న వ్యక్తి అయితేనే సరిగ్గా బోధించగలడు. డిగ్రీ, పిజి స్థాయిలో బోధించడం పరిశోధన పూర్తిచేయని వ్యక్తివల్ల అయ్యే పనికాదు. ఎందుకంటే వీరికి సమాజంలో జరుగుతున్న మార్పులను, అధ్యాపకుడు తన పాఠాలకు అన్వయించి, సమాజంలో వారికి నచ్చిన పాత్రను ఎన్నుకునే విధంగా ప్రేరేపించగలగాలి. చెప్పే పాఠాలను కూడా లోతుగా, తార్కికంగా చెప్పాల్సి ఉంటుంది. అసలు చదువుకున్నవారి సంఖ్య అంతకంతకూ పెరిగిపోతున్న సమయంలో, ఒక పోస్టుకు పోటీని తగ్గించడానికి కనీస విద్యార్హతలు పెంచుతారా లేక తగ్గిస్తారా? ఎక్కువ విద్యార్హతలు పెట్టడంవల్ల 'వడపోత ప్రక్రియ' కూడా సులువౌతుంది కదా!

చాలామంది పిహెచ్‌డి చేసి, ఈ ఉద్యోగంకోసం కళ్ళల్లో వత్తులు వేసుకొని చూస్తున్నారు. పిహెచ్‌డి ని కనీస విద్యార్హతగా ఉంచడంవల్ల ఉన్నత విద్యాసంస్థల్లో నాణ్యమైన బోధనతోపాటు పరిశోధన సంస్కృతి పెరుగుతుంది. ఈ విధానాన్ని అన్ని కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, ప్రైవేటు/డీమ్డ్ విశ్వవిద్యాలయాలు పాటిస్తున్నాయి. మరోవిషయం ఏంటంటే, పిజి తోనే సహాయ ఆచార్యులను నియమిస్తే, వారు పిహెచ్‌డి చేయడానికి 3-5 సం.ల సమయం పడుతుంది. కానీ యూజిసి స్టడీ లీవ్ ఇచ్చేది కేవలం మూడు సంవత్సరాలే. ఆ సమయం పిహెచ్‌డి పూర్తి చేయడానికి సరిపోదు. ఈ రోజుల్లో పిహెచ్‌డి పార్ట్ టైమ్ చేయడానికి వీల్లేనందువల్ల వారు ఉద్యోగం చేసేచోట విద్యార్థులకు బోధన కుంటుపడి, విద్యాసంస్థకు నష్టం జరగవచ్చు. అప్పుడు మళ్ళీ ఇటువంటి పార్ట్ టైమ్ పిహెచ్‌డి లకు అనుమతి ఇవ్వాలని యూజిసిపై ఒత్తిడి పెరగవచ్చు. మరీ ముఖ్యంగా అనుబంధ ఆచార్య పోస్టుకు పదోన్నతి పొందగోరే సహాయ ఆచార్యులు పిహెచ్‌డి పట్టాకోసం అడ్డదారులు వెతుకుతారు. అలా పిహెచ్‌డి పట్టాలు అంగట్లో సరుకులైపోయి, నాణ్యతా ప్రమాణాలు పాటించని ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు కాసుల వర్షం కురిపించడం ఖాయమైపోతుంది. మరోవైపు, ఎటువంటి ప్రమాణాలు పాటించకుండా ఇబ్బడిముబ్బడిగా పిహెచ్‌డి పట్టాలిచ్చిన ఓపిజేఎస్, సన్ రైస్, సింఘానియా విశ్వవిద్యాలయాలను ఈ మధ్యకాలంలోనే యూజిసి డీబార్ చేయడం గమనార్హం.

కాలేజీలోని గవర్నింగ్ బాడీ చైర్ పర్సన్ అధ్యక్షతన నలుగురు సభ్యులతో కూడిన కమిటీ కొన్ని మార్గదర్శకాలను బట్టి ప్రిన్సిపాల్‌ను ఎంపిక చేయాలని యూజిసి ముసాయిదా సూచించింది. అలాగే ఉప కులపతి ఎంపికకు కేంద్రీయ

విశ్వవిద్యాలయాలకు సందర్శకుని (విజిటర్) హోదాలోనున్న రాష్ట్రపతి/రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు కులపతి (చాన్సలర్) హోదాలోనున్న గవర్నర్ నామినీ, యూజిసి నామినీ, యూనివర్సిటీలోని సెనేట్/సిండికేట్ నామినీలతో కూడిన త్రిసభ్య కమిటీని ప్రతిపాదించింది. ఈ 'సర్చ్ కమ్ సెలక్షన్' కమిటీ విసి పోస్టుకు అర్హత (షార్ట్ లిస్ట్) పొందిన అభ్యర్థులతో ఇంటర్వ్యూ తీసుకొని, మూడు నుండి ఐదు పేర్లను రాష్ట్రపతి/గవర్నరుకు సిఫారసు చేస్తుంది. చివరగా, ఈ లిస్టు నుండి ఒక్కరిని యూనివర్సిటీకి ఉప కులపతిగా రాష్ట్రపతి/గవర్నరు నియమిస్తారు.

కాలేజీ ప్రిన్సిపల్, విశ్వవిద్యాలయ ఉప కులపతి నియామకంకోసం దేశవ్యాప్తంగా ఉన్న వార్తాపత్రికల్లో ప్రకటన విడుదల చేయాలనడం స్వాగతించదగ్గ విషయం. అయితే కాలేజీ ప్రిన్సిపల్ నియామకానికి ఉద్దేశించిన కమిటీలోని సభ్యులను ఏడుకు, విశ్వవిద్యాలయ ఉప కులపతి (విసి) నియామకానికై ఏర్పడే కమిటీలో సభ్యులను ఐదుకు పెంచితే బాగుంటుంది. కాలేజీ ప్రిన్సిపల్‌కు గణనీయమైన విద్యాపరిపాలనా అనుభవం అవసరం. అలాగే విసి తప్పనిసరిగా నాయకత్వ లక్షణాలు కలిగియుండి, దూరదృష్టితో సంస్థాగత అభివృద్ధికి, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడే విశిష్ట వ్యక్తి అయ్యి ఉండాలి. ఆ వ్యక్తి విద్యావేత్త అయితేనే విసి అనే పాత్రకు బాధ్యతను జోడించి న్యాయం చేయగలుగుతాడు. కానీ విసిగా వేరే రంగ నిపుణుడు నియామకం అయితే మాత్రం, ఆ అతున్నత స్థానాన్ని ఒక హోదాగా భావించి యూనివర్సిటీని తన స్వార్థ ప్రయోజనాలకోసం వాడుకుంటాడు. తనకు వ్యక్తిగతంగా మంచి అనిపించే వారినే తన కోటరీగా నియమించుకొని ఇప్పటికే నాయకత్వ లేమి, నిధుల కొరతతో సతమతమౌతున్న విశ్వవిద్యాలయాలు తమ ఉనికినీ కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది. కేవలం ఉన్నత విద్యాసంస్థలను, పరిశ్రమలతో అనుసంధానం చేయాలనే సాకుతో ఆ రంగంలోని వారినే విసిలుగా నియమించడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు.

విశ్వవిద్యాలయాల్లో పరిపాలన-నిర్వహణ చూసుకొనే ఉప కులపతి, కుల సచివుల (రిజిస్ట్రార్ ) నియామకాలకోసం జాతీయస్థాయిలో 'ఇండియన్ ఎడ్యుకేషన్ సర్వీస్'ను కొత్తగా ఏర్పాటుచేయాలి. దానికోసం ప్రభుత్వం ఒక చట్టాన్ని తీసుకురావాలి. అప్పుడే ఉన్నత విద్యారంగంలోని అతున్నత పదవుల నియామకం రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా, పూర్తిగా ప్రతిభ ఆధారంగానే జరుగుతుంది. పరిశ్రమలను, విశ్వవిద్యాలయాలతో అనుసంధానం చేయాలనే పేరుతో అక్కడి వారిని విసిలుగా నియమించడం అంత మంచి నిర్ణయం కాదు. ఇప్పటికే 'ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్' పేరుతో ఇండస్ట్రీల్లోని నిష్ణాతులకు విశ్వవిద్యాలయాల్లో పెద్దపీట వేస్తున్నారు. వారికి మొత్తం బోధనాపరమైన ఉద్యోగాల్లో 10 శాతం వారికే ఇవ్వాలని యూజిసి చెప్పింది. మరి దాని ఫలితాలు విశ్వవిద్యాలయాలకు అంటే విద్యార్థులకు పనికివచ్చేలా ఉన్నాయో, లేదో అధ్యయనం చేసిన తర్వాతనే ఈ విధానాన్ని కొనసాగించాలా వద్దా అనే నిర్ణయం తీసుకోవాలి. దీనిపైనే ఒక స్పష్టత లేదు ఇప్పటివరకూ. అయినా నిధుల సమీకరణ పేరుతో, విద్యార్థులకు ఉద్యోగాలు ఇవ్వాలనే పేరుతో పరిశ్రమల్లోని వారిని విసిలుగా నియమించే బదులు, ఇప్పుడున్న పదేళ్ళ అనుభవం గల ప్రొఫెసర్‌లనే నియమించి, వారికి విద్యావిషయక అంశాలపై ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తే బాగుంటుంది.

మరోవైపు, అడ్మినిస్ట్రేటివ్ క్యాడర్ కి చెందినవారిని విసిలుగా నియమిస్తే, వారు విశ్వవిద్యాలయాలకు ఏమాత్రం న్యాయం చేయలేరు. ఎందుకంటే వారు ఆ రకమైన శిక్షణ పొందలేదు. ఉదాహరణకు హైదరాబాద్ లోని జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయితీ రాజ్ సంస్థ (NIRDPR) ను ఐఏఎస్ క్యాడర్‌కు చెందినవారే నడుపుతారు. అది కేవలం ప్రభుత్వ ఉద్యోగులకు శిక్షణనిస్తూ, పరిశోధనాత్మక ప్రాజెక్టులు చేయడంతోపాటు చాలా తక్కువ సంఖ్యలో విద్యార్థులను చేర్చుకొని డిప్లొమా కోర్సులు అందిస్తుంది. కానీ విశ్వవిద్యాలయం అలాకాదు. అక్కడ వేల సంఖ్యలో విద్యార్థులుంటారు, వందలకొద్దీ కోర్సులుంటాయి. అందువల్ల విద్యారంగానికి చెందనివారిని విసిలుగా నియమిస్తే, పిహెచ్‌డి చేసి, సుదీర్ఘకాలంపాటు వివిధ హోదాల్లో ఆచార్యుడిగా బోధనాబాధ్యతలు నిర్వహిస్తూ, పరిశోధనలు జరిపి, పేటెంట్లు సాధించి, విశ్వవిద్యాలయాలను అభివృద్ధి పథంలో తీసుకెళ్ళాలనే జీవిత లక్ష్యమున్నవారు ఏమైపోవాలి?

ప్రముఖ విద్యావేత్తలైన మదన్ మోహన్ మాలవీయ, సయ్యద్ అహ్మద్ ఖాన్, రవీంద్రనాథ్ ఠాగోర్, జాకీర్ హుస్సేన్‌లు స్థాపించిన బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయం, విశ్వభారతి విశ్వవిద్యాలయం, జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయాలు ఖండాంతర ఖ్యాతి గడించలేదా? అలాగే, హోమీబాబా ఆలోచనలనుండి పుట్టిన బార్క్, విక్రమ్ సారాభాయి మానస పుత్రిక అయిన ఇస్రో ఎన్నో విజయాలు సాధించలేదా? అంతెందుకు, సర్వేపల్లి రాధాకృష్ణన్, రాంరెడ్డి, సింహాద్రి, గురుబక్ష్ సింగ్ వంటి ఆచార్యులు వారి ఏలుబడిలోని విశ్వవిద్యాలయాలను చక్కదిద్దడం మనమందరం చూడటం నిజం కాదా? అయినా, అటువంటి నాయకత్వ లక్షణాలుండి సమాజంలో మార్పునకు విద్యను చోదకంగా చూసే దృక్పథం గల వ్యక్తులను తయారుచేసే బృహత్తర లక్ష్యం ఒక ఉన్నత విద్యతోనే సాధ్యమయ్యే పని కాదు. ఆ విలువలను పాఠశాల స్థాయి నుండే విద్యార్థుల్లో పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అయితే, ఇలా మాటిమాటికి మార్గదర్శకాలను మార్చడంవల్ల ఉన్నత విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల్లో గందరగోళం ఏర్పడుతుంది. కేవలం పిజినే సహాయ ఆచార్య ఉద్యోగానికి కనీస విద్యార్హతగా నిర్ణయించడం సముచితం కాదు. ఇది కేవలం అధ్యాపకులు, ఆచార్యులకు సంబంధించిన వ్యవహారం కాదు. ఈ నియమాలను బట్టే, రాబోయే తరాలవారు బోధనా రంగం గానీ, పరిశోధన రంగాన్ని గానీ ఎంచుకుంటారు. మరోవైపు విద్యార్థుల్లో నైతిక, సామాజిక, రాజ్యాంగ విలువలు పెంపొందించడానికి కళలు, సామాజిక శాస్త్రాలను పాఠ్యప్రణాళికలో చేర్చాలని కూడా ఎన్ఈపి 2020 సూచించింది. కానీ యూజిసి మూసాయిదాను పరికించి చూస్తే, సైన్స్-సోషల్ సైన్స్ మధ్య అంతరం మరింత పెంచేలా ఉన్నట్టుంది.

అంతర్జాతీయ ప్రమాణాలు (గ్లోబల్ బెంచ్‌మార్క్), ఎన్ఈపి 2020 కి అనుగుణంగా యూజిసి ఈ ప్రమాణాలను సవరించింది. ఇది కేంద్రీయ, రాష్ట్ర, డీమ్డ్, ప్రైవేట్ యూనివర్సిటీల పరిధిలోని అన్ని ఉన్నత విద్యాసంస్థలకు వర్తిస్తుంది. విద్యావేత్తలు, ప్రజల నుండి వచ్చే సూచనలను బట్టి ఈ ముసాయిదాకు కొన్ని సవరణలు చేసి త్వరలోనే అమలుచేయనున్నారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన విద్యాసంస్థలపై యూజిసి గ్రాంట్లలో కోత కోయడం, గుర్తింపు రద్దుచేయడం, డిగ్రీ కోర్సులు ఆఫర్ చేయకుండా డీబార్ చేయడం, జరిమానాలు విధించడం చేయనుంది. ముసాయిదా ప్రగతిశీల దృష్టిని ప్రదర్శిస్తున్నప్పటికీ, కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. అయితే, యూజిసి ప్రతిపాదించిన ఈ సంస్కరణలు భారతదేశాన్ని 'గ్లోబల్ ఎడ్యుకేషనల్ హబ్' గా మార్చే ఆశయానికి అనుగుణంగా ఉన్నాయి. ఈ ముసాయిదా అధ్యాపకులు/ఆచార్యుల నియామకాల్లో ప్రతిభకు పెద్ద పీటవేస్తూ, వారిలో 21వ, శతాబ్దానికి అవసరమైన విభిన్న నైపుణ్యాలు పెంపొందించి, వారిని అంతర్జాతీయంగా జ్ఞాన మార్పిడికి సిద్ధం చేస్తుంది. ఏదేమైనా దినదినాభివృద్ధి చెందుతున్న సాంకేతికతను అధ్యాపకులు/ఆచార్యులు విద్యారంగంలో విరివిగా వినియోగించడమే కాకుండా, సమాజంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను ఎదుర్కొని దేశాన్ని అన్నిరంగాల్లో 'విశ్వగురు'గా నిలిపేందుకు ఈ ముసాయిదా ఒక దిశానిర్దేశనం చేస్తుంది.

**సంప్రదించిన గ్రంథాలు/వెబ్‌సైట్స్:**

https://pib.gov.i/PressReleaseDetailm.aspx?PRIDR2034925&regR3&langR1

https://www.ugc.gov.in/oldpdf/consolidated20list%20of%20all %20universities.pdf

https://pib.gov.in/PressReleaseIframe Pageaspx?PRIDR1999713

https://www.ugc.gov.in/pdfnews/3045759_Draft-Regulation-Minimum-Qualifications-for-Appointment-and-Promotion-of-Teachers-and-Academic-Staff-in-Universities-and-Colleges-and-Measures-for-the-Maintenance-of-Standards-in-HE-Regulations-2025.pdf

★ అసిస్టెంట్ ప్రొఫెసర్, **సామాజిక శాస్త్ర విభాగం**

**బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం**

# తెలుగు భాషోపాధ్యాయులకు ఆంగ్లం, కంప్యూటర్ నైపుణ్యాలు రెండు రెక్కలు

– ఆత్మకూరి ప్రశాంత్‌చారి

డా.చంద్రయ్య శివన్న

*(కృత్రిమ మేధ, ప్రాంతీయ భాషల్లోకి విస్తరిస్తోన్న తరుణంలో మనం ఉన్నాం. బి.ఏ.ఎం.ఏ. తెలుగులాంటి సంప్రదాయ కోర్సులను ప్రత్యేక అంశాలుగా అధ్యయనంచేస్తోన్న విద్యార్థులకు ఈ ఇంటర్వ్యూ ఉపయోగపడాలనేది మా ఉద్దేశం. అంతర్జాతీయస్థాయి పాఠశాలల్లో, బహుళజాతి సంస్థ(MNC)ల్లో తెలుగుతో కూడుకొన్న ఉద్యోగావకాశాలు పొందడానికి కావల్సిన సామర్థ్యాలను, నైపుణ్యాలను ఎలా అలవర్చుకోవాలి? అంతర్జాతీయస్థాయి పాఠశాలల్లో బోధన, బోధనేతర బాధ్యతలు ఎలా ఉంటాయి? అవి అనుసరించే వివిధరకాల కరిక్యులమ్స్ స్వభావం ఏమిటి? బి.ఏ.ఎం.ఏ. తెలుగుల్లో ప్రస్తుతం ఉన్న కరిక్యులం అందుకు తగ్గట్టుగా ఉందా? లేకపోతే ఎలా సవరించుకోవాలి? ఆ పాఠశాల విద్యార్థులతో పనిచేయడానికి తగిన మానసిక, బహుభాషల, సాంకేతిక సామర్థ్యాలను ఎలా పెంపొందించుకోవాల్సి ఉంటుంది? మొదలైన విషయాల్ని క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అధ్యాపకుడు ఆత్మకూరి ప్రశాంత్ చారితో నడుస్తున్న తెలంగాణ పత్రిక తరఫున డా. చంద్రయ్య శివన్న జరిపిన ఇంటర్వ్యూ విశేషాలివి....)*

**1. మీ పుట్టుక సామాజిక నేపథ్యాలు ఏమిటి?**

నేను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నేటి కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ (టి) మండలంలోని వేంపల్లి అనే ఒక చిన్న పల్లెటూరులో జన్మించాను. మాది సాధారణ దిగువ మధ్యతరగతి విశ్వబ్రాహ్మణ కుటుంబం. మా నాన్నగారు కమ్మరి పని చేసేవారు. అమ్మ గృహిణి. ఐదుగురు అక్కా చెల్లెల్లు, ఐదుగురు అన్నదమ్ములలో నేను అందరికంటే చిన్నవాన్ని. చిన్నతనం నుంచి సాధారణ దిగువ మధ్య తరగతి కుటుంబ పరిస్థితుల్లో పెరిగాను. మా అక్కలు అందరూ నాకంటే చాలా పెద్దవాళ్లు. ఐదుగురు అక్కల తర్వాత మేము ఐదుగురు అన్నదమ్ములం. ఉమ్మడి కుటుంబంలో పుట్టి పెరగడం వలన సర్దుబాటు తత్వం అనేది ఎక్కువగా అలవడడంతోపాటు సాధారణంగా జీవించడం అనేది అలవాటైంది. నేను పుట్టి పెరిగిన ప్రాంతం మహారాష్ట్రకు అతి దగ్గరగా ఉండడం వలన మా ప్రాంతంలో తెలుగుతోపాటు మరాఠీ సంస్కృతి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. భిన్నత్వంలో

ఏకత్వ భావన అనేది మా ప్రాంత ప్రత్యేకత. దట్టమైన అడవులతో నిండి ఉండే మా ప్రాంతమంతా ఎంతో అందంగా ఆనందానుభూతిని కలిగించే విధంగా ఉంటుంది. చిన్నతనం అంతా పూర్తి పల్లెటూరి వాతావరణంలోనే సాగింది. పొలంగట్లు, చెరువు కట్టలు, కాలువలు, పంట చేన్లు, ఈత చెట్లు, తాటి ముంజలు, గోలీలాటలు, చిర్రగోనెలు, వీధి కుక్కలు ఇలా వీటన్నిటితో నా బాల్యమంతా ముడిపడి ఉంది. స్థూలంగా ఇదీ నా సామాజిక నేపథ్యం.

**2. మీ విద్యాభ్యాసం ఎలా గడిచింది?**

నా ప్రాథమిక విద్యాభ్యాసం మా ఊరు ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మాధ్యమంలో గడిచింది. మా తల్లిదండ్రులు పెద్దగా ఏమీ చదువుకోలేదు. మేమేం చదువుతున్నామన్న విషయాన్ని వాళ్లు ఎంత మాత్రమూ గమనించలేరు. దిగువమధ్య తరగతి కుటుంబ కారణంగా, నిరక్షరాస్యత కారణంగా నా తల్లిదండ్రులు చూసేవారు కాదు. కానీ మా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు నా చదువులో పురోగతిని గుర్తిస్తూ నన్ను ప్రోత్సహించేవారు. మా పాఠశాలలో తెలుగు బోధించే శ్రీమతి పద్మావతి గారి అసామాన్య తెలుగు బోధన పద్ధతికి ఆకర్షితుడైన నేను తెలుగు భాషపై ఇష్టాన్ని పెంచుకున్నాను.

మా గ్రామంలో ఏడవ తరగతి వరకు మాత్రమే బడి ఉండడం వలన 8వ తరగతి నుంచి పదవ తరగతి చదవడానికి మా ఊరి నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న మా పక్క పట్టణమైన కాగజ్ నగర్ కు వెళ్లవలసి వచ్చేది. ఏడవ తరగతి పూర్తికాగానే కాగజ్ నగర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) లో చేరాను. మా నాన్నగారి పురాతన సైకిల్ ఒకటి మా ఇంట్లో ఉండేది. ఆ సైకిల్ తప్ప నేను పాఠశాలకు వెళ్లడానికి మరో ప్రత్యామ్నాయం నాకు లేదు. ఎన్నోసార్లు వర్షానికి తడిచి ముద్దయి పాఠశాలకు అలాగే ఇంటికి చేరుకునేవాళ్లం. మేము వర్షంలో తడిసిన మా పుస్తకాలను మాత్రం ఎన్నడూ తడవనివ్వలేదు. పేద కుటుంబం కారణంగా మా నాన్నగారు మాకు పదవ తరగతి వరకు పాఠశాల బ్యాగు కొనియలేకపోయారు. మా ఊరు బడిలో చదువుతున్న రోజుల్లో గాని లేదా హై స్కూల్ కు వెళ్ళిన రోజుల్లో గాని నేను చెప్పులు

వేసుకున్నట్టు నాకు గుర్తులేదు. నేను 8వ తరగతి కి ప్రవేశించగానే మా నాన్నగారు నాకు మొట్టమొదటిసారిగా ఒక పాయింట్ చొక్కా కుట్టించారు.

8వ తరగతి పూర్తవడానికి వస్తుండగా ఒక పాత సైకిల్ తో నేను మా అన్నయ్య పాఠశాలకు వెళ్లడం చాలా ఇబ్బందిగా ఉంది అని మా నాన్న గమనించి నన్ను ఎనిమిదో తరగతి పూర్తికాగానే ఆ బడిలో నుంచి తీసేసారు. మా అక్క వాళ్ళ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అయినా నవేగాంలో 9వ తరగతిలో నాకు ప్రవేశం కల్పించారు. ఇక అక్కడ 9 మరియు 10వ తరగతులు నేను పూర్తి చేసుకున్నాను. ఆ తర్వాత ఇంటర్ విద్య కొరకు తిరిగి మళ్లీ మా దగ్గర పట్టణమైనటువంటి కాగజ్ నగర్ లోని కళాశాలలో కామర్స్-సి ఈ సి గ్రూపులో చేరాను. ఇంటర్ చదివే రోజుల్లో భాష పట్ల సాహిత్యం పట్ల ఎలాంటి ఆసక్తి చూపే అవకాశం నాకు రాలేదు. ఆ తరువాత సంవత్సరంలో ఇంటర్ పూర్తి చేసుకుని అదే పట్టణంలోని డిగ్రీ కళాశాలలో బీకాం లో చేరాను. డిగ్రీ చదువుతున్న రోజుల్లో నాకు భవిష్యత్తు కోర్సుల పట్ల గాని తెలుగుకు సంబంధించిన మార్గాల పట్ల గాని అవగాహన శూన్యం. ప్రథమ శ్రేణిలో డిగ్రీ బీకాం ఉత్తీర్ణత చెందిన తర్వాత ఏం చేయాలనే ప్రశ్న నా మెదడులో తలెత్తింది. నా సహ విద్యార్థులు మరియు స్నేహితులు ఎంబీఏ, ఎంసీఏ, లా లాంటి వృత్తివిద్య కోర్సులకు వెళ్లారు. కానీ బాల్యం నుంచే నాలో చాలా బలంగా నాటుకుపోయినటువంటి ఉపాధ్యాయ వృత్తి మీదనే నా మనసు ఎప్పుడూ లాగుతూ ఉండేది. పోస్ట్ గ్రాడ్యుయేషన్ యూనివర్సిటీలో చేయాలని కోరికగా తీవ్రంగా ఉండేది. కానీ వ్యక్తిగత కుటుంబ కారణాలవల్ల నేను ఆ సంవత్సరం పీజీ ఎంట్రెన్స్ రాయలేకపోయాను. దానికి బదులుగా బీఈడీ ఎంట్రెన్స్ రాశాను. మా గ్రామం నుంచి 25 కిలోమీటర్ల దూరం గల ఆసిఫాబాద్ పట్టణంలోని ముదిగంటి సూర్యమ్మ బీఈడీ కళాశాలలో చేరాను. బీఈడీ లో సాంఘిక శాస్త్రము మరియు తెలుగు సబ్జెక్టులను ఎంచుకున్నాను. బీఈడీ సంవత్సర కాల వ్యవధి అనేది నాలో ఉన్నటువంటి ఉపాధ్యాయ ఆశావాహున్ని చాలా ప్రభావితంగా మేల్కొల్పింది. 2015 వ సంవత్సరంలో ముదుగంటి సూర్యమ్మ బీఈడీ కళాశాల నుంచి నేను కళాశాల టాపర్‌గా ఉత్తీర్ణత సాధించాను.

బీ.ఈడీ పూర్తి అయిన వెంటనే మా కుటుంబ పరిస్థితుల దృష్ట్యా నేను తప్పనిసరిగా ఉద్యోగం చేయవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దానివలన నేను కాగజ్ నగర్ లోని అత్యున్నతమైన పేరు ప్రఖ్యాతులు కలిగిన 70 సంవత్సరాల చరిత్ర కలిగినటువంటి ఫాతిమా కాన్వెంట్ ఉన్నత పాఠశాలలో ఉద్యోగంలో చేరాను. అటు తర్వాత నేను కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి తెలుగు సాహిత్యంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్నాను. తదానంతరం తెలంగాణ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ లో ఉత్తీర్ణత సాధించాను.

**3. తెలుగు అధ్యాపకుడిగా మీ జీవిత ప్రయాణం ఎలా మొదలైంది?**

బీఈడీ పూర్తి కాగానే కాగజ్ నగర్ లోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో తెలుగు మీడియం విద్యార్థులకు సాంఘిక శాస్త్రం, తెలుగు బోధించే ఉపాధ్యాయుడిగా చేరాను. అంతకుముందు నాకు ఎలాంటి బోధన అనుభవం లేదు. కానీ నాకు ఆ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రం, తెలుగు బోధించే అవకాశాన్ని ఆ పాఠశాల యాజమాన్యం ఇచ్చారు. వాళ్లు నా పైన పెట్టినటువంటి బాధ్యతను సక్రమంగా నిర్వహించాలనేటటువంటి ఉద్దేశంతో నేను విద్యార్థులకు సాధ్యమైనంత వరకు ఉన్నత ప్రమాణాలతో కూడినటువంటి బోధనను అందించాలని ప్రయత్నం చేసే వాడిని. ఆ విధంగా మొట్టమొదటిసారిగా నేను తెలుగు మీడియం విద్యార్థులకు సాంఘిక శాస్త్రము మరియు తెలుగు సబ్జెక్టులను బోధించాను. శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల తెలుగు భాషకు ఎంతో గొప్ప ప్రాధాన్యతను ఇస్తుంది. ఆ పాఠశాలలో తెలుగు భాషకి ఎంతో ప్రాముఖ్యతను ఇస్తూ పాఠశాల అన్ని కార్యక్రమాలలో తెలుగు సబ్జెక్టును భాగస్వామ్యము చేసేవారు. ఆ విధంగా నేను అక్కడ తెలుగుని ఎంత సౌందర్యంగా చెప్పవచ్చుననే అనే విషయాన్ని అర్థం చేసుకోగలిగాను. ఆ పాఠశాలలో మొట్టమొదటి బోధన అనుభవం అనేది నాకు తెలుగు మీద మక్కువ ఏర్పడడానికి కొంతవరకు సహకరించిందని చెప్పవచ్చు. ఆ విధంగా ఆ పాఠశాలలో నేను ఒక సంవత్సరం పాటు పని చేశాను. అంతకు మునుపు ఎలాంటి బోధన అనుభవం లేకున్నా ఆ సంవత్సర కాలంలో ఆ పాఠశాలలో మంచి పేరు సంపాదించుకోగలిగాను. ఆ తరువాత పట్టణంలోని ప్రఖ్యాతి చెందిన, కేరళ సిస్టర్ల ఆధ్వర్యంలో ఉన్నత ప్రమాణాలతో నడుస్తూ, డెబ్బై యేళ్ళ చరిత్ర కల్గిన ఫాతిమా కాన్వెంట్ ఆంగ్ల పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా చేరాను. ఈ పాఠశాలలో చేరడానికి ముందు సాంఘిక శాస్త్రం చెప్పేటటువంటి సామర్థ్యం నాకు ఉందా అనే సందేహం నన్ను వెంటాడేది. ఆంగ్ల భాష పరిజ్ఞాన లోపం వలన నేను ఆంగ్లమాధ్యమ విద్యార్థులకు సాంఘిక శాస్త్రం చెప్పడంలో అనర్హతను కలిగి ఉన్నాననే భావన ఉండేది. అందువలన నేను సాంఘిక శాస్త్రాన్ని ఆంగ్ల మాధ్యమంలో బోధించడం అన్న విషయాన్ని పూర్తిగా మర్చిపోయి

సంపూర్ణమైనటువంటి తెలుగు ఉపాధ్యాయుడిగా అవతరించాను. దీనిని నేను పూర్తి వైకల్యంగా భావించే వాన్ని. కాన్వెంట్ లో నేను తెలుగు ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించినప్పటికీ ఆంగ్ల భాషరాకపోవడం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొనేవాడిని. మా ప్రిన్సిపల్ మాట్లాడేటటువంటి సాధారణమైనటువంటి మాటలు కూడా నాకు అర్థం కాకపోయేవి. తరగతి గదిలో పాఠం చెప్పేటప్పుడు చాలా గంభీరంగా ఆత్మవిశ్వాసంతో బోధిస్తూ ఉండేవాడిని కానీ తరగతి గది నుంచి ఒకసారి బయటికి వచ్చిన తర్వాత ఎవరితో మాట్లాడాలన్నా తీవ్రమైనటువంటి సంకోచంతోనే ఉండేవాణ్ణి. అందరూ ఆంగ్ల భాషను అనర్గలంగా మాట్లాడేవారు. వాళ్లతో ఏది మాట్లాడాలన్నా నాకు చాలా ఇబ్బందిగా ఉండేది. మా పాఠశాల యాజమాన్యం ఒక్కొక్కసారి మాకు చెప్పేటటువంటి ముఖ్యమైనటువంటి విషయాలు నాకు అర్థం కాక వాటిని పాటించకపోయేవాన్ని. ఆ తర్వాత చాలా దారుణమైనటువంటి పరిస్థితులను ఎదుర్కునేవాడిని. ఎన్నోసార్లు ఆత్మ సంక్షోభానికి గురయ్యాను. అసలు ఈ కాలంలో ఇంగ్లీషు రాకపోతే ఇంతటి అవమానాలను, ఎన్ని బాధలను ఎదుర్కోవాల్సి వస్తుందా అనే ప్రశ్నలు నన్ను నిద్రకు దూరం చేసాయి. ఆ పాఠశాలలో మొదటి సంవత్సరంలో నాకు ఇంగ్లీష్ భాష రాక పోవడంవల్ల పడ్డ కష్టాలు అన్నీఇన్నీ కావు. చివరికి ఒకటి రెండు సంవత్సరాలు గడిస్తే గాని నాకు ప్రాథమిక ఆంగ్ల పరిజ్ఞానం అబ్బలేదు. మొత్తానికి ఎన్నో కష్టాలు పడుతూ, ఎన్నో అవమానాలు ఎదుర్కొంటూ రెండు సంవత్సరాలు గడిచేసరికి కొద్దిపాటిగా ఇంగ్లీషు పైన పట్టు సాధించగలిగాను. ఆ పాఠశాలలో ఆరు సంవత్సరాలు పనిచేశాను. నేను ఆ పాఠశాలను వదిలేసే నాటికి నాలో ఆంగ్ల సామర్థ్యం దాదాపు అభివృద్ధి చెందింది. నేను ఆగ్లభాషపై పట్టు సాధించడానికి ఆ పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ స్మిత, సిస్టర్ సాయుజ్య గార్లు ఏంతో ప్రోత్సహించారు. అక్కడి నుంచి నేను నూతన అవకాశాన్ని వెతుక్కుంటూ హైదరాబాదు నగరంలోని అత్యంత పేరు పొందిన సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కళాశాల బేగంపేట్ లో ఉద్యోగంలో చేరి తెలుగు విభాగాధిపతిగా నియమింపబడ్డాను. ఒక్కసారిగా పల్లెటూరు నుంచి నగరంలోని ప్రసిద్ధ కళాశాలకు వచ్చిన నేను మరోసారి నా అదృష్టాన్ని పరీక్షించుకోవడం మొదలు పెట్టాను. సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కళాశాలలో తెలుగు విభాగాధిపతిగా పనిచేస్తున్నప్పుడు తెలుగు భాషపై, తెలుగు బోధనపై సంపూర్ణమైనటువంటి అభిరుచులు, ఆసక్తి నాలో వృద్ధి చెందాయి. తెలంగాణలోని మారుమూల పల్లెటూరులో పుట్టి పెరిగిన ఒక తెలుగు ఉపాధ్యాయుడైన నాకు హైదరాబాద్ నగరానికి వచ్చిన తర్వాత యూనివర్సిటీ స్థాయి ప్రొఫెసర్లతో పరిచయం ఏర్పరచుకునే అవకాశం కలిగింది. కళాశాలలో విభాగాధిపతిగా పనిచేస్తున్న సమయంలో ఎన్నో భాషాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం వలన భాష పట్ల అమితమైన మక్కువ ఏర్పడింది. ఆ సమయంలోనే నేను పరిశోధన పత్రాలను రాయడం మొదలుపెట్టాను. సెమినార్లలో పాల్గొంటూ పరిశోధన పత్రాల సమర్పణ అనేది విరివిగా చేయడం అలవాటు అయింది. అంతేకాకుండా ఈ కళాశాలలో హృదయ సందేశం అనేటటువంటి తెలుగు విభాగ మ్యాగజైన్ ను ప్రారంభించి విద్యార్థినులందరినీ భాగస్వాములను చేసాను. తెలుగు విభాగాధిపతిగా యూనివర్సిటీకి సంబంధించినటువంటి చాలా కార్యక్రమాలు ఆంగ్లభాషలో చేయవలసి వచ్చేది. అవన్నీ చేస్తున్న ప్రక్రియలో కూడా ఎన్నో రకాలైనటువంటి సవాళ్లను భాషావరంగా ఎదుర్కోవాల్సి వచ్చేది. కళాశాలలో సమర్పించేటటువంటి ఎన్నో డాక్యుమెంట్లు కూడా ఆంగ్లభాషతో ముడిపడి ఉండేవి. ఇతర సబ్జెక్టు లెక్చరర్లకు పనిచేయడం సవాలుగా మారితే తెలుగు లెక్చరర్ అయిన నాకు మాత్రం భాష అనేది పెనుసవాలుగా మారేది. కానీ వాటన్నిటిని అధిగమించి మెల్లిగా భాషపైన పట్టు సాధించాను. అదేవిధంగా కంప్యూటర్ విద్య పైన పట్టు సాధించడం అనేది మొదలుపెట్టాను.

**4. అంతర్జాతీయ స్థాయి పాఠశాలల్లో తెలుగు అధ్యాపక నియామకాలు నిర్వహించే పద్ధతులు ఏంటి?**

నేను నా అనుభవం నుంచి ఈ ప్రశ్నకు సమాధానం చెప్పే ప్రయత్నం చేస్తాను. ప్రస్తుతం నేను పనిచేస్తున్న ఈ అంతర్జాతీయ పాఠశాలలో నియామక ప్రక్రియ వివిధ దశలలో సాగింది. మొదటి దశలో పాఠశాల నియామక మండలివారు నా వ్యక్తిగత విద్యాసంబంధిత విషయాలను క్షుణ్ణంగా అడుగారు. రెండవ దశలో రాతపరీక్షలు నిర్వహిస్తారు. అందులో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులను మూడవ దశలో తెలుగు విభాగాధిపతి సబ్జెక్టు పైన ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఈ చర్చల్లో భాషాసంబంధిత విషయాలనే కాకుండా అభ్యర్థి నాయకత్వ లక్షణాలు, మూర్తిమత్వం, భాషణం, ఆత్మవిశ్వాసం, పరిపాలనా యంత్రాంగ అనుభవం, సహపాఠ్య నైపుణ్యాలకు చెందిన విషయాలపై పరోక్ష రూపంలో పరీక్షలను నిర్వహిస్తారు. ఈ ఇంటర్వ్యూ సమర్థవంతంగా పూర్తిచేసుకున్న అభ్యర్థులు నాలుగవ రౌండ్ అయిన డెమోకు ఆహ్వానింపబడతారు. డెమోను పాఠశాల ప్రధాన యాజమాన్యం, విషయ నిపుణులు, ప్యానెల్ సభ్యులు, నియామక మండలివారి ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. డెమోను విజయవంతంగా పూర్తి చేసుకున్న అభ్యర్థులు ఐదవ రౌండ్ అయిన ప్రిన్సిపల్ తో ముఖాముఖికి హాజరవుతారు. తరువాత చివరి రౌండ్ అయిన హెచ్.ఆర్ రౌండ్ లో జీతభత్యాల చర్చలు జరుపుతారు. తరువాత అభ్యర్థి పైన ఏవైనా న్యాయపరమైన

వివాదాలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు నిర్వహిస్తారు. ఆ తరువాత పూర్వసంస్థలో అతని ప్రవర్తన గురించి దర్యాప్తు చేపడుతారు. అన్నీ స్పష్టంగా ఉన్నాయని ధృవీకరించిన పిమ్మట నియామక పత్రాలను అందించుతారు.

**5. అంతర్జాతీయ పాఠశాల విద్యార్థులు విద్యా, సాంస్కృతిక విషయాలలో ఎలా ఉంటారు?**

విద్యార్థులకు విద్యాసాంస్కృతిక విషయాలు అనేవి చాలా ప్రధానమైనవి. దీనిలో రెండు రకాల అంశాలు ఉన్నాయి. మొదటిది విద్య, రెండవది సాంస్కృతికం. విద్య విషయంలో విద్యార్థులు చాలా ఆసక్తిగా ఉన్నతమైనటువంటి భావాలతో ఉంటారు. కానీ తెలుగు భాష విషయానికి వచ్చేసరికి పూర్వ ప్రాథమిక భాషాస్థితి సమర్థవంతంగా ఉండకపోవడంవల్ల ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు కొద్దిపాటి ఒత్తిడికి గురవుతూ ఉంటారు. కానీ వాటిని అధిగమించే దిశగా చాలా గొప్ప ఆసక్తిని కలిగి ఉంటారు. సాంస్కృతిక విషయానికి వస్తే విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలలో తెలుగు భాష ఔన్నత్యాన్ని పెంచేటువంటి వివిధ విశిష్ట కార్యక్రమాలలో చాలా చురుకుగా పాల్గొంటారు. ఉపాధ్యాయుడు చెప్పేదాన్ని సమర్థవంతంగా పాటిస్తూ అభ్యసన వికాసానికి కృషి చేస్తారు. ఈ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరు ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న కుటుంబాల నుంచే వస్తారు. కాబట్టి వారిపై భాషలు, సామాజిక శాస్త్రాల ప్రభావం తక్కువగా ఉంటుంది. సమాజంలో జరిగే సాధారణమైన విషయాలను వారు అర్థం చేసుకోవడానికి చాలా సమయం పడుతుంది. సాంకేతికతతో ముడిపడి ఉన్న విషయాలపట్ల అమితమైన ఆసక్తిని చూపిస్తారు. తల్లిదండ్రులు పిల్లలకోసం పడే ఆరాటం, మూగ జీవన వేదన, పేదరికం, నిరుద్యోగం, ఆకలి, పుణ్యక్షేత్రాలు, దైవ చింతన, ఆధ్యాత్మికత సంబంధిత విషయాలను ఉపాధ్యాయుడు బోధిస్తున్నప్పుడు వాస్తవానికి విద్యార్థులు ఆ విషయంలో లీనమైపోయి పాఠంలో భాగస్వాములై సందర్భానుసారంగా వారి హావభావ వ్యక్తీకరణను ప్రదర్శించాలి. కానీ దానికి భిన్నంగా ఆ విషయాలేవీ మాకు సంబంధించినవి కావి అనే భావనను స్పష్టంగా చూపిస్తూ మొక్కుబడిగా పాఠాన్ని వింటారు. ఈ పాఠశాలల్లో విద్యార్థులు ఎక్కువగా వ్యాపార సంబంధిత, ఆదాయ సంబంధిత, సాంకేతికపరమైన విషయాల మీద ఆసక్తి చూపుతారు. సమాజంలో అధిక సంఖ్యాకులైన పేద, మధ్య తరగతి ప్రజల జీవన స్థితిగతుల గురించి ప్రాథమిక అవగాహన కూడా వీళ్ళకు ఉండదు. ఇది నేను పొందిన వ్యక్తిగత అనుభవం. మిగతా పాఠశాలల్లో నా అనుభవానికి భిన్నంగా ఉండొచ్చు.

**6. మీరు అంతర్జాతీయ పాఠశాలలో చేరినప్పుడు మీ తొలినాళ్ల సవాళ్లను వివరించండి?**

నేను పూర్తిస్థాయి సాంప్రదాయ బోధన కలిగిన పాఠశాల, కళాశాలలో చదువుకున్నాను. అదేవిధంగా నా ఎనిమిది సంవత్సరాల బోధన వృత్తి కూడా చాలా సాంప్రదాయ పాఠశాల, కళాశాలలోనే సాగింది. కాబట్టి ఆ సందర్భాలలో నేను బోధన, బోధనేతర విషయాలలో ఎలాంటి ఒడిదుడుకులను లేదా ఒత్తిడిని ఎదుర్కొన్న దాఖలాలు లేవు. కానీ ఈ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడుగా చేరిన తొలినాళ్లలో నేను చాలా రకాల సవాళ్ళను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆంగ్లభాష అనేది ఈ రకమైన పాఠశాలల్లో తప్పనిసరి. తెలుగు ఉపాధ్యాయుడు అయినప్పటికీ ఆంగ్ల భాషను మాట్లాడగలిగే సమర్థతను కలిగి ఉండాలి. నేను అవసరమైనంత ఆంగ్ల పరిజ్ఞానాన్ని కలిగి ఉన్నప్పటికీ కొన్ని సందర్భాలలో దాని స్థాయి సరిపోక ఆ పనికి సరిపోయే విధంగా ఉండకపోయేది. దీనివల్ల చాలారకాలైన భాషానుసంధాన సమస్యలను ఎదుర్కొన్నాను. ఆ తదుపరి నేను ఆంగ్లభాషపై పట్టు సాధించి ప్రస్తుతం భాషాసంబంధిత సమస్యలను ఎదుర్కోవడం లేదు.

ఈ పాఠశాలలో నేను ఎదుర్కొన్న మరొక ముఖ్యమైనటువంటి సమస్య కంప్యూటర్ పరిజ్ఞానానికి సంబంధించింది. అంతకుముందు నేను పని చేసినటువంటి పాఠశాలలు, కళాశాలల్లో కంప్యూటర్ వినియోగం పరిమితంగా ఉండేది. కానీ, ఈ పాఠశాలలో పూర్తిస్థాయి కంప్యూటరు వినియోగంతోనే అన్ని రకాల కార్యక్రమాలు, బోధన, బోధనేతర పనులను నిర్వహించాల్సి ఉంటుంది. కాబట్టి సంపూర్ణమైనటువంటి కంప్యూటర్ జ్ఞానం లేకపోవడం వలన మొదటగా నేను కొద్దిపాటి ఇబ్బందులకు గురికావలసి వచ్చింది. తర్వాత పట్టుదలతో నేర్చుకొని ప్రస్తుతం సమర్థవంతంగా నిర్వహించగలుగుతున్నానని చెప్పగలను. ఆంగ్లము, కంప్యూటర్ పరిజ్ఞానానికి సంబంధించిన విషయాలు కాకుండా అంతర్జాతీయ పాఠశాలలోని విద్యార్థులకు తెలుగు బోధించడం ఒక సవాలుగా తెలుగు ఉపాధ్యాయుడినైన నాకు మారింది. తెలుగులో కేవలం ఒక అదనపు సబ్జెక్టుగా భావించేటటువంటి విద్యార్థుల హృదయాలలో తెలుగే సర్వం అనే బీజాలు నాటించే ప్రక్రియలో నేను ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నాను. ఆ ప్రక్రియలో నేను ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాను. అసమానతను అనేకసార్లు చవిచూశాను. అయినా వదలకుండా విద్యార్థులలో తెలుగుపైన మక్కువను కల్పించేటటువంటి ప్రయత్నాన్ని నేటికీ చేస్తూ కొద్దికొద్దిగా సఫలం అవుతున్నాను. ప్రారంభంలో ఉన్న చిన్నచూపు స్వల్పంగా తగ్గుతూ విద్యార్థులకు తెలుగు భాషపైన

మమకారం ఏర్పడడం మొదలైంది. ఈ పాఠశాలల్లో తెలుగు మాతృభాషగా కలిగిన విద్యార్థులకు సైతం కొందరికి మాతృభాషకు సంబంధించిన పట్టు ఉండదు. దీనివల్ల వారికి మాతృభాషలో బోధన అనే విషయం చాలా కష్టతరం. వారికి బోధించేటప్పుడు త్రిభాషా సూత్రాన్ని ఉపయోగించి బోధించడం జరుగుతుంది. అంతర్జాతీయ పాఠశాలలో దేశానికి చెందిన అన్ని రాష్ట్రాల విద్యార్థులు, తెలుగేతర దేశాల నుంచి తిరిగి వచ్చిన తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఉంటారు. వీరికి తెలుగు అనేది చాలా క్లిష్టతరమైన భాష. అధిక శాతం విద్యార్థులకు తెలుగును చాలా కష్టతరం, సమస్యాత్మకమైన సబ్జెక్టుగా పరిగణిస్తున్నారు. వారిలో ఉన్నటువంటి వివిధ రకాల అభిప్రాయాలను అధిగమించి తెలుగును బోధించడం భారీ సవాలుగా మారింది. కానీ ఇప్పుడు క్రమక్రమంగా అది తగ్గుతూ తెలుగుపైన ఆసక్తిని విద్యార్థులు ఏర్పరచుకుంటున్నారు.

**7. అంతర్జాతీయ పాఠశాలలో కరికులం ఎలా ఉంటుంది? కొంచెం వివరంగా చెప్పండి.**

అంతర్జాతీయ పాఠశాలలో కరికులం రాష్ట్రస్థాయి పాఠశాలలో ఉన్న విధంగానే ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వ పాఠ్య పుస్తకాలని అంతర్జాతీయ పాఠశాలల్లో కూడా తూచా తప్పకుండా పాటిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ పాఠ్యపుస్తకాలలోని పద్య, గద్య సాహిత్యాలు, వ్యాకరణం, పదజాలం మొదలైన అన్ని అంశాలతో కూడిన పాఠ్య పుస్తకాన్ని అంతర్జాతీయ పాఠశాలలు అనుసరిస్తున్నాయి. పరీక్ష విధానాలు కూడా చాలా పకడ్బందీగా పటిష్టమైన సమయపాలనతో నిర్వహిస్తారు. కానీ, ఈ పాఠశాలలో సీబీఎస్సీ, ఐబి బోర్డ్ కరికులంను పాటించడంవల్ల ప్రశ్నాపత్ర సరళి రాష్ట్ర ప్రభుత్వ ప్రశ్నాపత్రానికి కొద్దిపాటి భిన్నంగా ఉంటుంది. కరికులంలో కూడా బోధన పద్ధతులు రాష్ట్ర ప్రభుత్వ పాఠ్యపుస్తక నిర్దేశిత తెలుగు బోధన పద్ధతులను అనుసరించి మాత్రమే ఉంటాయి. బోధన పద్ధతుల్లో ఎటువంటి తారతమ్యం ఉండదు. కానీ బోధన స్థాయిల్లో కొద్దిపాటిగా భేదం కనిపిస్తుంది. తెలుగును ఐచ్ఛిక సబ్జెక్టుగా ఐబి లో విద్యార్థులు చదువుకోవడంవల్ల ఇతర బోర్డులు ఇచ్చే ప్రాధాన్యత ఐబి బోర్డు తెలుగు భాషకు ఇవ్వదు. ప్రస్తుతం కొన్ని ఐబీ పాఠశాలలు తెలుగు భాషను ప్రధాన భాషగా ఎంచుకున్నారు. కానీ ఎక్కువ శాతం పాఠశాలలు ఐచ్ఛిక సబ్జెక్టుగానే ఎంపిక చేసుకున్నాయి. ప్రశ్నాపత్ర సరళి, పరీక్ష విధానాలు అన్ని ఇతర బోర్డుల కంటే ఐబి బోర్డు భిన్నంగా నిర్వహిస్తుంది.

పరీక్షలు పూర్తిస్థాయి రాతసామర్థ్యాల మీద ఆధారపడి ఉండవు. ప్రతి తరగతిలోను ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తారు. ప్రయోగాలకు అధిక ప్రాధాన్యతను ఇచ్చి విద్యార్థి భౌతికమైన చర్యల ద్వారా నేర్చుకునే విధమైన పాఠ్యప్రణాళిక ఉంటుంది. కృత్యాధార బోధన ఐబి లో చాలా ముఖ్యమైనది. విదేశీ సందర్శనలు అనేవి ఐబి కరికులంలో తప్పకుండా నిర్వహిస్తారు. ప్రాంతీయ, దేశీయ బోర్డులు కేవలం విద్యాబోధనను చేయించి, రాత పరీక్షల ఆధారంగా విద్యార్థి సామర్థ్యాలను మూల్యాంకనం చేస్తుంది. కానీ ఐబి కరికులంలో రాత అంశాలను చాలా స్వల్ప ప్రాధాన్యతను ఇచ్చి ప్రయోగాలకు, ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యతను ఇస్తుంది. విద్యార్థులకు పాఠశాలస్థాయిలోనే వివిధ నైపుణ్యాలు మెరుగుపడి భవిష్యత్తులో గొప్ప వ్యాపార దిగ్గజాలుగా, ఉత్తమమైన శాస్త్రవేత్తలుగా, వైద్యులుగా స్థిరపడే విద్యాప్రణాళికను ఐబి కరికులం అందిస్తుంది. ఇందులో విద్యార్థుల రాత నైపుణ్యాల కంటే వారి ప్రజ్ఞ నైపుణ్యాలకు ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వడాన్ని ప్రధానంగా గమనించవచ్చు.

**8. అంతర్జాతీయ పాఠశాలలో బోధించాలంటే ఒక తెలుగు ఉపాధ్యాయుడికి భాషాపరంగా ఎలాంటి పరిజ్ఞానం ఉండాలి?**

అంతర్జాతీయ పాఠశాలలో బోధించడానికి తెలుగు ఉపాధ్యాయుడికి తెలుగు భాషతోపాటు చాలా రకాలైన పరిజ్ఞానాలు ఉండాలి. ఒక తెలుగు ఉపాధ్యాయుడికి తన భాష మీద ఖచ్చితంగా పట్టు ఉంటుంది. కానీ, అంతర్జాతీయ పాఠశాలలో బోధించడానికి కేవలం తెలుగు భాష పరిజ్ఞానం సరిపోదు. తెలుగు భాషను కేవలం సబ్జెక్టుగా బోధించడానికి మాత్రమే ఉపయోగించగలుగుతాం. కానీ, అంతర్జాతీయ పాఠశాల విద్యార్థులకు తెలుగు బోధించడం అనేది కేవలం భాష మీదనే కాకుండా ఎన్నో రకాలైనటువంటి నైపుణ్యాలమీద ఆధారపడి ఉంటుంది. ఆంగ్ల భాష జ్ఞానాన్ని కలిగి ఉండడం అంతర్జాతీయ పాఠశాలలో పనిచేసే తెలుగు ఉపాధ్యాయులకు తప్పనిసరి అనే పరిస్థితి నేటి కాలంలో సంభవించింది. హిందీ, ఆంగ్లములాంటి జాతీయ, అంతర్జాతీయ భాషలతోపాటు తన సబ్జెక్టు తెలుగులో పట్టు కలిగి ఉన్నప్పుడే అంతర్జాతీయ పాఠశాల విద్యార్థులకు బోధించడం అనేది సులభతరం అవుతుంది. ఎందుకంటే వివిధ ప్రాంతాల, రాష్ట్రాల, విదేశాలకు సంబంధించిన విద్యార్థులు అంతర్జాతీయ పాఠశాలలో చదువుకోవడంవల్ల వాళ్లతో భాషా అనుసంధానం అనేది ఇతర భాషల్లో చేయగలిగినప్పుడే తెలుగు భాషను వారికి అర్థవంతముగా బోధించగలమనేది నా అభిప్రాయం. అంతర్జాతీయ పాఠశాలలో పనిచేసే తెలుగు ఉపాధ్యాయులకు ఉండవలసిన మరొక ముఖ్యమైంది కంప్యూటర్ పరిజ్ఞానం. ఉపాధ్యాయులు ఇంతకు మునుపు కంప్యూటర్లను ఉ

పయోగించవలసిన అవసరం ఎక్కువగా ఉండేది కాదు. ఇప్పటికీ సాంప్రదాయక పాఠశాలలు, కళాశాలలలో కంప్యూటర్ వాడకం అనేది పరిమితంగానే ఉంది. కానీ అంతర్జాతీయ పాఠశాలల్లో కంప్యూటర్ పరిజ్ఞానం అనేది అతి తప్పనిసరి. కంప్యూటర్ తోనే ప్రతినిత్యం ఉపాధ్యాయుడు పనిచేయవలసి ఉంటుంది. బోధన, బోధనేతర మొదలైన అన్ని విషయాలలో కంప్యూటర్ ప్రమేయం అనేది చాలా కీలకంగా మారింది. కాబట్టి, కంప్యూటర్ జ్ఞానం లేనటువంటి తెలుగు ఉపాధ్యాయుడు అంతర్జాతీయ పాఠశాలలో పనిచేయడం చాలా కష్టతరమైంది. దాదాపు అసాధ్యమనే చెప్పాలేమో.

అంతర్జాతీయ పాఠశాలలో తెలుగును బోధించాలంటే, కేవలం తెలుగు భాష కాకుండా త్రిభాషా సూత్రాన్ని ఉపయోగించి బోధించవలసి ఉంటుంది. అవసరమైన చోట హిందీ, ఇంగ్లీష్ భాషలను విరివిగా ఉపయోగిస్తూ తెలుగును విద్యార్థుల మెదళ్ళలో నాటవలసి ఉంటుంది. కాబట్టి, బహుభాషావేత్తగా, కంప్యూటర్ పరిజ్ఞాన పరిపూర్ణంగా ఉన్న వ్యక్తిగా అంతర్జాతీయ పాఠశాలల్లోని తెలుగు ఉపాధ్యాయుడు ఉండాలి.

నేటి కాలంలో తెలుగు భాషను బోధించడం అనేది సవాలుతో కూడుకున్న విషయమే. ఎందుకంటే తల్లిదండ్రుల దృక్పథం తెలుగు మీద పూర్తిగా మారిపోయింది. ఆ దృక్పథం అనేది మంచిదా లేదా చెడుదా అనే విషయాన్ని చెప్పడం కొద్దిపాటిగా సందిగ్ధమే. అయినప్పటికీ, మొత్తానికి ప్రతికూలం అని చెప్పవచ్చు. విద్యార్థుల్లో కూడా తెలుగుపైన సంకుచిత భావం ఉండడంవల్ల నేర్చుకోవాలనే ఆసక్తి అనేది తగ్గింది. దీనివల్ల ముఖ్యంగా అంతర్జాతీయ పాఠశాలలో పనిచేసేటటువంటి ఉపాధ్యాయులకు తెలుగు బోధించడం అనేది ఒక గొప్ప సవాలుగా మారింది. రాష్ట్రీయేతర, ప్రాంతీయేతర, విదేశాల విద్యార్థులు చదువుకోవడంవలన వాళ్లకు తెలుగుపై పూర్వజ్ఞానం లేకపోవడంవల్ల తెలుగును బోధించడంలో తెలుగు భాష ఉపాధ్యాయుడు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాడు. దీనిని అధిగమించడానికి వివిధ రకాల ప్రాంతాల, భాషల విద్యార్థులకు తెలుగులో బోధించడానికి ఉపాధ్యాయుడు ఎన్నో రకాల భాషలను ఉపయోగించవలసి ఉంటుంది. లేనిపక్షంలో విద్యార్థులకు తెలుగు భాష అర్థంకాక ఉపాధ్యాయుడు చెప్పేటటువంటి విషయాన్ని అవగాహన చేసుకునే పరిస్థితుల్లో ఉండరు. కాబట్టి తెలుగు ఉపాధ్యాయుడు ఇతర భాషలను ఉపయోగిస్తూ తెలుగును బోధించాల్సిన ఆవశ్యకత నూరు శాతం ఉంది.

**9. అంతర్జాతీయ పాఠశాలల్లో తెలుగుపై ఆంగ్ల భాష ప్రభావం ఏవిధంగా ఉంది?**

అంతర్జాతీయ పాఠశాలల్లో ఆంగ్ల సాగరంలో తెలుగు అనేది ఒక చిన్న బిందువుగా ఉంది. కాబట్టి ఆ ప్రవాహాన్ని అధిగమిస్తూ తన ఉనికిని కాపాడుకునే తీవ్రమైన పోరాటం తెలుగు భాష నేటికి చేస్తుంది. ఆంగ్ల భాషాప్రభావం కారణంగా తన ఉన్నతిని, గుర్తింపును కోల్పోతున్నటువంటి తెలుగు భాష తన అస్తిత్వాన్ని కాపాడుకొనుటకు ఎంత పోరాటం చేసినప్పటికీ సాధించే ఫలితం మాత్రం నామమాత్రంగానే ఉంది. మిగతా అన్ని సబ్జెక్టులను ఆంగ్లంలో చదువుకునే విద్యార్థులు ఒక తెలుగు భాషను మాత్రమే అచ్చ తెలుగులో చదువుకోవడం అనే పరిస్థితి వారికి తెలుగు పట్ల అనాసక్తిని కలిగించే విధంగా చేస్తుంది. విద్యార్థుల భాష, ముఖ్యంగా పదజాలం పూర్తిగా ఆంగ్ల ప్రభావంతో మునిగిపోయింది. దాని కారణంగా తెలుగును నేర్చుకోవడం అనే ఆసక్తిని తగ్గించింది. తరగతి గది భాషణం, పాఠశాల కార్యక్రమాలన్నీ కూడా ఆంగ్లంలోనే జరుగుతుండడంవల్ల విద్యార్థులకు తెలుగుపట్ల మమకారం తగ్గుతుంది. ఆంగ్లమనే భాషాగ్నికి తెలుగు ఆహుతయ్యే పరిస్థితి దాపురించింది.

**10. విద్యార్థులకు సృజనాత్మకంగా బోధించాలంటే మీరు అనుభవంతో ఎంచుకున్నటువంటి బోధన పద్ధతులు ఏవి?**

తెలుగును బోధించడానికి నేటికాలంలో చాలా విభిన్నమైనటువంటి విధానాలను మనం ఆవిష్కరించవలసి ఉంటుంది. పూర్వ సాంప్రదాయ విధానాలను ఉపయోగించి తెలుగు బోధనను చేసినట్లయితే విద్యార్థులు ఎలాంటి ఆసక్తిని చూపరు. దీనివల్ల బోధన కుంటుపడుతుంది. విద్యార్థులలో అభ్యసనం అనేది అభివృద్ధి చెందదు. దీనివల్ల పూర్తిస్థాయి విద్యాప్రమాణాలు పడిపోతాయి. కాబట్టి నేను విద్యార్థులకు బోధించే బోధన విధానాలలో ముఖ్యంగా ప్రయోగాత్మకమైనవి ఎక్కువ. పాఠంలోని విషయాన్ని వాళ్లకి కళ్ళకు కట్టినట్టుగా చూపించే దృశ్య, శ్రవణ మాధ్యమాలను ఉపయోగించడం లాంటివి విరివిగా చేస్తూ ఉంటాను. పాఠ్యాంశానికి సంబంధించిన విషయానికి విద్యార్థులను ఉదాహరణ పరుస్తూ లేదా వారితో నటింప చేస్తూ నాటక సహితంగా ప్రదర్శిస్తున్న తరగతి గదిని ఏర్పరుస్తాను. ప్రయోగాత్మకమైన బోధన విధానం వల్ల విద్యార్థులకు తెలుగు భాష పట్ల మక్కువ అనేది చాలా తొందరగా ఏర్పడుతుంది. సాధ్యమైనంత వరకు తెలుగు భాషను ఉపయోగిస్తూ వారికి అర్థం కానటువంటి పద ప్రయోగాలను ఆంగ్ల, హిందీ భాషలలో వివరిస్తూ బోధనను కొనసాగించడం

వల్ల విద్యార్థులలో సందేహ నివృత్తి అనేది సత్వరముగా జరిగి బోధన విజయవంతం అవుతుంది. అంతేకాకుండా తెలుగు ప్రక్రియలను విరివిగా ఉపయోగిస్తూ తరగతి గదిని కళాత్మకంగా మార్చడంవల్ల విద్యార్థులలో తెలుగు భాషపట్ల అమితమైన ఆసక్తి ఏర్పడుతుంది. బుర్రకథలు, నాటకాలు, యక్షగానాలు, తోలుబొమ్మలాటలు, ఏకపాత్రాభినయాలు లాంటి విశిష్ట తెలుగు బోధన ప్రక్రియలను, పద్ధతులను ఉపయోగించి తరగతి గదిలోని విద్యార్థులను తెలుగు భాష వైపుకి మళ్లించవచ్చు. పద్యభాగాన్ని బోధించే సందర్భంలో తెలుగు ఉపాధ్యాయుడిగా రాగ, భావయుక్తంగా పద్యపఠనాన్ని గావిస్తూ, విద్యార్థులను రంజింప చేస్తాను. భావయుక్తంగా మధురమైన గొంతుతో పద్యాలను పాడడంవల్ల విద్యార్థులకు భాషపట్ల విసుగు అనేది కలగకుండా ఆసక్తి కలిగి వినాలనే కోరికను కలిగింపజేస్తాను. సందర్భానుసారగా హావభావ ప్రదర్శనను చేస్తాను. విషయాన్ని బోధించేటప్పుడు చిత్రాలు, వీడియోలు ఆ విషయానికి సంబంధించిన రికార్డులు లాంటివి చూపించి విద్యార్థులకు సంపూర్ణ విషయ పరిజ్ఞానాన్ని అందించడంలో తోడ్పడుతాను. గద్యభాగ బోధనలో నమూనాలు నాటి సామాజిక జీవన చిత్రణలను ప్రదర్శించే చలనచిత్రాలు, కవులు కళాకారులకు సంబంధించిన పుస్తక ప్రదర్శనలు చేస్తాను. కథలు కవితలులాంటి తెలుగు ప్రక్రియలను విద్యార్థులకు పరిచయం చేయడంవలన తెలుగుపట్ల వారికి ఆసక్తి ఏర్పడుతుంది. సాధ్యమైనంత వరకు విద్యార్థులను పాఠ్య బోధనలో భాగస్వాములను చేస్తూ, బోధించడంవల్ల వారికి పాఠ్యాంశం పట్ల ఇష్టం ఏర్పడుతుంది. ఈ విధమైన సృజనాత్మక పద్ధతులు ఉపయోగించి నేను తెలుగు బోధనను చేస్తాను.

తెలుగు అధ్యాపకుడికి తెలుగు భాష మీద అమితమైన పట్టుతోపాటు సాంకేతిక అవగాహన తప్పనిసరి. కంప్యూటర్ పరిజ్ఞానాన్ని కలిగి ఉన్నటువంటి తెలుగు ఉపాధ్యాయుడు తన బోధనను, బోధనేతర విషయాలను కూడా సమర్థవంతంగా నిర్వహించగలడు. ఎమ్మెస్ వర్డ్, ఎమ్మెస్ ఎక్స్ ఎల్, ఎమ్మెస్ పవర్ పాయింట్ లాంటి ప్రాథమిక కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి. పవర్ పాయింట్ ప్రదర్శనల ద్వారా బోధన చేయడం అంతర్జాతీయ పాఠశాలల్లో తప్పనిసరి. సమాచార సాంకేతిక పరిజ్ఞానం (Information and communication Technology) ICT ఆధారిత డిజిటల్ పాఠ్యప్రణాళికను ఏర్పరుచుకొని బోధన చేయడం వలన విద్యార్థులకు బాగా అర్థం అవుతుంది. అనిమేషన్, త్రీడీ చిత్రాలు వీడిఓల ద్వారా పాఠాన్ని బోధించినట్లైతే విద్యార్థులు ఆసక్తి చూపిస్తారు.

ఉదాహరణకు పదవ తరగతి ఉపవాచకంలోని రామాయణాన్ని ప్రకాశ పఠనంద్వారా ఉపాధ్యాయుడు బోధిస్తే, విద్యార్థులకు అమూర్త భావన మాత్రమే ఏర్పడుతుంది. కానీ, అదే రామాయణాన్ని ఐసిటి సహాయంతో ఆనిమేషన్ వీడియోలు, చిత్రాలు, స్మార్ట్ బోర్డ్ ప్రదర్శనల వలన విద్యార్థులు పూర్తిస్థాయిలో అవగాహన పొంది, మూర్త భావనకు లోనవుతారు. ఈ విధమైన సంపూర్ణ కంప్యూటర్ పరిజ్ఞానాన్ని కలిగి ఉన్నటువంటి తెలుగు ఉపాధ్యాయుడు సమర్థవంతంగా బోధనను చేయగలడు.

**11. మీ విద్యార్థులకు స్వీయ భాషాఅస్తిత్వ సాంస్కృతిక అవగాహనను ఎలా కలిగింపచేస్తారు?**

మా విద్యార్థులకు స్వీయ భాషాఅస్తిత్వాన్ని కలిగింపజేయడంలో నేను ఉపయోగించే సాధనం మాతృభాష అనే దృఢమైన భావన. మాతృభాషపై మమకారం అనే దృఢమైన భావనను విద్యార్థుల్లో కలిగించినట్లయితే వారిలో భాషపై మమకారం ఏర్పడడం మొదలవుతుంది. మాతృభాష ఉన్నతత్వమును తెలియజేయడం, తెలుగు గ్రంథాల ప్రాముఖ్యతను వివరించడంవల్ల విద్యార్థులకు తెలుగు భాష ఔన్నత్యం తెలుస్తుంది. ప్రపంచ భాషల్లో తెలుగు భాష విశిష్టతను విద్యార్థులకు వివరిస్తూ, కులంకషంగా వారితో చర్చించడంవలన వారిలో అస్తిత్వ భావన అనేది మేల్కొంటుంది. అంతరించిపోతున్నటువంటి భాషల్లో తెలుగు ఉందన్న విషయాన్ని విద్యార్థులకు తెలియజేస్తూ, ఒకవేళ అంతరించిపోయినట్లయితే జాతి కోల్పోయేటటువంటి అఖండ సంపద ఎటువంటిదో విద్యార్థులకి తెలియజేసినట్లయితే వారిలో తెలుగుపట్ల ఉన్నటువంటి ఉదాసీనత తొలగిపోతుంది. నా తల్లి భాషను రక్షించుకోవాలనేటటువంటి భాషాప్రేమ ఉద్భవిస్తుంది. తల్లిపాల వంటి భాషను రక్షించుకోవాలనే మాతృభావన ఏర్పడుతుంది. ఈ విధమైనటువంటి భావన ఏర్పడినటువంటి విద్యార్థులు తెలుగు భాషాసాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొంటారు. అందులో ప్రముఖమైన తెలుగు భాషాదినోత్సవాన్ని నిర్వహించడంలో వారు ఆసక్తిని చూపిస్తారు. తెలుగు భాషకు ఎనలేని కృషి చేసిన మేధావులు, రచయితలు, పండితులు, కవులు, కళాకారుల గురించిన స్పష్టమైన సమాచారాన్ని విద్యార్థులకు అందించడం వలన విద్యార్థులలో తెలుగు సాంస్కృతిక కళాత్మక సౌందర్యం వికసిస్తుంది. దీనివల్ల భాషాదినోత్సవాలు, కవులు కళాకారుల స్మరణోత్సవాలు అనేవి నిర్వహించగలుగుతారు. ఈ కారణం చేత విద్యార్థులలో తెలుగు భాష అస్తిత్వ పరిరక్షణ చేయాలనే సంకల్పం కలుగుతుంది. అంతేకాకుండా తెలుగు సాంస్కృతిక సారథులుగా మారాలనే దృఢసంకల్పం విద్యార్థులలో కలిగి భాషాగౌరవ అభిమానాలు

ఏర్పడతాయి.

**12. విద్యార్థుల భాషాప్రగతిని కొలవడానికి ఎటువంటి ప్లానింగ్, అసెస్మెంట్ స్కిల్స్ ఉండాలి?**

నేటికాలంలో విద్యార్థుల ప్రగతిని మార్కుల్లో కొలిచి వాళ్ళ మూర్తిమత్వాన్ని తీవ్రంగా దెబ్బతీయడం జరుగుతుంది. నిజానికి విద్యార్థుల ప్రగతిని వారి మార్కుల్లో కాకుండా వారి సమగ్ర మూర్తిమత్వ అభివృద్ధిలో కొలవాలనేది నా అభిప్రాయం. మార్కులను విద్యార్థుల జీవితాన్ని నిర్దేశించే ప్రముఖమైన విషయంగా మార్చడం జరిగింది. కేవలం మార్కుల వల్ల విద్యార్థిని అంచనా వేయగలడం అనేది నా అభిప్రాయం ప్రకారం సరైనది కాదు. ఎందుకంటే ప్రతి విద్యార్థిలో ఉన్న వివిధ రకాల నైపుణ్యాలు మార్కుల రూపంలో బయటికి రాకపోవచ్చు. పరీక్షలలో రాసిన జవాబులు ఆధారంగా విద్యార్థి సమగ్ర ప్రతిభాపాటవాలను ఏ విధంగా లెక్క కట్టగలం? విద్యార్థి ప్రగతిని కొలవడానికి కేవలం పరీక్ష విధానాలని అనుసరించడం కాకుండా ప్రయోగాత్మకమైన విధానాలద్వారా అంచనా వేసినట్లయితే, సమగ్రమైన ప్రగతి నివేదికను పొందగలం. మాట్లాడడం, చదవడం, రాయడం, పాడడం, అభినయించడం, ఉపన్యసించడంలాంటి వివిధ రకాల మూల్యాంకనాలు చేయడంవల్ల విద్యార్థి సమగ్ర ప్రతిభను అంచనా వేయగలం. కేవలం రాత పరీక్షలలో నిర్వహించిన ప్రతిభ ఆధారంగా విద్యార్థిని అంచనా వేసినట్లయితే, ఇతర నైపుణ్యాలు బయటికి రాకుండా ఉండి విద్యార్థి ప్రతిభను తప్పుగా అంచనా వేసే అవకాశం ఉంది. ఒక విషయం పైన విద్యార్థికి ఎంతవరకు అవగాహన ఉందని విషయంతోపాటు సమస్యాత్మకమైన సందర్భాలలో తన మేధాసంపత్తిని ఎంతవరకు ఉపయోగించి సమస్య పరిష్కార నివారణ మార్గాలను కనుగొనగలుగుతున్నాడు అనే విషయాన్ని బట్టి విద్యార్థి ప్రతిభను అంచనా వేయవచ్చు. విద్యాప్రణాళిక చట్రంలో కేవలం బట్టీ పద్ధతికి రాత పరీక్షలలో నిర్వహించిన మార్కులకు ప్రాధాన్యత ఇవ్వకుండా తార్కికమైన ఆలోచన విధానానికి సమస్య పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చే బోధన పద్ధతులను ప్రవేశపెట్టడంద్వారా విద్యార్థి ప్రతిభను సరైన ప్రమాణాలతో అంచనా వేయవచ్చు.

**13. విద్యార్థులతో తెలుగు అధ్యాపకులు ఎలాంటి సంబంధాలను నెలకొల్పుకోవాలి?**

పూర్వకాలంలో ఉపాధ్యాయ విద్యార్థి సంబంధం అనేది చాలా సుదూరంగా ఉండి ఉపాధ్యాయ కేంద్రీకృతంగా బోధన జరిగేది. కానీ నేటికాలంలో ఆ సాంప్రదాయ బోధన పద్ధతులను విద్యార్థులు ఇష్టపడడం లేదు. కాబట్టి మారుతున్న కాలానికి అనుగుణంగా తెలుగు భాషను బోధించే ఉపాధ్యాయుడు విద్యార్థులతో చాలా సృజనాత్మకమైన బోధనాపద్ధతులను ఉపయోగించి గురు శిష్య సంబంధాన్ని కొనసాగిస్తూనే స్నేహపూరితంగా మెలగాల్సి ఉంది. తెలుగు ఉపాధ్యాయుడు అనగానే విద్యార్థులలో ఒక గురువు అనే భావన మాత్రమే కాకుండా సమగ్ర కళాకారుడు అనే భావన ఏర్పరచగలగాలి. ఇందుకోసం కేవలం భాషాబోధన చేయడమే కాకుండా ఇతర కళలలో ఆరితేరినవాడై ఉండి విద్యార్థులకు అన్ని కళలలో శిక్షణ ఇస్తూ, సన్నిహితమైన స్నేహితుడిగా, శ్రేయోభిలాషిగా ఉండాలి. విద్యార్థులకు ఒక వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే విషయాలను బోధించడంవల్ల వారి జీవితంలో ఏర్పడే ఒడిదుడుకులను సులభంగా తట్టుకొని వాటికి పరిష్కార మార్గాలను అన్వేషించుతారు. దీనివలన ఉపాధ్యాయుడిపైన ఒక సానుకూల అభిప్రాయం విద్యార్థులకు ఏర్పడి, మా ఉపాధ్యాయుడు మా మార్గదర్శి అనే భావన ఏర్పడుతుంది. దీనివలన ఉపాధ్యాయుడు చెప్పే విషయాన్ని విద్యార్థులు చాలా శ్రద్ధాసక్తులతో విని, వారి జీవిత పయనంలో అనుసరించాల్సిన విధానాలను గ్రహించగలుగుతారు. పురాణాలను, శాస్త్రాలను అనుప్రయుక్తం చేస్తూ, ప్రముఖ నవలలు, కవితలు రచనలలోని విషయాలను విద్యార్థులకు తెలియజేస్తూ నిత్యజీవితంలోని విషయాలతో అనుసంధానం చేసే బోధనను తెలుగు ఉపాధ్యాయుడు చేయడంవల్ల గురు శిష్యుల మధ్య గౌరవప్రదమైన బంధం ఏర్పడుతుంది. ఇది భాషాభివృద్ధికి అదేవిధంగా విద్యార్థి సమగ్ర అభివృద్ధికి దోహదం చేసి విద్యాసంబంధిత విషయాలు వికాసం చెందడంతోపాటు విద్యార్థిలో నాయకత్వ లక్షణాలు పెంపొందించబడతాయి. అంతర్జాతీయ పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయుడు నిర్దేశిత వైఖరితో కాకుండా మిత్రుడి వలె మెలగాలి. విద్యార్థులపై ఏ విషయంలోనూ ఆదేశాలతో కూడిన పద్ధతులు పాటించకూడదు. విద్యార్థులకు విద్యాసముపార్జనలో ఉత్తమ సహాయకుడిగానే వ్యవహరించాలి. అంతే కానీ నిర్దేశకుడిగా కాదు.

**14. భిన్న సంస్కృతుల నుంచి వచ్చిన విద్యార్థులకు భాషపట్ల అభిమానాన్ని కలిగించాలంటే ఎలాంటి కోకరిక్యులర్ యాక్టివిటీస్ నిర్వహించాలి?**

భిన్న సంస్కృతులు, ప్రాంతాల, విదేశాలనుంచి వచ్చిన విద్యార్థులకు తెలుగు భాషపట్ల అభిరుచిని కలిగించడానికి పాటించవలసిన మరొక ముఖ్యమైన సాధనం పాఠ్యేతర కార్యక్రమాలు. పాఠ్యేతర కార్యక్రమాలను నిర్వహించడంవల్ల విద్యార్థులలో ఆ భాషకు సంబంధించిన ప్రక్రియలు మరియు మూలాలు పూర్తిగా అర్థమవుతాయి. ఉదాహరణకు భాగవత, రామాయణ, మహాభారత కథలను నాటక రూపంలో ప్రదర్శించడం వల్ల ఆ విద్యార్థులలో కళాత్మకశక్తి వృద్ధిచెందడమే

కాకుండా దానికి సంబంధించిన విషయ అవగాహన కలిగి భాషాభివృద్ధి జరుగుతుంది. వీటితోపాటు కవి సమ్మేళనాలు, పద్య పఠన పోటీలు, ఉపన్యాస పోటీలు, కథా రచన పోటీలు, కవితల పోటీలు లాంటి వివిధ తెలుగు భాష ప్రక్రియ లకు చెందిన పోటీల నిర్వహించడంవల్ల విద్యార్థులలో భాష జ్ఞానం పెంపొంది భాషాభివృద్ధి జరుగుతుంది. తెలుగు భాష దినోత్సవాలులాంటి భాషాఉనికిని ప్రదర్శించే దినోత్సవాలను, వేడుకలను నిర్వహించుకోవడంవలన విద్యార్థులలో భాష మూలతత్వాన్ని అర్థంచేసుకునే జ్ఞానం వృద్ధిచెందుతుంది. ఈ కార్యక్రమాల వలన ఇతర ప్రాంత, భాష విద్యార్థులకు తెలుగు భాషపై అమితాసక్తి ఏర్పడుతుంది.

**15. రానున్న పదేళ్లలో అంతర్జాతీయస్థాయి పాఠశాలల్లో తెలుగు భాష ఉపాధ్యాయుల అవసరం ఎలా ఉండబోతుంది?**

అంతర్జాతీయస్థాయి పాఠశాలల్లో తెలుగు భాష ఉపాధ్యాయుల అవసరమనేది వచ్చే పదేళ్లలో గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఎందుకంటే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ఇప్పటికే తెలుగుని తప్పనిసరి భాషగా ప్రతి పాఠశాలలో ప్రవేశపెట్టాలనే ఆదేశాలను జారీ చేసింది. దాన్ని అనుసరించి ఇంతకుముందు తెలుగును ఒక ప్రధానమైన భాషగా అమలుచేయని పాఠశాలలు కూడా ప్రభుత్వం ఇచ్చిన జీవో వలన అమలుచేశాయి. దీనివలన ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా విద్యార్థులందరూ తెలుగు భాషను ప్రధాన భాషగా చదివే పరిస్థితి ఉన్నందువలన విద్యార్థి నిష్పత్తికి అనుగుణంగా ఉపాధ్యాయుల నియామకాలనేవి కచ్చితంగా జరగాల్సిన అవసరం ఉంది. గతంతో పోలిస్తే, నేడు తెలుగు ఉపాధ్యాయుడికి కొద్దిపాటిగా ఉద్యోగావకాశాలు పెరిగాయి. అదేవిధంగా తెలుగు సబ్జెక్టుకి ప్రాధాన్యత అనేది సంతరించుకుంది. వచ్చే పదేళ్లలో ప్రతి పాఠశాలలో వందశాతం తెలుగు ప్రధాన భాషగా బోధించబడబోతున్నందున తెలుగు ఉపాధ్యాయుల ఆవశ్యకత ఎక్కువగా ఉంది. కానీ తెలుగు బోధలతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఆంగ్లభాష పరిజ్ఞానాన్ని కలిగినటువంటి తెలుగు ఉపాధ్యాయులకు అంతర్జాతీయ పాఠశాలల్లో బోధించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అంతేకాకుండా సమగ్ర విద్యాప్రమాణాలని, బోధన విశిష్టతను కలిగి బహుభాషాకోవిదుడుగా, సాంకేతిక నైపుణ్యాన్ని కలిగి ఉన్న తెలుగు ఉపాధ్యాయులకు రానున్న పది సంవత్సరాలలో మంచి అవకాశాలు ఉండబోతున్నాయి

**16. పైన పేర్కొన్నటువంటి నైపుణ్యాలను విద్యార్థులలో పెంపొందించడానికి డిగ్రీ, పీజీ స్థాయిలో ఎలాంటి విద్యావిధానాన్ని ప్రవేశపెట్టాలి?**

నేటికాలంలో పైన పేర్కొన్నటువంటి అన్ని సామర్థ్యాలు, నైపుణ్యాలు కచ్చితంగా తెలుగు ఉపాధ్యాయులు కలిగి ఉండాలి. అయితే ఆ నైపుణలన్నింటినీ తను ఉపాధ్యాయుడిగా మారిన తర్వాత నేర్చుకునేకంటే విద్యార్థిగా ఉన్న దశలో నేర్చుకున్నట్లయితే పూర్తి సమర్థమైన భాషాపరిజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం ఇతర భాషల పరిజ్ఞానం అలవడుతుంది. దానికోసం డిగ్రీస్థాయిలో విద్యార్థులకు సిలబస్ లో అనువాద ప్రక్రియ అనేటువంటి సబ్జెక్టును చేర్పినట్లైతే ఒక భాష నుంచి మరొక భాషకు ఏ విధంగా మార్చడం అనే విషయంపైన మంచి జ్ఞానాన్ని పొందగలుగుతారు. జాతీయ, అంతర్జాతీయ భాషలు అయిన హిందీ, ఆంగ్ల భాషలపైన ఇంటర్నల్ పరీక్షా ప్రాజెక్టు విధానాలను ప్రవేశపెట్టడంవల్ల విద్యార్థులకు భవిష్యత్తు భోధన జీవితంలో ఎలాంటి అవరోధాలు ఉండవు. వీటితోపాటు నేటి బోధన వృత్తిలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న కంప్యూటర్ విద్యను డిగ్రీ మొదటి సంవత్సరంనుంచి తప్పనిసరి సబ్జెక్టుగా పీజీ లెవెల్ వరకు కొనసాగించడంవల్ల విద్యార్థులకు మంచి కంప్యూటర్ పరిజ్ఞానం ఏర్పడి, వారి భవిష్యత్తు బోధనలో ఎలాంటి సాంకేతిక సమస్యలను ఎదుర్కోకుండా ఉండగలుగుతారు. ముఖ్యంగా పీజీలో ఏం.ఏ తెలుగు విద్యార్థులకు ప్రతి సెమిస్టర్ లోనూ ఆంగ్ల అనువాదం, సాంకేతిక విద్య కంప్యూటర్ విద్య అనే తప్పనిసరి సబ్జెక్టులను చేర్చడంవల్ల వారి భవిష్యత్తు ప్రణాళికకు చాలా ఉపయుక్తంగా ఉంటుంది. ఈ సబ్జెక్టులను సాహిత్యాలతో సమానంగా బోధించినట్లయితే విద్యార్థులకు సాంకేతిక ఆంగ్ల విద్యలో పట్టు ఏర్పడుతుంది. ఎం.ఏ తెలుగు అన్ని సెమిస్టర్లలోనూ 20% ఇంటర్నల్స్ విధానాన్ని ప్రవేశపెట్టి తెలుగు నుంచి ఇంగ్లీషు అనువాదము అనే సబ్జెక్టును, బోధన సాంకేతిక విద్య (కంప్యూటర్ డిజిటలైజేషన్ అనే సబ్జెక్టును) అమలు చేసి విద్యార్థుల చేత ప్రాజెక్టు లాంటివి చేయించాలి. దీనివల్ల విద్యార్థులు ఆంగ్లంలోనూ, సాంకేతికవిద్యలోనూ పట్టు సాధించగలుగుతారు. ఓరియంటల్ లాంగ్వేజెస్, తెలుగు ఉపాధ్యాయ శిక్షణ, బీ.ఈడీ, బి.ఏ ప్రత్యేక తెలుగు, ఎం.ఏ తెలుగు సాహిత్యం లాంటి ఉన్నత విద్యామండలికి చెందిన తరగతులలో డిజిటల్ తరగతుల నిర్వహణ అనేది చేపట్టాలి. ప్రభుత్వం తెలుగు కోర్సులలో ప్రాజెక్టుల ప్రాధాన్యత పెంచాలి. పరిశోధక అంశాలతోపాటు సాంకేతిక అంశాలపైన దృష్టి సారించాలి. తెలుగు కోర్సులలోనూ ఒక ప్రధానమైన సబ్జెక్టుగా ఆంగ్లాన్ని, కంప్యూటర్ విద్యను ప్రవేశపెట్టాలి. తద్వారా అంతర్జాతీయ పాఠశాలల్లో బోధించే తెలుగు ఉపాధ్యాయులు ఆంగ్ల, సాంకేతికపరమైన సమస్యలను అధిగమించించి సమర్థమైన బోధన చేయగలుగుతారు.

★ ఇంటర్వ్యూవర్: అసిస్టెంట్ ప్రొఫెసర్, నిజాం కళాశాల T

# జిగిరి నవల మానవ సంవేదనలు

డా. గంధం వేణు

**0. ఉపోద్ఘాతం**

లోతైన మానవ జీవితాన్ని, అంతే లోతుగా చిత్రికపట్టగలిగిన సాహిత్య ప్రక్రియ నవల. వైశాల్యం దృష్ట్యా చాలా విస్తృతమైనది గనుక మనిషి జీవితంలోని అనేకానేక పార్శ్వాలను, సూక్ష్మాతిసూక్ష్మమైన భావోద్రేకాలను, సంవేదనలను స్ఫటికసదృష్యంగా వర్ణించగలిగే అవకాశం నవలలో ఉంటుంది. కాల్పనిక సాహిత్య విభాగానికి చెందినదైనప్పటికీ, వాస్తవిక సమాజాన్ని అత్యంత వాస్తవికంగా వ్యక్తం చేస్తుంది. మానవ శ్రమ నిత్యం సరళత్వం వైపు ప్రయాణిస్తుంది గనుక, ఆధునిక కాలంలో అనేకానేక సరళమైన, ప్రజాజీవితానికి దగ్గరగా ఉండే సాహిత్య ప్రక్రియలు రూపుదిద్దుకున్నాయి. ఆ క్రమంలోనే నవలా సాహిత్యం కూడా వికసించింది. మానవ జీవితాన్ని వాస్తవికంగా దర్శించి, అందులోని లోతుల్ని తాత్వికంగా ఆలోచించి, పాఠకలోకపు చైతన్యాన్ని మెరుగుపర్చడం కోసమే నవలా ప్రయాణం విస్తృతమయ్యింది.

జాతీయోద్యమకాలం నుండి తెలుగునవలా ప్రాభవం దశదిశలా వ్యాపించడం కనిపిస్తుంది. అనేకానేక తెలుగు నవలలు తెలుగేతర భాషల్లోకి అనువదించబడి, జాతీయ, అంతర్జాతీయ ప్రఖ్యాతిని పొందగలిగాయి. అటువంటి అత్యుత్తమ తెలుగు నవలా సాహిత్యంలో పేరెన్నికగన్నది పెద్దింటి అశోక్ కుమార్ గారు 2006లో రాసిన 'జిగిరి' నవల. ఈ నవల తొట్టతొలిగా 'అమెరికన్ తెలుగు అసోసియేషన్' వారు నిర్వహించే 'కబురు' పత్రికలో ప్రచురితమైంది. ఆ తర్వాత హిందీ, ఇంగ్లీష్, పంజాబీ, మరాఠీ, ఒరియా, కన్నడ, బెంగాలీ భాషల్లోకి అనువాదమైంది. ఎలుగుబంటిని ఆడించుకుంటూ, తద్వారా వచ్చే ఆదాయమే జీవనాధారంగా బతికే ఒక దూదేకుల కుటుబంలో అనుకోని పరిణామాల వలన ఏర్పడిన పరిస్థితుల గురించి, ఆ సందర్భంలో వ్యక్తమైన మానవ సంవేదనల గురించి విశ్లేషించడమే ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశ్యం.

**1. జిగిరి నవలా ఇతివృత్తం**

అనువంశికంగా ఎలుగుబంటిని ఆడిస్తూ, దాని వెంట్రుకలతో తయారు చేసిన తాయత్తులను అమ్ముకుంటూ, తద్వారా వచ్చిన ఆదాయమే జీవనాధారంగా ఎంచుకున్న కుటుంబం ఇమామ్‌ది. అతని భార్య బీబమ్మ, కొడుకు చాంద్. ఈ కుటుంబానికి ఆదరువైన ఎలుగుబంటి పేరు షాదుల్. 20 సంవత్సరాల షాదుల్‌కు ఎంత వయస్సుందో, సరిగ్గా చాంద్ వయస్సూ అంతే. ఇరువురూ చిన్నప్పటి నుండి కలిసిమెలసి పెరిగారు. ఇమామ్, బీబమ్మలకు చాంద్ ఎంతో, షాదుల్ కూడా అంతే. అట్లా షాదుల్ కూడా ఆ కుటుంబంలోని ఒక సభ్యుడే. షాదుల్ ఒక జంతువే అయినా, తనపట్ల ఆ కుటుంబం ఎంత అప్యాయంగా ఉన్నదో, అంతకు మించి తాను కూడా ప్రవర్తించేది. ఆ క్రమంలోనే ఈ మానవీయ బంధుత్వంలో ఒక సమస్య చెలరేగింది. ఎటువంటి ఉపాధి అవకాశాలు లేని నిరుపేదలకు, రెండెకరాల భూమిని ఇస్తామని ప్రభుత్వం ప్రకటిస్తుంది. శాశ్వతంగా సామాజిక గౌరవాన్ని, భవిష్యత్తుకు సంబంధించిన భరోసాను కల్పించే భూమి తమకు లభించాలంటే, ప్రస్తుతం తమకు జీవనాధారమైన షాదుల్, తమ జీవితంలో ఉండకూడదని చాంద్ భావిస్తాడు. దానికి తల్లి ఆమోదం లభిస్తుంది. కానీ రెండు దశాబ్దాలపాటు తమ కుటుంబానికి ఆదరువుగా నిలిచిన షాదుల్‌ను వదులుకోవడానికి ఇమామ్ మనసొప్పదు. ఒకసారి భార్యా, కొడుకుల బలవంతంమీద ఇమామ్ షాదుల్‌ను అడవిలో వదిలివచ్చినా, అది రాత్రికల్లా తిరిగి ఇంటికి వచ్చేస్తుంది. దాంతో బీబమ్మ, చాంద్‌లు కోపోద్రిక్తులవుతారు. ఇమామ్ లోలోపల కృంగిపోతాడు. దాన్ని చంపైనాసరే భూమి సంపాదించాలని తల్లీ కొడుకులు భావిస్తారు. చాలాసార్లు ఆ ప్రయత్నాలు కూడా చేస్తారు. బలవంతంగా ఇమామ్‌తో కూడా ఆ పనిచేయించే ప్రయత్నం చేస్తారు. కన్న కొడుకునైన తననో, సాదుకున్న షాదుల్‌నో ఎవర్నో ఒక్కరినే తేల్చుకొమ్మని చాంద్ తండ్రికి సవాల్ విసురుతాడు. షాదుల్‌ను వదులుకోలేక, చంపలేక, దాంతో ఇరవై సంవత్సరాల అనుబంధాన్ని, అనురాగాన్ని తలపోసుకుంటూ దాన్ని తీసుకుని అడవిలోకి వెళ్తాడు ఇమామ్. వెళ్లినవాడు తిరిగిరాడు. ఇదీ స్థూలంగా జిగిరి నవలా ఇతివృత్తం.

**2. జిగిరి నవల - మానవీయత**

మానవత్వం అంటే మానవజాతి సమస్తానికి సంబంధించిన తత్వాన్ని సూచించే మాట. మనుషులు

తోటివారితో మాత్రమే కాకుండా, మొత్తం ప్రకృతిపట్ల ప్రేమ, దయ, జాలి, కరుణ కలిగి ఉంటూ వ్యవహరించే విధానమే మానవీయత. భూమి మీద కోటానుకోట్ల జంతువులు ఉన్నప్పటికీ వాటికి బుద్ధిపూర్వకమైన విచక్షణా జ్ఞానం అతిస్వల్పంగా మాత్రమే ఉంటుంది. కానీ బుద్ధిజీవి అయిన మనిషి, నాగరికతా పరిణామ క్రమంలో శ్రమైక జీవనంలో క్రమశిక్షణకు అలవాటుపడుతూ వచ్చాడు. అత్యున్నతంగా ఎదిగిన మనిషి మెదడు, దాని అభివ్యక్తి జంతుజాలం నుండి మనిషిని వేరుపర్చాయి.

నిర్దిష్టంగా ఈ నవలకు మానవీయత అనే తత్వాన్ని అన్వయించినప్పుడు చాలా లోతైన విషయాలు తారసపడతాయి. విశాలమైన పరిధి కలిగినది కనుక, సాధారణంగా నవలల్లో పదులకొద్దీ పాత్రలు కనిపిస్తాయి. కానీ ఈ చిన్న నవలలో కేవలం వేళ్లమీద లెక్కించగలిగ అప్రధాన పాత్రలు, నాలుగంటే నాలుగే ప్రధాన పాత్రలు ఉన్నాయి. ఆ నాలుగు పాత్రల్లో మూడు మనుషులకు సంబంధించినవైతే, ఒకటి జంతువుకు సంబంధించినది. ఇమామ్ కుటుంబంలోకి 'భూమి' అంశం ప్రవేశించకముందు ఆ కుటుంబంలో లెక్కలేనంత మానవత్వం కనిపిస్తుంది. అదెట్లా అంటే..

## 2.1. చాంద్ మానవీయత

ఇమామ్, బీబమ్మల కొడుకైన చాంద్ వయస్సు షాదుల్ వయస్సుతో సరిసమానం. ఆ కుటుంబంలో చాంద్‌కు ఎంత ప్రాధాన్యం ఉందో, షాదుల్‌కు కూడా అంతే ప్రాధాన్యం ఉంది. చాంద్ బాల్యంలో ఆడుకోవడానికి షాదులే శరణ్యం. దానితో ఆడుకున్నాడు, పాడుకున్నాడు, సహచర్యాన్ని తనివితీరా అనుభవించాడు. నవలలో ఇమామ్ షాదుల్‌తో ఎలా ఉండేవాడో చెబుతూ, ఆ తర్వాత ఇట్లా వర్ణించడం కనిపిస్తుంది.

"అప్పుడప్పుడూ షాదుల్ వెంట చాంద్ ఉండేవాడు. తప్పితే బీబమ్మ ఉండేది. చాంద్ ఉన్నప్పుడు షాదుల్ అల్లరిగా ఆడుతూ ఉండేది. వెనుక కాళ్ల మీద లేచి నిలబడి కుస్తీ పట్టేది. బీబమ్మ ఉన్నప్పుడు గావురాలు పోతూ ఉండేది. కాళ్ల చుట్టూ పిల్లికూనలా తిరిగేది. వెల్లకిలా పడుకొని నాలుగు కాళ్లను ఆడించేది. ఒక్క ఇమామ్ ఉన్నప్పుడు మాత్రమే భయంగా ఉండేది" (అశోక్ కుమార్, పెద్దింటి. 2011:11). జంతువులు సాధారణంగా పిల్లల్లాగే వ్యవహరిస్తూ ఉంటాయి. ఎందుకంటే అవి చచ్చేదాకా అభంశుభం తెలియని జీవులు. లోకరీతి ఎరుగని పిల్లలూ అంతే. పిల్లలను ఎవరైతే ఎక్కువగా లాలిస్తారో, ముద్దుముద్దుగా చూసుకుంటారో, వారిపట్ల ఆప్యాయతను వ్యక్తం చేస్తారో, ఎన్ని తుంటరి పనులు చేసినా చిరునవ్వుతో ఆహ్వానిస్తారో, వారి దగ్గరనే ఎక్కువగా ఉండడానికి ఇష్టపడతారు. వారితో ఉన్నప్పుడే తుంటరిపనులు కూడా చేస్తుంటారు. తమకు వారి దగ్గరే ఎక్కువ స్వేచ్ఛ దొరుకుతుందని, ఏం చేసినా చెల్లుతుందని బలంగా నమ్మడం కారణంగానే అట్లా ప్రవర్తిస్తారు. షాదుల్, తన దగ్గర చాంద్ ఉన్నప్పుడు అల్లరిగా ఉండేదనీ, వెనుక కాళ్ల మీద లేచి నిలబడి కుస్తీ పట్టేదని చెప్పడంలో, దానికి చాంద్ ఇచ్చిన చనువు, ప్రకటించిన ప్రేమ, చూపించిన ఆప్యాయతలే కారణమని అర్థమవుతుంది.

నవలలో ఇంకొకచోట చాంద్‌కూ, షాదుల్‌కూ ఉన్న అనుబంధాన్ని, చాంద్ ప్రేమతత్వాన్ని వర్ణించడం కనిపిస్తుంది. "చలికాలం రాత్రులైతే గుడిసెలో చల్లగా ఉండేది. ముగ్గురూ మంట పెట్టుకొని కూర్చుండేవారు. షాదుల్‌కు మంటను చూస్తే భయం. ఒదిగి ఒదిగి మూలకు కూర్చుండేది. మంట దగ్గరికి వచ్చేది కాదు. ఆట పట్టించడానికి చాంద్ అప్పుడప్పుడూ మండుతున్న పుల్లను తీసి షాదుల్ వైపు చూపించేవాడు. షాదుల్ మరింతగా నక్కినక్కి కూర్చుండేది. పుల్లను దానివైపు విసురుతున్నట్టు చేతులెత్తేవాడు. షాదుల్ అమాంతంగా ఒక మూల నుండి మరో మూలకు దూకేది. భయంభయంగా ఇమామ్ వైపు చూసేది. ఇమామ్ చాంద్‌ను, మందలించి షాదుల్‌ను దగ్గరికి తీసుకునేవాడు" (అశోక్ కుమార్, పెద్దింటి. 2011:12). ఈ వర్ణణలో కూడా చాంద్, షాదుల్‌ను తనకొక స్నేహితుడిగా భావించడమే కనిపిస్తుంది. చిన్నపిల్లలకు తమ ఈడు పిల్లలంటే ఎనలేని ఇష్టం ఉంటుంది. వారెవ్వరో, ఎక్కడివారో, ఏ కులం-మతం వారో, ఏ భాష వస్తుందో తెలియకున్నా, చిన్నపిల్లలు వేరే చిన్నపిల్లలను చూసినప్పుడు, చూపులను కలిపేసుకుంటారు. ఏమాత్రం సమయం దొరికినా వారితో సులభంగా కలిసిపోయి ఆడుకోవడం మొదలుపెడతారు. ఆఖరికి తల్లిదండ్రులు వారించినా, చిరకాల స్నేహితులను విడిచిపెట్టిపోతున్నంత బాధను వ్యక్తం చేస్తుంటారు. చాంద్ షాదుల్‌పట్ల అటువంటి ప్రేమనే కలిగి ఉన్నాడనడానికి ఇదొక దృష్టాంతం.

షాదుల్ అంటే చాంద్‌కు ఎంత ప్రేమ ఉండేదో తెలియచేయడానికి నవలలో ఇంకొక ఉదాహరణ కనిపిస్తుంది. ''చాంద్ షాదుల్‌తో ఆడుకునేవాడు. వాళ్లిద్దరూ చిన్నపిల్లలైపోయేవారు. చాంద్‌కు షాదుల్ తోబుట్టువులా కనిపించేది" (అశోక్ కుమార్, పెద్దింటి. 2011:13). తాను పుట్టిన కాలంలోనే షాదుల్ కూడా పుట్టిందనీ, ఇరువురిదీ సమవయస్సేనని ఇదివరకే తెలియజేయడం జరిగింది. ఊరికి దూరంగా నివసించే ఇమామ్ కుటుంబం ఒక ఒంటరి. ఆ ఒంటరి కుటుంబంలో చిన్నవయస్సు ఉన్నది చాంద్, షాదుల్

మాత్రమే. అట్లా ఆనంద, హర్షాతిరేకాలను వ్యక్తం చేసుకోవడం కోసం చాంద్‌కు షాదుల్, షాదుల్‌కు చాంద్‌లో మాత్రమే తోడు. అందుకే షాదుల్ చాందుకు తోబుట్టువులా అనిపించాడు. పైగా, ఆరు నెలల పసిగుడ్డుగా తమ గుడిసెలోకి ప్రవేశించిన షాదుల్‌కు తన తల్లి, తనకు పాలిచ్చినట్లుగానే షాదుల్‌కు కూడా పాలుదాపింది. అట్లా తల్లిపాలు పంచుకున్న సోదరభావం ఇరువురిలోనూ కనిపిస్తుంది.

## 2.2. బీబమ్మ మానవీయత

జిగిరి నవలలో ఇమామ్, షాదుల్ పాత్రలు అతిముఖ్యమైనవిగా కనిపించినా బీబమ్మ పాత్రను లోతుగా గమనిస్తే, ఆమెలోని మాతృహృదయం స్పష్టంగా కనిపిస్తుంది. ఆమెకు కన్నకొడుకైన చాంద్‌ను ఎంతగా ప్రేమించిందో, జంతువైన షాదుల్‌నూ అంతే ప్రేమించింది. ఆరు నెలల వయసులోనే అడవి నుండి తీసుకువచ్చిన షాదుల్ శైశవంలో వేరే పాలు తాగలేకపోతుంది. తల్లికి దూరమైన దు:ఖమో, కొత్తపాలు రుచించకపోవడమో ఏమైనా కారణాలు కావచ్చు. కానీ ఆ సమయంలో, అప్పటికే చాంద్‌కు జన్మనిచ్చి బాలింతగా ఉన్న బీబమ్మ తన పాలను షాదుల్‌కు తాపుతుంది. అప్పటిదాకా ఏ పాలనూ ముట్టని షాదుల్ కూడా ఆఖరికి బీబమ్మ పాలనే స్వీకరిస్తుంది. బిడ్డ ఎవ్వరిదైనా సరే, పసికూనలకు పాలుదాపాలనే తాపత్రయం కలిగిన హృదయం మాతృమూర్తుకే సొంతం కదా! బీబమ్మ షాదుల్‌ను కూడా కన్నకొడకులాగే భావించింది.

నవలలో ఒకచోట రచయిత ఇట్లా వర్ణించాడు. "బీబమ్మ మరింత లోతైన మనిషి. అందునా కొడకు చాంద్‌ను, ఎలుగు షాదుల్‌ను వేరుచేసి చూడని మనిషి. షాదుల్ తత్వాన్ని బాగా అర్థం చేసకున్న మనిషి. 'ఇంట్లో దీపమేగాదు.. మనకు బతుకు ఇచ్చింది గదయ్యా. ఏ జన్మలనో మనం దీని కడుపున పుట్టినట్టున్నం. ఆ రుణం తీర్చుకోవడానికి మనం ఎన్ని జన్మలెత్తాలెనో' అంటూ ఏదో జీవితతత్వం చెప్పేది. అది చాంద్‌కు గానీ ఇమామ్‌కు గానీ అర్థమయ్యేది కాదు. కాని కడుపులో దేవినట్టుగా ఉండేది. మనసు బరువెక్కేది" (అశోక్ కుమార్, పెద్దింటి. 2011:13). ఎవరూ పట్టించుకోని తమ నిరుపేద చీకటి గురిశెలో షాదుల్ ఒక దీపమని, అదే తమ జీవితానికి వెలుగులనిచ్చిందని ఆమె భావించింది. తాము తింటున్న ప్రతి అన్నం మెతుకు వెనుక షాదుల్ ఉన్నాడని ఆమె అర్థం చేసుకోలేకపోతే ఇంత లోతైన మాటలు అనేది కాదు. షాదుల్ పట్ల బీబమ్మకు ఉన్న ప్రేమను, ఆప్యాయతను.. అంతకుమించి గౌరవాన్నీ, ఆర్యాధ్యనీయతనూ ఈ మాటలు తెలియజేస్తాయి. బీబమ్మ జీవితతత్వం అర్థం కాకపోయినా, భర్తకూ, కొడుక్కూ కడుపులో దేవినట్టుగా అనిపించడానికి కారణం, ఆమె షాదుల్ పట్ల వ్యక్తం చేసిన ప్రేమతో తాదాత్మ్యం చెందడమే. షాదుల్ పట్ల ఆ కుటుంబంలోని ముగ్గురు మనుషులకూ ఉన్న అనిర్వచనీయమైన, శిఖరాయమానమైన నిర్వికల్ప ప్రేమకు ఇదొక తార్కాణం.

మరొకచోట బీబమ్మ షాదుల్‌పట్ల తల్లిపేగు ప్రేమను వ్యక్తంచేసే వర్ణణ చేశాడు రచయిత. "రోజూ పొద్దున లేవగానే ఇమామ్ మక్కపిండిని తడిపేవాడు. బీబమ్మ ఉడికేసేది. చాంద్ పాలు తెచ్చేవాడు. సల్ల గటుకతో షాదుల్ కడుపు నిండేది. ముగ్గురు కొసరి కొసరి తినిపించేవారు. ఇంట్లో ఉన్నంతసేపు బీబమ్మ ఏదో ఒకటి షాదుల్ ముందు వేసేది" (అశోక్ కుమార్, పెద్దింటి. 2011:14). ఏ తల్లి అయినా తన కన్నబిడ్డలకు ప్రేమతో ఎప్పుడూ ఏదో ఒకటి తినిపించాలని తాపత్రయపడుతుంది. బీబమ్మ, షాదుల్ అనే జంతువు తన కడుపులో పుట్టకపోయినా చాంద్‌తోపాటు ఇంకొక కొడుకులాగానే భావించింది. అందుకే ఇమామ్ ప్రదర్శనలకోసం షాదుల్‌ను గుడిశెలోంచి బయటికి తీసుకెళ్లే సమయాన్ని మినహాయించి, ఎప్పుడు తన దగ్గర ఉన్నా ఏదో ఒకటి తినిపించడానికి ప్రయత్నం చేసేది. దీనిద్వారా బీబమ్మ షాదుల్‌ను కూడా తన కన్నపేగుబంధంలాగానే చూసుకునేదని అర్థం అవుతుంది.

నవలాంతంలో బీబమ్మ మనస్సు ఎంత సంఘర్షణకు లోనయ్యిందో తెలియజేసే వర్ణణ కూడా ఉన్నది. షాదుల్‌కు విషమిచ్చి చంపాలనే ప్రయత్నంలో కొడుకుతోపాటు తానూ భాగస్వామిగా ఉన్నప్పటికీ, ఆమెలో ఇంకా అడుగంటిపోని మానవీయత కనిపిస్తుంది. షాదుల్‌కు విషమిచ్చి గుడిశె ముందరే చంపాలనే కొడుకు కోరికను విన్న ఇమామ్, అలా చేస్తే అది తమ ముందరే తండ్లాడుతూ చనిపోతుందనీ, అడవికి తీసుకెళ్లి విషమిస్తానని చెప్పిన సందర్భంలో బీబమ్మ అంతర్మథనాన్ని ఆవిష్కరించాడు రచయిత. "ఏమనుకున్నదో బీబమ్మ. అదే నిజమన్నట్టు 'చాంద్.. పోనిరా.. ఇక్కడ వద్దు.. అడివికి పోని. అక్కడనే సావని' అన్నది. అలా అంటున్నప్పుడు ఆమె గొంతులో ఏడుపు జీర ఉంది"(అశోక్ కుమార్, పెద్దింటి. 2011:129). ఆమె గొంతులో ఏడుపు జీర తాలూకు వాస్తవం, షాదుల్ మీద చంపుకోలేకపోతున్న ప్రేమ. కన్న కొడుకు భవిష్యత్తు గురించి, కొడుకు కోరిక గురించి ఎంత చంపుకున్నా చావని మానవీయ స్పర్శ, ఆమె గుండెలోతుల్లో ఉన్నదని అర్థం అవుతుంది.

## 2.3. ఇమామ్ మానవీయత

ఏ పరిస్థితులకూ చెక్కుచెదరని మానవీయత కలిగిన పాత్రగా, ఈ నవలలో ఇమామ్ కనిపిస్తాడు. ఇమామ్ కుటుంబంలో 'భూమి' అవసరం ప్రవేశించకముందూ, ఆ తర్వాత కూడా షాదుల్ పట్ల కలిగి ఉన్న ప్రేమను ఏమాత్రం వదులుకోలేనిపాత్ర ఇమామ్‌ది. నవలారంభంలో ఇమామ్, షాదుల్ పట్ల ఎంత ప్రేమను కలిగి ఉన్నాడో తెలియజేసే వర్ణణ ఉన్నది. "ఇమామ్, బీబమ్మ, చాంద్ కూర్చున్నారంటే మాటలు షాదుల్ గురించి ఎక్కువగా నడిచేవి. అది చేసిన అల్లరి గురించి ముగ్గురు ముచ్చటగా చెప్పుకునేవారు. 'అబ్బా.. మన షాదుల్ ముసలిద్దై పోయింది గదా' చాంద్ అనేవాడు. ఆ మాటలకు బీబమ్మ భయంభయంగా 'అవున్రా చాంద్ నన్ను అబ్బాను, షాదుల్‌ను నువ్వొక్కనివే సాదాలె. మాకు కూడా వయసు ఉడిగిపోయింది' అంటుండేది. ఆ మాటలకు చాంద్‌కు కోపం వచ్చేదో లేదో కాని ఇమామ్‌కు మాత్రం ఉక్రోషం ముంచుకచ్చేది. 'చల్.. షాదుల్ ఒకల కష్టంతో బతుకదు. బతికినన్ని రోజులు మనకే తిండి పెడుతడు. చివరికి చచ్చిపోయినంక గూడా..! దాని తోలుకు ఎంత గిరాకీ ఉందో తెలుసా' అనేవాడు" (అశోక్ కుమార్, పెద్దింటి. 2011:12). సాధారణంగా ఆత్మగౌరవం, ఆత్మాభిమానం నిండుగా ఉండే వృద్ధాప్యానికి దగ్గరైన మనుషులు తమ కొడుకులతో, మనుమలతో అనే మాటలను, ఇమామ్ మాటలు గుర్తుకు తెస్తాయి. అంతేకాదు, తమకు చాలాచాలా ఇష్టమైన మనుషుల గురించి ఎవ్వరైనా ఎప్పుడైనా కించిత్తు మాట అన్నా అసహనాన్ని వ్యక్తం చేయడం వారిలో కనిపిస్తుంది. ఇమామ్‌కు షాదుల్ పట్ల ఉన్నది కేవలం ప్రేమ మాత్రమే కాదని, తమ జీవితానికి అదొక నిట్టాడులా నిలబడి నడిపిస్తున్నదని ఆయన మాటలు తెలియజేస్తాయి.

జంతు సంరక్షణ చట్టం రావడం, ఆ తర్వాత జీవనోపాధి లేనివారికి రెండు ఎకరాల భూమిని ఇస్తామని ప్రభుత్వం ప్రకటన చేయడం, దానికి ఆశపడిన భార్యా కొడుకుల ఆలోచనా విధానంలో మార్పు రావడం, ఆఖరికి వారి ఆశ షాదుల్‌ను చంపైనా సరే కోరికను నెరవేర్చుకోవాలనేదాకా వెళ్లడం.. అన్ని సందర్భాల్లోనూ ఇమామ్ తనలోని మానవీయ వ్యక్తిత్వాన్ని చంపుకోలేదు. ఆఖరికి అడవిలోకి షాదుల్‌తోపాటు వెళ్లిన తాను, తిరిగి ఇంటికి రాని విషయంలోనూ, చివరికి ఏమయ్యాడో తెలియపర్చని విషయంలోనూ ఇమామ్‌లో అత్యున్నత మానవీయ విలువలే కనిపిస్తాయి.

## 3. శ్రామిక జీవితంలో 'భూమి'

భూమి అనేది లేకపోతే, దాని మీద జీవించగలిగే వాతావరణమే లేకపోతే అనంతకోటి జీవరాశి లేనేలేదు. నీరు, అడవులు, చరాచరాలు, సమస్త ప్రకృతే మనిషి ఉనికికి మూలం. కాలక్రమంలో అందరికీ చెందాల్సిన ప్రకృతి వనరులను కొందరు హస్తగతం చేసుకొని, మిగతావారిని ఆధీనం చేసుకున్నారు. భూమి కూడా ఒకానొక కీలకమైన ప్రకృతి వనరు. ఆదిలో స్వార్థం లేదు కనుక మనిషిలో ప్రాకృతిక సహజత్వం ఉండేది. మానవ జీవితానికి ప్రధాన ఆదరువు భూమే అని గ్రహించిన కొద్దిమంది, దానికి అధిపతులం తామేనని, మిగతావారిని శ్రమలో ముంచి, ఫలితాలను అనుభవించే సౌకర్యాలకు అతిక్రమించారు. ఫలితంగా యజమానులు, కూలీల వ్యవస్థ ఏర్పాటయింది.

ఆధునికకాలంలో వచ్చిన అనేకానేక మార్పుల కారణంగా, శ్రమ ఒకరిది, సంపద ఒకరిది ఉండడం అమానవీయమనీ, కష్టించేవారికే ఈ ప్రకృతి ఆసాంతం సొంతమనే భావనలు చోటుచేసుకున్నాయి. ఆ క్రమంలోనే 20 శతాబ్దంలో అనేకానేక భూపోరాటాలు నడిచియాయి. వాటి సారాంశమంతా కష్టపడేవారికే ఫలితాలు దక్కాలని. ప్రపంచంలో ప్రజాస్వామ్య వ్యవస్థలు ఏర్పాటు కావడం మొదలైన తర్వాత, అనివార్యంగా ప్రజాకాంక్షలను పట్టించుకోవల్సిన అగత్యం ఏర్పడింది. తత్ఫలితంగా, పాక్షికంగానైనా సరే పేదవారికి భూములు చెందాలనే చట్టాలు కూడా రూపొందాయి. ఈ నవలలో పేర్కొన్న 'జీవనాధారం లేని ప్రజలకు రెండకరాలు పరంపోగు భూములు పంచుతామని ప్రభుత్వం చేసిన ప్రకటన' కూడా ఆ కోవలోనిదే.

నిజానికి ప్రభుత్వం పనిగట్టుకొని ఎవ్వరికైనా భూములు పంచాల్సిన అనివార్యతలోనికి నెట్టబడిందంటే అందులో రెండు విషయాలు స్పష్టంగా అర్థం అవుతాయి. మొదటిది భూమి అనే మౌలిక వనరుపైన కొందరికే అధికారం ఉందనీ, రెండవది కష్టజీవుల చేతుల్లో భూమి లేకపోవడంవల్లనే, ప్రజాపోరాటాలు భూమి సమస్యను ప్రధానమైన ఎజెండా అంశంగా ముందుంచుకొని చేసిన కృషి ఫలితంగానే 'భూపంపిణీ చట్టాలు' ముందుకొచ్చాయని. అంతిమంగా చూసినప్పుడు ప్రభుత్వాలు ఈనాటికీ ప్రకటనలపట్లగానీ, పంపిణీ పట్లగానీ చిత్తశుద్ధిని చూపించలేకపోవడం వల్లనే ఇటువంటి నవలా వస్తువు రూపొందిందని అర్థం అవుతుంది.

## 4. నిరుపేదలు భూమి కావాలనుకోవడం స్వార్థమా? అవసరమా?

ఇమామ్‌ది అత్యంత నిరుపేద కుటుంబం. ఒక క్రూరజంతువును మచ్చిక చేసుకుని, దానితో ఊర్లలో ఆడించి, దాని వెంట్రుకలతో తాయత్తులు తయారు చేసి అమ్మి, వచ్చిన అత్తెసరు డబ్బులతోనే జీవితాన్ని గడిపే కడగొట్టు జీవితం వారిది. నవలలో చెప్పినట్లుగానే షాదుల్ లేకముందు కూడా ఇమామ్ పూర్వీకులు ఆ వృత్తిమీదే ఆధారపడ్డారు. ఆ తర్వాత కూడా అదే కొనసాగింది. భవిష్యత్తులో కూడా అదే కొనసాగుతుంది. కానీ భూ పంపిణీ విషయంలో ప్రభుత్వం చేసిన ఒక ప్రకటన కారణంగా షాదుల్‌ను కన్నకొడుకులా చూసిన బీబమ్మలోనూ, తోబుట్టువులా చూసిన చాంద్‌లోనూ మార్పులు వచ్చాయి. ఈ నవల మీద వచ్చిన సమీక్షలు, విశ్లేషణలు, విమర్శలు అన్నీ ఈ నవల 'మనిషి ఒక స్వార్థజీవి' అని రూఢీ చేసింది అని తేల్చేశాయి. కానీ నిరుపేదలు భూమి కావాలనుకోవడం స్వార్థం కాదనీ, కష్టజీవులకు అదొక ప్రాథమిక హక్కనీ గుర్తించలేకపోయాయి. స్వార్థం అంటే తనకు అవసరమైనదానికన్నా ఎక్కువగా పోగేసుకొని, భవిష్యత్తరాల కోసం దాచిపెట్టుకోవడం. కానీ నిరుపేదల్లో బతుకుదెరువు గురించిన తపన తప్ప స్వార్థపూరితమైన ఆలోచనా విధానం ఉండదు. మరింత నిర్దిష్టంగా చెప్పాలంటే పేద ప్రజలకు మిగులు గురించిన దిగులు ఎప్పుడూ ఉండదు. బీబమ్మ తన కొడుకు భవిష్యత్తు గురించిన ఆలోచనల్లోనైనా, చాంద్ తన జీవితాని సంబంధించిన భరోసా కోసం పడే తపనలోనైనా స్వార్థం కనిపించదు. భూమి అనే వనరు వారికి ఒక కనీసావసరం. తరతరాలుగా ఎలుగుబంటిని ఆడించుకుంటూ బతికిన ఆ కుటుంబానికి ఆకలైతే తీరింది తప్ప ఆత్మగౌరవం దక్కలేదు.

'భూమి' అనేది కేవలం ఒక జీవనాధారం కాదు, ఆత్మగౌరవాన్నిచ్చే మౌలిక వనరు.

## 5. ఇమామ్ కుటుంబ సభ్యుల్లో వచ్చిన మార్పులు

నవలలో అనేక పాత్రలు ఉంటాయి. వాటి వ్యక్తిత్వాలను రూపుకట్టే వర్ణణలూ ఉంటాయి. అంతమాత్రమే కాదు, ఆయా వ్యక్తిత్వాలు సామాజిక పరిణామంలో అనేకానేక ప్రభావాల కారణంగా మారుతూ కూడా ఉంటాయి. ఈ నవలలో, పాత్రల తత్వాన్ని విశదీకరించడంతోపాటు, వాటిల్లో వచ్చిన మార్పులను కూడా చిత్రించడం కనిపిస్తుంది.

### 5.1. చాంద్

ఇమామ్, బీబమ్మల తర్వాతి తరం చాంద్‌ది. తల్లిదండ్రుల తాలూకు ఆలోచనా విధానాన్ని నిర్దేశించే కాలానికీ, చాంద్ ఆలోచనా విధానాన్ని నిర్ణయించే కాలానికీ కాలవ్యవధి ఉంది. ఆ కాలవ్యవధి కనీసం రెండు దశాబ్దాలు. ఏ మార్పైనా అత్యంత వేగంగా జరిగిపోయే ఆధునిక కాలంలో రెండు దశాబ్దాల కాలం చిన్నదేమీ కాదు. ఇమామ్, బీబమ్మల తరం బతుకుదెరువు గురించే ఆలోచించింది. కానీ చాంద్ విషయానికి వచ్చేసరికి ఆదెరువుతోపాటు ఆత్మగౌరవానికి సంబంధించిన ప్రశ్న కూడా ముందుకు వచ్చింది. అందుకే చాంద్ భూమిని కోరుకున్నాడు. సహజమైన మాతృప్రేమను, తన ఆకాంక్షకు మద్ధతుగా మలుచుకున్నాడు. షాదుల్ అనే జీవనాధారం లేకపోతే, రెండు ఎకరాల భూమి వస్తుందనీ, తనకు శాశ్వత జీవనాధారం లభిస్తుందనీ, ఆత్మగౌరవం కూడా వస్తుందనీ, తనకు పిల్లనివ్వడానికి ఎవ్వరైనా ముందుకు వస్తారని ఆశపడడం చాంద్‌లో కనిపిస్తుంది. భూమిని కోరుకోవడం, అప్పటిదాకా ప్రేమించిన షాదుల్‌ను ఎలాగైనా వదిలించుకోవాలనుకోవడంలో షాదుల్ పాత్ర స్వార్థపూరితమైనదిగా కనిపించవచ్చు. కానీ ఏ విషయాన్నైనా రూపం చూసి నిర్ధారించకూడదు. షాదుల్ చిన్నప్పటి నుండి ఊరికి ఆవల ఒక గుడిశెలో ఉన్నాడు. షాదుల్ సహచర్యం తప్ప తనతో ఆడుకున్న చిన్నపిల్లలెవ్వరూ లేరు. ఊరిలోకి వెళ్లినా న్యూనతాభావంతో చూసినవారు, మాట్లాడినవారుతప్ప ఎవ్వరూ అతని కుటుంబాన్ని గౌరవించలేదు, ఆదరించలేదు. తనకు పెళ్లి కావాలన్నా ఎలుగుబంటిని ఆడించుకునేవాడికి పిల్లనెవ్వరు ఇస్తారనే భయం అతనిలో ఉంది. కనుకనే అతడి ఆలోచనల్లో మార్పు సంభవించిందని అర్థం చేసుకోవచ్చు.

### 5.2. బీబమ్మ

షాదుల్‌ను కన్నకొడుకులా భావించి, ప్రేమించి, లాలించిన బీబమ్మ పాత్రలో కూడా మార్పు వచ్చింది. ఆ మార్పు స్వార్థం కారణంగా వచ్చింది కాదు. తాను ప్రాథమికంగా ఒక తల్లి. ఆమెకు ఒక్కగానొక్క కొడుకు చాంద్. తాము జీవించిన కాలంలో అనుభవించిన కష్టాలు, కడగండ్లు, అవమానాలు, పేదరికం మొదలైనవన్నీ తమ పిల్లల జీవితంలో ఉండకూడదని ఏ తల్లిదండ్రులైనా కోరుకోవడం సహజం. కనుక షాదుల్‌ను దూరం చేసుకునే బాధను గుండెల్లోనూ దాచుకుంటూ, కన్నకొడుకు భవిష్యత్తు కోసం ఆమె తపించింది. అంతేగాని కావాలనో, స్వార్థపూరింతంగానో షాదుల్‌ను దూరం చేసుకోవాలని ఆమె కోరుకోలేదు.

## 5.3. ఇమామ్

కన్న కొడుకుకు భూమి దక్కుతుందనీ, తద్వారా అతనికి ఆత్మగౌరవం దక్కుతుందనీ, పెళ్లి కూడా అవుతుందని తెలియనివాడు కాదు ఇమామ్. అయినా షాదుల్‌పట్ల తన అవ్యాజమైన ప్రేమను వదులుకోలేకపోతాడు ఇమామ్.

ఇవాళ్టి తరం పిల్లలు తమ అవసరాల కోసం అనువంశికంగా వచ్చిన భూములను అమ్ముకుందామని చాలా సునాయాసంగా అంటుంటారు. కానీ తల్లిదండ్రుల వారిని వారిస్తుంటారు. అటువంటి సందర్భాల్లో గొడవలు తలెత్తడం చూడవచ్చు. ఈ ఘర్షణను లోతుగా అర్థం చేసుకోవాలి. పెద్ద వాళ్లు ఆ భూమినే నమ్ముకుని జీవించారు. ఎండనకా వాననకా, రాత్రనకా పగలనకా శ్రమించారు. ఆ శ్రమకు తగినంతనో, తగనంతనో భూమే ఫలితాలను ఇచ్చింది తప్ప వారిని ఎవరూ ఆదులోకోలేదు. స్థూలంగా చెప్పాలంటే భూమాతను నమ్ముకునే వారి జీవితం అంతా గడిచింది. కానీ పిల్లల విషయంలో అది జరగలేదు. భూమితో ప్రత్యక్ష సంబంధంలోకి వాళ్లు వెళ్లడం చాలా తక్కువ. కనుక భూమిపట్ల వారికి ప్రేమ ఉండడం అరుదు. ఈ కారణంగానే ఆదరువు అయిన భూమిని అమ్మే విషయం ముందుకు వచ్చినప్పుడు కుటుంబాల్లో ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. సరిగ్గా ఇమామ్ కుటుంబంలోనూ అదే జరిగింది. ఆరె నెలల పసికందుగా తమ కుటుంబంలో ప్రవేశించింది మొదలు జీవితమంతా తమ కోసమే చాకిరీ చేసింది షాదుల్.. తమకు పట్టెడన్నం దొరికిందంటే అది దానిపుణ్యమే.. అనే అవగాహన ఉన్నవాడు ఇమామ్. కానీ చాంద్‌కు దానితో ఉన్న అనుబంధం స్నేహపూర్వకమైనది మాత్రమే. అందుకే ఇమామ్ భార్య, కొడుకుల సహజమైన కోరికను కాదనలేక, అలాగని షాదుల్‌ను వదులుకోలేక, దానితోపాటే అడవిలోకి వెళ్లిపోయి తిరిగిరాలేదు. తిరిగిరాలేకపోవడంలోనే ఇమామ్ – షాదుల్‌ల మధ్య ఉన్న 'జిగిరి' అర్థం అవుతుంది.

## 6. జంతువుల్లో మానవీయత – షాదుల్

కుక్కల్లో కనిపించే విశ్వాసం మనుషుల్లో కనిపించదు అని లోకోక్తి. నిజానికి కుక్కలనేకాదు, మనిషి మచ్చిక చేసుకున్న అడవి జంతువులన్నింటికీ విశ్వాసం ఉంటుంది. తమ యజమానిపట్ల తీవ్రాతితీవ్రమైన ప్రేమను, విధేయతను కలిగివుంటాయి. తమ జీవితం ఆసాంతం యజమానికే సొంతం అన్నట్లు ప్రవర్తిస్తాయి. ఉదాహరణకు ఒక ఎద్దునే తీసుకుంటే.. అది తన జీవితం మొత్తం రైతు కోసమే త్యాగం చేస్తుంది. ఆఖరికి అది మాంసంగా మారే సమయంలో కూడా. ఒక కుక్కనే తీసుకుంటే.. అది పెంపుడు కుక్కైనా, వీధి కుక్కైనా దానికి కాసింత అన్నం పెడితే, అన్నంపెట్టినవారి రక్షణకోసమే ఆలోచిస్తుంది. ఇట్లా మానవ జీవితంలోకి ప్రవేశించిన ఏ జంతువును తీసుకున్నా తన అచంచలమైన ప్రేమను కలిగివుంటుంది, కనబరుస్తూ ఉంటుంది. షాదుల్ ఆరు నెలల వయసులో ఇమామ్ కుటుంబంలోకి వచ్చింది. శైశవంలో బీబమ్మ పాలుతాగింది. పెరిగి పెద్దైన తర్వాత తనకు సంబంధించిన ప్రతి క్షణాన్ని ఆ కుటుంబం కోసమే గడిపింది. ఆ కుటుంబంలోని ఎవ్వరినైనా, ఎవ్వరు ఏమన్నా, బాధ్యతగా నేను మావాళ్లను ఏమన్నా సహించేది లేదన్నట్లు ప్రవర్తించింది. ఈ మొత్తాన్ని గమనిస్తే, మనుషులతో సహజీవనం చేసిన జంతువులన్నీ మానవీయతను సంతరించుకున్నాయి. సంఘజీవిత తాత్పర్యాన్ని అర్థం చేసుకోవాల్సిన బాధ్యతను, అవసరాన్ని అవి గుర్తించాయి. కానీ బుద్ధిజీవులుగా పేరుగాంచిన మనుషులే బుద్ధిహీనమైన చర్యలకు పూనుకోవడం, మానవీయత అనే భావానికి సమాధానం వెతుక్కోవాల్సిన ప్రశ్నలు జంతువులు మనుషులకు వేస్తున్నాయి.

## 7. ముగింపు

మానవీయత కలిగిన మనుషులు స్వార్థానికి తెగబడ్డారనీ, ఏ స్వార్థమూ ఎరగని జంతువులు అసలైన మానవత్వాన్ని కలిగి ఉంటాయనీ తెలియజేసేందుకే ఈ నవల రాసినట్లు విమర్శకులు గుర్తించారు. కానీ ఈ నవల అంతర్గత ఆధారాలు రచయిత లక్ష్యానికి భిన్నంగా ఉన్నట్లు తోస్తుంది. ఏ రచన అయినా వ్యక్తం చేయదల్చుకున్న భావాన్ని సరిగ్గా వ్యక్తం చేయడంలో, అందులో నిక్షిప్తం చేసిన అంశాలు దోహదపడాలి. కానీ ఈ నవల మనుషులందరినీ ఒకేగాటిన కట్టి చూడడం కనిపిస్తుంది. పేదల అవసరాలు వేరు, సంపన్నుల అవసరాలు వేరు. ఆరుగాలం శ్రమించిన భూమిపై తమకే అధికారం లేని ప్రజలు, తమకు భూమి కావాలనుకోవడం వేరు. ఎటువంటి శ్రమలో పాల్గొనకుండా, ఆ శ్రమను దోచుకుంటూ, భూమిపై తమకే అధికారం దక్కాలనుకునే వర్గాలు వేరు. ఇమామ్ కుటుంబం వంశపారంపర్యంగా ఒకే వృత్తిని నమ్ముకుంటూ వచ్చింది. కానీ వారికి తినడానికి అత్తెసరు తిండి దొరకింది తప్ప, ఆత్మగౌరవం దక్కలేదు. తమ జీవితానికి శాశ్వత భరోసానిచ్చే వనరేదీ తమకు లేదు. ఆ కోణంలో ఆలోచించినప్పుడు ఈ నవలా నాయకుడు మారిపోతాడు. కనుక ఈ నవల, రచయిత ఉద్దేశ్యానికి భిన్నంగా ఇంకొక వాస్తవాన్ని బోధించింది. నిరుపేదలకు భూమి దక్కాలనేదే ఆ సత్యం. భూమి మాత్రమే వారికి కూడు, గూడు, గుడ్డతోపాటు సామాజికమైన ఆత్మగౌరవం కూడా ఇస్తుందనేది ఆ సత్యంలోని లోతు.

★ రచయిత:తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, దర్శి

# మద్దూరి సుబ్బారెడ్డి సాహిత్యం-పరిశీలన

మంకముతక శ్రీనివాసులు

ఆధునిక తెలుగు సాహిత్యంలో పేరుపొందిన రచయితలలో ఆచార్య మాద్దూరి సుబ్బారెడ్డి ఒకరు. వీరు 1937 సంవత్సరం జూలై 10వ, తేదీన గుంటూరు జిల్లా సొలస గ్రామంలో జన్మించారు. సుబ్బారెడ్డి ప్రాథమిక విద్యను తన స్వగ్రామంలో, హైస్కూల్ విద్యను పత్తిపాడులో, ఉన్నత విద్యను హిందూ కాలేజిలో బి.ఎ, ఎం.ఎ. ఉస్మానియ విశ్వవిద్యాలయంలో అభ్యసించారు. సుబ్బారెడ్డి తెలుగులో జాతీయోద్యమ కవిత్వం, సాహిత్య వివేచన అనే రెండు ప్రధాన విమర్శ గ్రంథాలు రాశారు. ఇవి కాక దేవయాని, శ్రీనివాసబాలభారతి, నలచరిత్ర వంటి రచనలు చేశారు. వీటిలో ప్రధానంగా జాతీయోద్యమ కవిత్వం, సాహిత్య వివేచన, అనే రెండు విమర్శన గ్రంథాలను, నలచరిత్ర ద్విపద కావ్యాన్ని సమీక్ష చేసి అందులోని పూర్వపరాలను గురించి తెలియజేయడమే ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశం.

**తెలుగులో జాతీయోద్యమ కవిత్వం:**

1982 జనవరిలో తెలుగులో జాతీయోద్యమ కవిత్వం గ్రంథాన్ని ముద్రించారు. ఈ గ్రంథాన్ని కాసు బ్రహ్మానంద రెడ్డి, రాఘవమ్మ గార్లకు అంకితం చేశారు. 'ఉన్నమాట' పేరుతో జి.యన్.రెడ్డి భారతీయ సాహిత్యంలో జాతీయత లేకుండా ఆధునికత లేదన్నాడు. జాతీయోద్యమానికి కవిత్వం, కవిత్వానికి జాతీయోద్యమం, పోషకాలు అన్నాడు. జాతీయోద్యమ చరిత్రను తెలిపే ఆకరాలను ముఖ్యంగా కవిత్వాన్ని ప్రామాణికంగా పరిశోధన పూర్వకంగా ఏ భారతీయ భాషల్లో జరగలేదన్నారు. అలాంటి ప్రయత్నం చేసిన వ్యక్తి సుబ్బారెడ్డి గారన్నారు. తొలి గ్రంథం తెలుగులో రావడం సంతోషమన్నారు. నా దేశం, నా భాష, నా సంస్కృతి అనే దృక్పథం తెలుగులో జాతీయోద్యమ కావిత్వానికి నేపథ్యం.ఈ విషయంపై జరిగిన పరిశోధనలు క్లుప్తంగా వున్నాయి. తెలుగులో జాతీయోద్యమ కవిత్వం గ్రంథం తెలుగులో వ్యవహారిక భాషలో రాసిన తొలి గ్రంథం. పైగా సిద్ధాంత గ్రంథం.

మద్దూరి ప్రవేశిక: "దేశభక్తి నిర్వచనాలకు అందేది కాదు
కాలపు డెక్కల కిందపడి నలిగి నశించేది కాదు
నిత్యానూతనమైంది."

**ఆధునికాంధ్ర కవిత్వంపై జాతియోద్యమ ప్రభావం:**

ఉద్యమాన్ని ఆకలింపు చేసుకొని కవిత్వం విస్తారంగ వచ్చింది. కవుల కవిత్వాన్ని ఆధారం చేసుకొని ఉద్యమకారులు ప్రజల్లోకి చొచ్చుకొని పోయారు.

1. భారత స్వాతంత్రోద్యమ
2. ప్రత్యేక రాష్ట్ర సంస్థాపనోద్యమం
3. తెలంగాణాంధ్ర సమ్మేళనోద్యమం

అప్పటికే సినారె గ్రంథం, ముదిగొండ శివప్రసాద్ ఆధునికాంధ్ర కవిత్వంపై ఉద్యమాల ప్రభావం మొదలి తెలుగు సాహిత్యం - గాంధీజీ ప్రభావం వచ్చాయి. ఇది కేవలం జాతీయోద్యమానికి పరిమితమైంది. 400 మంది దేశభక్తికవుల్ని ఒక చోట చేర్చిన నిజమైన పరిశోధన గ్రంథమిది.

**ఆధ్యాయ విభజన: ప్రకరణాలు**

1. సాహిత్యం - సమాజం ప్రతిపాదనలు
2. ప్రపంచ సాహిత్యాలు - దేశభక్తి కవిత్వం
3. జాతీయత
4. జతీయోద్యమ కవిత్వం -ప్రారంభ దశ
5. కావ్య సాహిత్యం
6. పద్యఖండకావ్యాలు, పద్యఖండికలు
7. గేయఖండకావ్యాలు, ఖండికల సంకలనాలు, గేయ ఖండికలు
8. శతకాలు , దండకాలు
9. కీర్తనలు , పదాలు , భజనలు , హరికథలు
10. ఆంధ్రజాతీయోద్యమం - రాష్ట్రస్థాపన
11. తెలంగాణ ఆంధ్రోద్యమం
12. జాతీయోద్యమం - అభ్యుదయ కవులు దృక్పథాలు - కవిత్వం - విలువలు

**1.సాహిత్యం - సమాజం :**

సాహిత్యం -సమాజం ఆధార ఆధేయ సంబంధం కలిగివున్నాయి. రెండిటిని విడదీసి చూడలేం . పాశ్చాత్యుడైన

షెల్లీ , హడ్సన్ వంటి వాళ్ళు ఇదే అభిప్రాయం చెప్పారు. కవిత్వ నిర్మాణంలో కవిపాత్రను ఎలుగెత్తి చాటాడు. స్వర్గం కూడా ఆదర్శ లోకానికి ప్రతీకే గాని వేరొకటి కాదు అనే సర్వేపల్లి మాటల్ని ఉదహరించాడు.ఒక సంఘం యొక్క తత్వాన్ని కవి నిరూపించినట్లు మరెవ్వరూ నిరూపించలేదు. ప్రేమలేఖల్లో కూడా సమాజం గోచరిస్తుందని కొడవగంటి కుటుంబరావు మాటల్ని ఉదహరిస్తారు. ఆంగ్ల సాహిత్యంలో ఆదికవి ఛాసర్ – కాంటబెరీటోల్స్ ఆ కాలపు జీవితం( ఆచారాలు, విశ్వాసాలు) వుంది. శామ్యూల్ డేనియల్ గొప్ప దేశభక్తుడు.అడిసన్ వ్యాసాల్లో ఆంగ్ల సమాజ ఉచ్ఛనీచస్థితుల్ని అద్దంలో చూపాడు. దేవభాషని కాదని దేశభాషల్లో భాతాన్ని రాయడానికి సంఘమే కారణం అంటాడు. ప్రజలకోసం తాపత్రయం పడ్డే నన్నెచోడుడు ‘ జన ’ తెనుగుకోసం ఆరాటపడ్డాడు. పాల్కురికి దేశ బాట వేసి, దేశాభిమానాన్ని ఫలింపచేశారు. పల్నాటి వీరగాథల్లో సంఘుచరిత్ర రాశాడు శ్రీనాథుడు. పోతన సామాన్య జీవితాన్ని మెచ్చారు. కారు చీకటిలో కాంతిరేఖలా ప్రవేశించిన కవి వేమన – ఆయనకు కావలసింది తన సమాజం. వీరేశలింగం అనే వేగు చుక్క సంఘ సంఘ సంస్కరణకే ప్రాధాన్యం ఇచ్చాడు.

## 2. ప్రపంచ సాహిత్యం – దేశభక్తి కవిత్వం

దేశం కోసం తహ తహ లాడని కవి వుండడు. గ్రీకు సాహిత్యంలో హెూమర్ ( ఇరియడ్ , ఒడిస్సీ) గ్రంథాల్లో గీకు వీరుల గాథలు – జాతీయ భావన గ్రీకు స్వాతంత్ర్యాన్ని (టర్కీ నుండి) బైరన్, షెల్లీ వంటి ఆంగ్ల కవులు మద్దతునిచ్చారు. ఫ్రెంచిని జాగృతం చేసిన మాంటె స్క్యూ, రూసోలను పేర్కొన్నాడు. జర్మన్ కవి ‘విల్ హెల్మ్ ’ గేయాలు దేశభక్తి లోనై ప్రచారం పొందాయంటాడు. మావోసేటంగ్ ( రెడ్ ఆర్మీ ) గొప్పకవి అని ఆయన రాసిన గేయాలు ఉద్రేకం ఆలోచనలు కలిగించేవి. ఐర్లాండు కవులు సాహిత్యకులని , వచ్చిన బాధను ఓర్చుకోవడం నేర్చుకున్నారని, భారతజాతీయోద్యమకవిత్వంతో పోల్చాడు. రెవల్యూషన్ ముందు, తర్వాత వచ్చిన దేశభక్తికవిత్వానికి వ్యత్యాసం వుంటుంది. అమెరికా వలసరాజ్యం స్వతంత్రం కోసం ‘పైనే’ రాసిన కవితతో ప్రజలు ఉత్తేజితులైనారు. రాచరికం ఉన్నా ఇగ్లాండులో జాతీయత కోసం గేయాలున్నాయంటాడు. దేశభక్తి కవిత్వానికి 20 సాధారణ లక్షణాలను నిగ్గుదేల్చారు. ప్రాచిన భారతదేశంలో ఋగ్వేదం – భూమిని, ఇతిహాసాలు అమతరజీవితాన్ని, పురాణాలు భారతదేశ చరిత్ర నిర్మాణాన్ని తెలియ జేస్తున్నాయని చెప్పాడు.

## 3.జాతీయత:

జాతీయతను నిర్వచించడం చాలా కష్టం. అది ఒక మానసికస్థితి మనమంతా ఒక్కటే అనుకునే స్థితి అంటాడు మాద్దూరి. జాతీయోద్యమ భావానికి మూలపురుషుడు ఆధునిక కాలంలో రూసో అని చెప్పాడు. భారతదేశంలో మగమ్మదీయులను ఎదురించడంలో పృథ్వీరాజ్, రాణాప్రతాప్ సింగ్, శివాజి వంటి వారు ప్రయత్నించడం జాతీయ భావన. ప్రథమ స్వాతంత్ర సంగ్రామాలు చాలా జరిగాయంటూ చెబుతూ టిప్పు సుల్తాన్ ఆంగ్లేయులను భారతదేశంనుండి తరిమేయాలని ప్రయత్నం చేసాడు. 1086 వెల్లూరు సిపాయిల తిరుగుబాటు, 1857 సిపాయిల తిరుగుబాటు వంటి వాటిని ప్రస్తావించాడు. ఆంధ్రప్రాంతంలో కూడా జరిగిన జాతియోద్యమ సంఘటనలను ప్రస్తావించాడు. గాజుల లక్ష్మీనరసశెట్టి –స్వదేశి బవర్తకుల సంఘం – మద్రాసు నేటివ్ అసోసియేషన్ మొదలగునవి. జాతీయ జాతీయ కాంగ్రెస్ ఏర్పాటు – మితవాదం – అతివాదం – హెూమ్‌రూల్ గాంధీ ప్రవేశం – దండిసత్యగ్రహం – క్విట్ ఇండియా మొదలగు సంఘటనలు చర్చించాడు.

## 4. జాతీయోద్యమ కవిత్వ ప్రారంభం :

1095 బెంగాల్ విభజన– వందేమాతర ఉద్యమం – 1097–బిపిన్ చంద్రపాల్ రాజమండ్రి పర్యటన– ఏప్రిల్ 1924 మధ్య చిలకమర్తి వారి అనువాదం – భరత ఖండంబు .......ఇదే తేలుగులో తొలి జాతీయ ఉద్యమ కవిత అని నిర్ధారించారు. అయితే 1895లోనే గోదావరి మండల సభలో వారు చదివిన పుష్పమాలిక చింతామణి పత్రికలో అచ్చు కావడాన్ని మద్దూరి వారు ఉదహరించారు.1897 లో చింతామణి పత్రికలో రామశాస్త్రి రాసిన దేశాభిమానం పద్యాని కూడా బ్రిటిష్ వారిని విమర్శించిందని ఉదహరించాడు మాద్దూరి. 1909లో ఆంధ్ర భారతిలో అచ్చయిన ‘మాలవాంఁడ్ర పాట’ కర్తపేరు లేకుండా అస్పృశ్యతకు వ్యతిరేకంగా గొంతెత్తిన గేయమని నిర్ధారించారు.

## 5. కావ్య సాహిత్యం :

స్వాతంత్ర్యోద్యమ ప్రభావంతో వచ్చిన కావ్యాలను నాయకస్తుతి, నాయక స్మృతి, ప్రబోధాత్మకత, అస్పృశ్య నిరసన కావ్యాలుగా వారు విభజించారు. తుమ్మల సీతారామమూర్తి మహాత్ముని ఆశయాలకు పరిమితమౌతు రాసిన మహాత్మకథ, ఆత్మకథ, ధర్మజ్యోతి వంటి కావ్యాలు రాశాడని తెలిపాడు. గాంధీని కేంద్ర బిందువుగా చేసుకొని రాసిన శ్రీగాంధీ భారతం ( శేషాచార్యులు) వంటి వాటిని చర్చించాడు. చెరుకువాడ వెంకట్రామయ్య రాసిన లాలాలజపతిరాయ్, మంత్రి ప్రెగడ

భుజంగరావు రాసిన గోపాలకృష్ణ గోఖలే, నౌరోజి చరిత్ర, చెళ్లపిళ్ల వేంకటేశ్వరకవి రాసిన లోకమాన్య తిలక్ వంటి గ్రంథాలను సమీక్షించాడు. జాషువా రాసిన నేతాజీ, కొండవీటి వేంకటకవి రాసిన నెహ్రూ చరిత్ర వంటి వాటిని కూడా సమీక్షించాడు. తెలుగు ప్రాంతం నుంచి నాయకస్మృతి కావ్యాలు అనేకం వెలువడాయని చెప్పాడు. మొట్ట మొదట దేశనాయక స్మృతి రాయప్రోలు సుబ్బారావు రాశాడని 1915లో గోఖలే' మరణవార్తతో దాన్ని రాశాడని నిర్ధారణ. కర్లపాళెం కృష్ణారావు ఆంధ్రరత్న స్మృతి, జాషూవా బాపూజీ, పుటపర్తి వారి గాంధీజీ మహాప్రస్థానం వంటి అనేక స్మృతి కావ్యాలను అందులోని కవిత్వ మాధుర్యాన్ని మద్దూరి విశ్లేషించాడు. స్వాతంత్ర సంగ్రామంలో ఉద్యమ చోదనను ప్రబోధనను కలిగించిన సంఘటనలతో వచ్చిన ఖండ కావ్యాలను కూడా మద్దూరి పరిశోధనాత్మకంగా వివరించాడు. విశ్వనాథ ఝాన్సీరాణి, పండిత సీతారామశాస్త్రి ప్రబోధ గురించి మాట్లాడుతూ భారతదేశ ప్రశస్తిని తెల్లవారిని తరమాల్సిన ఆవశ్యకతను వివరించే ఉద్బోధ గ్రంథమని చెప్పాడు. స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలను కావ్యాలుగా రాసిన కవిత్వచరిత్ర తెలుగు సాహిత్యంలో ఉందన్నాడు. పిల్లా వెంకటరత్న కవి రాసిన 'ఆగష్టు విప్లవంలో ఆనందరాయలు' ముదిగొండ వీరభద్ర మూర్తి రాసిన భారత స్వాతంత్ర్య సంగ్రామం వంటివి ఉదాహరణలు. స్వాతంత్రోద్యమంలో అస్పృశ్య నిరసన కావ్యాలు రావడం వర్ణ వ్యవస్థను నిరసించడంగా సుబ్బారెడ్డి నిరూపించాడు. మంగిపూడి వెంకట శర్మ నిరుద్ధ భారతం అస్పృశ్య నివారణను ప్రతిపాదించిన తొలి కావ్యంగా నిర్ధారించాడు. గాంధీ ప్రవేశం చేయకముందే అస్పృశ్యత గురించి మాట్లాడకముందే శంఖారావం పూరించిన కవిగా అభినందించాడు. వాల్మీకి, వ్యాసుడు, పరాశరుడు, వశిష్టుడు ఎవరని కవి ప్రశ్నించడం హెచ్చరికగా గుర్తు చేశాడు. జాషువా గబ్బిలం, అనాథ ఇద్దరు మాదిగ, మాల వర్గస్తులని గుర్తుచేశాడు. వెలగల సుబ్బారెడ్డి ఆదిమాంధ్ర కర్ణ వీర నాగేశ్వరరావు అస్పృశ్యుల విజప్తి, జోసపు – కన్నీటి కబురు, కె.సి జాన్ పరిష్కారం వంటి కావ్య లోతుల్ని విశదీకరించాడు.

### 6. పద్య ఖండ కావ్యాలు :

ఖండ కావ్యాల్లో పద్య సంకలనాలు, గేయ సంపుటాలు రెండూ ఉన్నాయని భావించిన వారు మద్దూరి వారు. రెండు ఆధ్యాయాల్లో వీటిని విశ్లేషించాడు. చెన్నా ప్రెగడ భాను మూర్తి రాసిన భారత ధర్మ దర్శనం, మంగిపూడి పురుషోత్తమ శర్మ – కోయిల పాటలు, బలిజేపల్లి శ్రీకాంత శర్మ –స్వరాజ్య రథం ఉ మర్ ఆలీషా – ఖండకావ్యాలు, దువ్వూరి రామిరెడ్డి రాసిన వివిధ ఖండికలు ఈ అధ్యాయంలో చర్చించాడు. అజ్ఞాతంగా ఉండిపోయిన బద్దెరెడ్డి కోటేశ్వరరావు (వందేమాతరం) బండారు ఆంజనేయులు (స్వరాజ్యం), చదలవాడ కోటినరసింహ (రాష్ట్ర గీతాలు) మొదలైన వారిని వెలుగు లోకి తెచ్చాడు. అలాగే పద్య ఖండికలు రాసిన ఎందరో అజ్ఞాతకవులను ఈ సిద్ధాంత గ్రంథంలో వెలుగు లోకి తెచ్చాడు. చింతలపల్లి రామకృష్ణశాస్త్రి, సోమంచి సూర్యనారాయణ శర్మ, గుళ్లపల్లి నారాయణమూర్తి వంటి వారిని గుర్తు చేశాడు.

### 7. గేయ ఖండకావ్యాలు :

ప్రచారానికి గేయ ఖండ కావ్యం అధికంగా ఉ పకరించిందన్నాడు. పద్య ఖండకావ్యాల కంటే గేయ ఖండకావ్యాలు వేల సంఖ్యలో ఉన్నాయని నిర్ధారించాడు. జాతీయ భావాలు ఆవేశంగా మారాయి. కవి నుండి సామాన్య పౌరుని వరకు ఏదో ఒక పాట పాడుతున్నారని తెలియజేశాడు. గురజాడ ముత్యాల సరాలు , దేశభక్తి గేయం తొలిసారి కొత్తగా విశ్లేషించాడు. మనుషుల్ని రాయి రప్పకన్నా హీనంగా చూసే సమాజాన్ని, ఆరాళ్లకు మహిమ కలదని మొక్కే ఆలోచనను ప్రశ్నించిన మానవతావాది అని చెప్పాడు. రాయప్రోలు ఏ దేశ మేగినా గేయాన్ని తమ్ముడా ! ఖండికలో రాసిన మరో గేయాన్ని విశదీకరించాడు. చెరుకువాడ వెంకట్రామయ్య దామోజీ కొరకు వెంకటనరసింహరావు రాసిన జాతియ గీతాలు గరిమెళ్ల వారి కంటే ముందన్నవని తెలియజేశాడు. కవి కొండల, త్రిపురనేని వంటి ప్రముఖులే గాకుండా, ఏనుగు తమ్మిరాజు, నూకల సుబ్బారావు, కాశీ విశ్వనాథం వంటి గేయకవులను పరిచయం చేశాడు. జాతీయోద్యమం పురుషుల మీదే కాకుండా స్త్రీల మీద కూడా ప్రభావం చూపి గేయాలు రాయించిందని నిర్ధారించాడు. విశాలాక్షి గారి అభ్యుదయ గీతాలు (1943) విస్తృత ప్రచారం పొందాయని నిర్ధారించాడు.

### 8. శతకాలు – దండకాలు :

స్వాతంత్ర్యోద్యమ కాలంలో వెలువడ్డ మొదటి శతకంగా దువ్వూరి వారి మాతృశతకం (1916–1918) గా నిర్ధారించి మాతరో అనే మకుటంతో సాగిందని నిర్ధారించాడు. ఎంతో గొప్ప చరిత్ర, నాగరికత కలిగిన భరతదేశాన్ని తిరిగి భారతదేశంలో చేర్చుమంటాడు గాంధీ రంగ ప్రవేశం చేశాక 1921 లో రెండు డజన్ల శతకాలొచ్చాయని నిర్ధారించాడు. శతక పక్రియలో భాగమైన తారావళిలో జాతీయోద్యమం వస్తువుగా, ఒకటి రెండు మాత్రమే వచ్చాయని తెలియజేశాడు. దొమావారు, మంగినపూడి వారు రాసిన గామధీ శతకాలతో పాటూ 1933 లో కుసుమ

ధర్మన్న రాసిన హరిజన శతకం తప్పక పరిశీలించాలని కోరాడు. జాతీయోద్యమ ప్రేరణ వచ్చిన దండకాల్లో మొదటిది ఉమర్ ఆలీషా రాసిన దేశమాత (1921) దండకం మొదటిదని నిర్ధారించారు. మహాత్మగాంధీ సిద్ధాంతాలను దండకాలుగా రాసిన వారు, భరతమాత దండకాలు రాసిన వారు, మహాత్మగాంధీ దండకాలు రాసిన వారు కూడా ఉన్నారని తెలిపాడు.

## 9. కీర్తనలు-పదాలు-భజనపాటలు-హరికథలు:

జాతీయోద్యమ కాలంలో ప్రతి కవి ఏదో ఒక పాటో కీర్తనో రాశాడని చెప్పాడు. 1908 లో 'దేశీయకీర్తనల' పేరుతో వచ్చిన పుస్తక కర్త పేరు తెలియదని ఇందులో '20' కీర్తనలున్నాయని చెప్పాడు. స్వరాజ్య నిధికి చందాలు వసూలు చేయాలనే గాంధీ పిలుపుతో కొన్ని పాటలు రూపుకట్టుకున్న తీరును వెలుగు లోకి తెచ్చాడు. చిల్లరిగె శ్రీనివాసరావు రాసిన విషవృక్షం పంజాబు దురంతములు అనే పదం బొబ్బిలి పదంలాగా ఉందని నిరూపించాడు. కొండపల్లి జగన్నాథదాసు రాసిన స్వరాజ్య బొబ్బిలి పదం గుర్తుంచుకోవాలన్నాడు. సుద్దులు అనే దేశీయ రచన ప్రక్రియలో ఒక అజ్ఞాత కవి రాసిన రచనను చూపించాడు. యాడనున్నాడో శ్రీ గాంధీదేవుడేడనున్నాడో. అనే వెంకట్రామా నాయుడు రాసిన భజన కీర్తన దేశమంతా మారుమోగిందని కోలాట పాటల్లో 'రావె రావె నల్లతుమ్మెద' వంటి పాటలు జాతీయోద్యమ ప్రబోధకాలని. రంగస్వామి రాసిన 'మాలసుద్ది' (1940) కీర్తనల పుస్తకం అస్పృశ్యత నివారణ అమితంగా కనబడుతుందని తెలిజేశాడు. ఎన్నో హరికథలు, బుర్రకథలు తెలుగు నేలపై రాగయుక్తంగా సాగాయని ఉదహరించాడు. ముద్దా రామదాసు గాంధీ విజయం - తిలక్ విజయం వంటి వాటిని ఉదహరించాడు. స్వతంత్ర కాలంలోని బుర్రకథ ఉగ్రూతలూగించిందని చెప్తూ అచ్చిరాజు శర్మ 'స్వతంత్ర పోరాటం ' ప్రయాగ నరసింహశాస్త్రి, సుభాష్ చంద్రబోస్వ, సుంకరసత్యనారాయణ, నాజర్ మొదలగువారు.

## 10. ఆంధ్ర జాతీయోద్యమం :

జాతీయోద్యమంలో భాగంగా ఉప జాతీయోద్యమభావం ఆంధ్రుల్లో ఆరంభమైంది అనడంలో దాని సమర్ధన కనిపిస్తుంది. ఆంధ్రుల్లో దేశం మీద ఆభిమానంతో పాటూ, భాషపైన అభిమానం ఆంధ్రోద్యమానికి దారితీసిందని చెప్పాడు. 1903 లోనే గుంటూరులో ప్రారంభమైన యువజన సాహితీ సమితి ఆదిశగా అడుగులు వేసిందని చెప్పాడు. ఒక్కొక్కసారి నాది అనే అహంకారమ కూడా అవసరమేనంటాడు మద్దూరి. నీవు ఎంతో గొప్పవాడవు అని గుర్తుచేస్తే గానీ వ్యక్తి కార్యశూరుడు కానట్లే ప్రబోధం లేనిదే జాతి కూడా చైతన్యం కాలేదు అంటాడు విమర్శకుడు. తెలుగు నాట ప్రారంభమైన ఆంధ్రోద్యమం తెలుగు వారందరినీ ఏకం చేసే దిశగా కవిత్వం ప్రారమభించింది. ఆంధ్రాభిమాన కవిత్వాన్ని జాగృతి కవిత్వం, ఉత్థాన కవిత్వం, సాధన కవిత్వంగా విభజించాడు మద్దూరి. ఆంధ్రమాతను ప్రార్థించిన మొదటికవిగా మంగిపూడి వేంకటశర్మను నిర్ధారించాడు. ఆంధ్రమాత కవిత్వంలో నదులను, భూములను, పాలకులను కీర్తించాడని వివరించాడు. 1911 లో మంగిపూడి వారి ఆంధ్రదేశ ప్రశంస, గడ్డం కొండారెడ్డి -ఆంధ్రమాతృస్తవం, గాదె జగన్నాథస్వామి - ఆంధ్రదేశ ప్రశంస, బుడనగుంట శివరామయ్య - ఆంధ్రమాత విలాపం వంటి ఖండికల్లోని ఆంధ్రాభిమానం వివరించాడు. ఆంధ్రజాతి కళలు ఎంత శ్వర్యమైందో చెప్పిన రాయప్రోలు వారి - ఆంధ్రావళి, ఆంధ్రజాతి కళలు ఎంత ప్రశస్తమైనవో చెప్పిన తుమ్మల కవితల్ని ఉదహరించాడు. మధునా పంతుల వారి అంధ్ర ప్రశస్తి, జంధ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రి గారి ఆంధ్ర ప్రశస్తం, అమ్మిశెట్టి లక్ష్మయ్య చంద్రగిరి దుర్గం గ్రంధాలు ఆంధ్ర పౌరుషాన్ని మళ్లీ చదివేలా చేశాయన్నాడు. ఆంధ్ర దేశంలో వివిధ క్షేత్రాల గొప్పతనాన్ని కావ్యాలుగా రాయడం ఆంధ్రోద్యమ ప్రభావేమనని విశదీకరించాడు. కొడాలి సుబ్బారావు - హంపీక్షేత్రం, పుట్టపర్తి వారి పెనుగొండ లక్ష్మి హనుమాచ్ఛాస్త్రిగారి దాక్షారామం వంటి కవితల్ని ఉదహరించాడు. అయితే ఏ అభిమానమైన అంచులు దాట కూడ దంటాడు సుబ్బారెడ్డి. రాయప్రోలు వంటివారే ఈ హద్దులు దాటి మాట్లాడటాన్ని గుర్తు చేశాడు.

"తనగీతి అరవజాతిని గాయకులనుగా దిద్ది వర్ధిల్లిన తెలుగువాణి" - రాయప్రోలు

"లేదురా మనవంటివారు లింకెందు" - రాయప్రోలు

"అరవపాటకు తంబురకు ప్రాణము వోసి కుల్కి" - జాషువా

"తనమాట, తనపాట, తన తపస్సు ఇరగమ్మకు ఎరువుగా ఇచ్చెను - శివరామం

పై కవితా వాక్యాల్లో పరనింద కనిపిస్తుందని విమర్శకుడిగా వాస్తవాన్ని చెప్పాడు.

## 11. తెలంగాణ ఆంధ్రోద్యమం :

భారతదేశానికి స్వతంత్ర్యం రాకముందు నుండే తెలుగువారినంతా కూడాగట్టడం కోసం పడిన శ్రమను సుబ్బారెడ్డి రికార్డు చేశాడు. నిజాం జారీ చేసిన ఫర్మానా విద్యావ్యాప్తికి ఆటంకంగా నిలవడం, 1937 లో తెలంగాణలో

మలుపు తిరిగిన ఆంధ్రోద్యమం వంటి విషయాలు చర్చించాడు. 1943 లో కాళోజి నిజాం నిరంకుశానికి వ్యతిరేకంగా "అన్యభాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు సకిలించు ఆంధ్రుడా చావవెందుకురా " అనడాన్ని ప్రస్తావించాడు.

**12. జాతీయోద్యమ అభ్యుదయ కవిత్వం :**

జాతీయోద్యమ సందర్భంలో కవుల దృక్పథాలను అంచనా వేసిన అధ్యాయమిది. ఆంధ్రదేశంలో బ్రహ్మసమాజం ద్వారా మానవతావాదం కవిత్వంలోని ప్రవేశించిందంటాడు. జాతియోద్యమ కవిత్వంలో భాగంగా సౌందరనందం, ధర్మజ్యోతి, కరుణశ్రీ వంటికావ్యాలు దానికి ఉదాహరణలుగా చెప్పాడు. అంతరాలను తొలగించి సర్వమానవ సమానత్వ భావన ఈ కవిత్వ ఉద్దేశంగా మద్దూరివారు చెప్పారు. స్వేచ్ఛా ప్రియత్వం జాతికి వ్యక్తికి కావాలంటూ కవిత్వం వచ్చింది. రాజులకు ప్రభుత్వాలకు భయపడి జీవించే కవికి ఈ ఉద్యమం తలుపులు తెరిచిందంటాడు మద్దూరి. గరిమెళ్ళ, దుర్భాక, దాశరథి జైలు కటకటాల లోపల నుండి కూడా కవిత్వాలు రాయడం వెనుక స్వేచ్ఛా ఉద్యమం ప్రీతి అంటాడు మద్దూరి.

**ఉపసంహరణ :**

ప్రాచీన కవుల అవతారికల్లో, కథాభాగాల్లో దేశాభిమానం, భాషాభిమానం బాగా కనిపిస్తుంది. నిశ్చలమైన దేశభక్తి ప్రతి జాతిలోను ఉండే భావన ఉండాల్సిన భావన. దేశభక్తి కవిత్వాల్లో ప్రపంచమంతా సమానలక్షణాలు కనిపిస్తాయి.

**2. సాహిత్య వివేచన :**

1974 ఏప్రియల్లో సుబ్బారెడ్డి గారు ప్రచురించిన విమర్శ వ్యాస సంపుటి ఇది. ఇందులో 12 వ్యాసాలు ఉన్నాయి. దేశభక్తి కవిత్వం, స్వాతంత్రోద్యమ కవిత్వ ప్రారంభం, ఆధునిక క్షేత్ర ప్రశస్తి కావ్యాలు, దేశనాయక స్మృతి కావ్యాలు, అస్పృశ్యతా నిరసన కవిత్వం, అనే 5 వ్యాసాలు వారి పి.హెచ్. డి పరిశోధనా గ్రంధానికి కొనసాగింపుగా కనిపిస్తాయి. తెలుగు సాహిత్యంలో రాజనీతి, ఆశ్రమవాస పర్వ సమాలోచన, క్రీడాభిరామం –ప్రజాజీవితం, స్త్రీల పాటలు – సీతమ్మ అప్పగింతలు వంటివి ప్రాచీన సాహిత్యాన్ని జానపద సాహిత్యాన్ని కొత్తగా విమర్శించినట్లు అనిపిస్తుంది. మాలపల్లి మాండలికపదాలు, సమర కవిత వంటివి విలక్షణ కోణంలో సాగినవి. ఈ గ్రంథానికి ముందు మాటరాసిన తిమ్మావజ్జల వారు సుబ్బారెడ్డిలో ఇతరులకు తెలియని, గుర్తించలేని గడుసు కనిపిస్తుందని, వ్యాసాల సంకలనంలో కూడా అదే కనిపిస్తుంటాడు.

**2.1. ప్రాచీన సాహిత్య విమర్శ :**

ఆధునిక సాహిత్యంలో వ్యావహారికభాషలో పరిశోధన చేసిన ఈ విమర్శకుడు ప్రాచీన కావ్యాల అధ్యయనం, విమర్శకూడా అవసరమని తెలియజేయడానికి ఈ వ్యాసాలు దోహదపడుతాయి.

**1. తెలుగు సాహిత్యం – రాజనీతి :**

విమర్శకుడు తెలుగు సాహిత్యంలో రాజనీతిని రెండు రకాలైన గ్రంథాల ద్వారా పరిశీలించాడు.

1. ప్రత్యేక రాజనీతి గ్రంథాలు
2. భారతాది గ్రంధాల్లో కనిపించే రాజనీతి

తెలుగులో వచ్చిన రాజనీతి గ్రంథాల్లో కామందకం, పంచతంత్రం, నీతిసారం వంటి గ్రంథాల్లో రాజనీతిని వెలికితీసే ప్రయత్నం చేశాడు. అలాగే స్వతంత్ర తెలుగు గ్రంథాల్లో పురుషార్థ సారం (శివదేవయ్య ) ముద్రామత్యం (క్షేమేంద్రుడు) నీతి తారావళి (సింగన) చారుచర్య (అబ్బయామాత్యుడు). గ్రంథాల్లోని రాజనీతికి ఉదాహరణగా కుమారసంభవం, మార్కండేయ పురాణం, ఆముక్తమాల్యద వంటి గ్రంథాలను తీసుకున్నాడు.

"దేశానికి పాలకునికి చాలా సంబంధముండాలి మండలం చెడిపోతే రాజు చెడిపోతాడు" – బద్దెన

"ప్రజలకు పాలకుడే సర్వం, తల్లిదండ్రులు లేనివారికి అతడే ఆధారం" – పంచతంత్రం

''అధికారుల్లో లంచగొండితనం పెరిగినవుడు రాజుచర్యతీసుకోకపోతే దేశం నాశం కాక తప్పదు "

– పురుషార్థ సారం

"రాజు కేవలం ఒక ఉద్యోగిని అభిమానించనూరాదు, అభినందించనూ రాదు. అతని శక్తిని మనను ఉంచుకోవాలి" – నీతిసారం

రాజనీతిశాస్త్రం అధ్యయనం చేసే విద్యార్థులకు పరిశోధకులకు ఇది మంచి దిశా నిర్దేశం చేసే వ్యాసం.

**2. ఆశ్రమవాస పర్వ సమాలోచన :**

ఆశ్రమవాసంలో నిక్షిప్తీకరించబడ్డ ధృతరాష్ట్రుని మనసత్త్వాన్ని విశదీకరించిన వ్యాసమిది.ధృతరాష్ట్రుని లోని లోభగుణమే భారతయుద్ధానికి దారితీసిందని నిర్ధారిస్తాడు. కొడుకు విజయపతాకం ఎదురులేకుండా ఆశపడ్డ అతని కోరిక కర్ణుడి మరణవార్తతో ఆవిరి అయిపోయిందనడం లోతైన

విమర్శ. దుర్యోధనుడి నిర్యాణంతో ధృతరాష్టుడిలో అడవులకు పోవాలనే కాంక్ష కనిపిస్తుంది కానీ అది మానసిక పరివర్తన ఫలితం కాదు. కేవలం మాత్సర్య ఫలితం " అనడంలో లోతైన మనస్తత్వ పరిశీలన అర్థమవుతుంది. ధృతరాష్టుడిలో అహం పూర్తిగా చచ్చి అడవులకు వెళ్ళాలనే ఆలోచనను రాజుకు చెప్పాలి కాబట్టి చెబుతాడని వివరణ ఇచ్చాడు విమర్శకుడు. ధృతరాష్టుడు, గాంధారీ, కుంతీ మొదలైన వారి మరణంతో ఆశ్రమవాస పర్వంతో ముగుస్తుందని కథ శాంతం వైపు పరుగులిడుతుందని ముగిస్తాడు.

### 3. క్రీడాభిరామం – ప్రజాజీవనం :

క్రీడాభిరామాన్ని ఎవరు రాశారనే వాదన జోలికి వెళ్ళాల్సిన అవసరం లేదని అతడు జీవితాన్ని అవగాహన చేసుకున్న వాడనేది మాత్రం నిజమని చెప్పడంలో విమర్శకుని దృష్టి అర్థమవుతుంది. సమకాలీన ప్రజల జీవితాన్ని వివరంగా తెలిపే కావ్యమని నిర్ధారించాడు. రాజులు జీవితాన్ని చెప్పడానికి చాలా రాతలున్నాయి.మధ్యతరగతి ప్రజలను, వారి జీవన విధానాన్ని అద్దం పట్టే రచన క్రీడాభిరామం అంటాడు. కథ ఏమి లేదు. కవి కథమీద మనసు పెట్టలేదు. మనసు పెట్టింది ప్రజల జీవనాన్ని వర్ణించడం మీద అని నిగ్గు తేల్చాడు. కథ ఏకశిలానగరంలో చలికాలం పొద్దున ప్రారంభమై ఆనాటి సాయంకాలానికి పూర్తవుతుంది. అంటే ఒక రోజు జరిగే కార్యక్రమాన్ని మధ్యతరగతి ప్రజలను కేంద్ర బిందువుగా చేసుకొని రాసిన రచన. నగరంలోకి పోయే మార్గాలు, వేర్వేరు వాడల్లో నివసించే ప్రజలు, శకునాలపై ఆకాలం వారికున్న నమ్మకం, పూటకూటి ఇల్లు, నాగరికుల అలాగే పల్లెటూరి వారి భోజనాలు, జూదాలు, మోసాలు, సోమరిపోతులకు జూదంపై అపేక్ష, కోడి మరియు పొట్టేళ్ల పందేల వినోద కార్యక్రమాలు, పల్నాటి వీరుల కథా కోణాలు, మైలారు దేవుని సేవ, మాచల్దేవి ఇంట్లో చిత్రశాల, భవనీల కథలు అన్నింటిని విశదీకరించిన వ్యాసమిది.

### 4. స్త్రీల పాటల్లో సీతమ్మ అప్పగింతలు :

ఇది ఒక జానపద గీతం. సీతమ్మ అప్పగింతలు అనేక పాటలను పరామర్శించిన వ్యాసమిది. ఈ పాటలకాధారం వాల్మీకి భస్కరాదులు కాదు సామాన్య ప్రజలేనంటాడు. కరుణరస ప్రధానంగా సాగిన ఈ పాటలు సాధారణ ఇంటి ఆడ పిల్లలా సీతమ్మ కనిపిస్తుంది.

### 5. జాషువా కవితాశయాలు :

ఈ వ్యాసం దళిత కవిత్వ సృజన, పరిశోధన అవసరాన్ని 1974 లోనే చెప్పింది. జాషువా కవిత్వంలో రెండు పార్శ్వాలను స్పష్టంగా అంచనా వేశాడు.

1. జాతీయ స్పృహ

2. దళితజాతి సముద్ధరణ ఈ రెండు ఆశయాలతో అయన కవిత్వం

ఈ రెండు ఆశయాలతో అయన కవిత్వం సాగిందని స్పష్టంగా అంచనా వేశాడు. "ఈ రెండు దృక్పథాలు జాషువా హృదయ సాగరంలో సంగమించాయి అనడంలో వాస్తవం. జాషువా మాతృపూజ, నేతాజీ, బాపూజీ వంటివి జాతీయవాదానికి గబ్బిలం, అనాథ దళిత దృక్పథానికి నిదర్శనాలని తెలిజేశాడు.

### 6. మాలపల్లిలో మాండలిక పదాలు :

"వాడుక భాషలో గ్రంథాలు రాయడం ఒక విధంగా చాలా కష్టం అని సిద్ధాంతరీకరిస్తాడు మద్దూరి. బహుశా ఉన్నవ, మద్దూరి ఒక ప్రాంతం నుండి వచ్చినవారు కావడం ఆ ప్రాంత మాండలికాలపై సుబ్బారెడ్డి గారికి పట్టుఉండటం వంటి కారణాలు ఈ వ్యాసానికి భోదన కావచ్చు. ఈ వ్యాసాన్ని. భాషాశాస్త్రదృష్టితో రాయలేదని తాను ఆప్రాంతం వాడిని కాబట్టి ఆ పదాలు ఏయే అర్థంలో వాడుతారో చెప్పానని అంటాడు. 116 గుంటూరు మాండలిక పదాలు మాలపల్లిలో ఉన్నట్లు నిర్ధారించాడు. ప్రతి పదానికి వివరణ, ఉదాహరణ వాక్యం కుడా ఇచ్చాడు.

ఉదా : ఇలంబ్రం =విశాలం, అజ్ఞాయింపు = అనుమానించు, పంటి = కుండ,

నకరాలు = వేషాలు, గేడిది = పొడవుపాటి, పర్యాచకం = పరిహాసం

### 7. నలచరిత్రము – పరిష్కరణ విమర్శ :

ఇది ఆచార్య సుబ్బారెడ్డి గారి మరణానంతరం ముద్రితమైన రచన. పరిష్కరణ చేసి పీఠిక రాసి ముద్రితమౌతున్న దశలో వారు మరణించటంతో వారి సతీమణి రామకోటమ్మ దీన్ని ప్రచురించారు. రఘునాథుడు రాసిన 8 ఆశ్వాసాల ద్విపద కావ్య గ్రంథమిది. ఈ గ్రంథానికి తిలకం అనే పేరుతో 38 పుటల పీఠిక రాశారు సుబ్బారెడ్డి. రెండవ శ్రీకృష్ణదేవరాయలుగా ఈ కవిరాజును ప్రకటించాడు. రఘునాథుడు పారిజాతాపహరణం, గజేంద్ర మోక్షం, రుక్మిణి వివాహం

(యక్షగానం), జానకీ కల్యాణం (చాటుకావ్యం), అచ్యుతాభ్యుధయం (ద్విపదకావ్యం), వంటివి అలభ్యరచనలని నలచరిత్ర మరియు వాల్మీకి చరిత్రలు సమగ్రంగా లభిస్తున్నాయని చెప్పాడు. సావిత్రి చరిత్ర, రఘునాథ రామాయణం, రామాయణ సార సంగ్రహం, భారత సార సంగ్రహం, సంగీత సుధ వంటివి అసంపూర్ణంగా లభిస్తున్నాయి. ఈ పీఠికలో ద్విపద ప్రక్రియ విశిష్టతను వివరించారు మాద్దూరివారు. 8 ఆశ్వాసాల్లో, 8 వేల పైచిలుకు ద్విపదల్లో ఉన్న కథా సంగ్రహాన్ని తెలియజేశాడు. కథా సంవిధానంలో చూపిన నైపుణ్యాన్ని ప్రస్తావించాడు. నలచరిత్రలోని కవితావైశిష్ట్యాన్ని విశదీకరించాడు. పరిష్కరణ పద్ధతిని విశదీకరించాడు. 66 తాళపత్రాలతో రాయసకాడు గుండ్రంగా రాశాడని తెలిపాడు. 132 పుటల్లో, 12 పంక్తులతో రాయబడిన ప్రతి తానుచూశానని చెప్పాడు. లేఖకుని పేరు కాలం ఎక్కడా లేవని అన్నాడు. వలపలగిలక, నిండుసున్న తర్వాత హల్లు దిత్వంగా ఉండటం వంటి అంశాలను ప్రస్తావించాడు. రఘునాధుని లేఖిని నుండి వెలువడ్డ మధుర కవిత్వాన్ని ఎక్కడా సరిచేయకుండా అలాగే ఉంచానని చెప్పాడు. నలచరిత్ర కావ్యాన్ని 1926 లోనే ఆంధ్రభాషావిలాసిని పత్రికలో వచ్చినా అది లభించడం లేదని చెప్పాడు. 1984 లో ఆంధ్ర సాహిత్య పరిషత్తు ముద్రిత ప్రతిలో గ్రంధపాతాలు ఎక్కువగా వున్నాయని చెప్పాడు. పూర్వ ముద్రిత ప్రతుల్లో పరిష్కరణ లోపాలను సవరిస్తూ ప్రతి ఆశ్వాసంలోన ఉపశీర్షికలనిస్తూ చక్కగా పరిష్కరింపబడిన గ్రంధమిది. ప్రతి ఆశ్వాసం చివర పాఠాంతరాలను ఇవ్వడం ఒకరకమైన పరిష్కరణ పద్ధతి ఈ పద్ధతిని మద్దూరి వారు అనుసరించారు. ఆధునిక కవిత్వంపై పరిశోధన చేసిన వ్యక్తి ప్రాచీన గ్రంథ పరిష్కరణపై మక్కువ చూపడం ఒక ప్రత్యేకమైన అంశంగా మనం గ్రహించాలి. పీఠికలో కూడా గ్రంథ విమర్శ సాధికారికంగా చేయడం వారిలోని ప్రాచీన సాహిత్య అవగాహనను తెలియజేస్తోంది.

**ముగింపు :**

తెలుగు సాహిత్యంలో తనకంటు ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న విమర్శకులలో మద్దూరి సుబ్బారెడ్డి ఒకరు. తెలుగు సాహిత్యంలో మొట్టమొదట సారిగా వ్యావహారిక భాషలో పరిశోధన గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించిన వ్యక్తి, సాహిత్య వివేచన గ్రంథంలో ఆయన రాసిన ప్రతి వ్యాసం పరిశోధన విమర్శకు నూతన ఒరవడి కనిపిస్తుంది. ప్రాచీన గ్రంథాలను సైతం ఏవిధంగా పరిష్కరించి ముద్రించి విమర్శ చేయవచ్చో తెలుగు సాహిత్యానికి తెలియజేసిన గొప్ప విమర్శకుడు. ఇతను రాసిన రెండు విమర్శనా గ్రంథాలు తెలుగు సాహిత్యంలో ప్రామాణిక గ్రంథాలుగా కీర్తింపు పొందాయి. ఆయన తన గ్రంథాలలో నూతన విమర్శన పద్ధతులను, మరుగునపడిన జాతీయోద్యమ కవులను, వివిధ పద్య ఖండకావ్యాలు, గేయ ఖండకావ్యాలు వంటివి జాతీయోద్యమానికి గొప్ప స్పూర్తి కలిగించయని ఉద్ఘాటించాడు.

**రచయిత: పరిశోధక విద్యార్థి**


**రచయితలకు సూచనలు:**

**1. రచనలను డీటీపీ చేసి పంపేవారు ప్రతినెల 15వ తేదీలోగా ఓపెన్‌ఫైల్‌లో లేదా వర్డ్ ఫైల్‌లో పత్రిక మెయిల్ అడ్రస్‌కు పంపించగలరు.**

**2. స్మార్ట్‌ఫోన్లలో ఫొటోలు తీసి వాట్సప్ ద్వారా రచనలను పంపించవద్దు.**

**3. ఇతర పత్రికలకు పంపే రచనలను మాకు పంపవద్దు.**

**4. అర్థం కాకుండా, కొట్టివేతలతో ఉండే వ్యాసాలను పత్రిక అంగీకరించదు.**

**5. పరిశోధక రచయితలు పంపే రచనలు కచ్చితంగా తమ ఆమోదపత్రం జతచేసి పంపించగలరు. గతంలో ముద్రించిన వ్యాసాల్లోని పేరాలు ఎత్తి రాసి పంపవద్దు.**

# నగునూరు శాసనం గంగాధరమంత్రి స్వీయచరిత్ర

డా॥ కల్యాడపు రమేశ్

రాజులు, రాజ్యాల చరిత్రతోపాటు భాషా సాహిత్యాలను శాసనాల ద్వారా అధ్యయనం చేయవచ్చు. అలాగే శాసనాల్లో కావ్యాలు, పద్యాలెన్నో దొరుకుతున్నాయి. వీటిలోఎక్కువగా రాజులు చేసిన దానాలను గురించి తెలిపేవి అయినప్పటికీ కొన్ని శాసనాలు ప్రత్యేకంగా గుర్తించబడతాయి. వాటిలో నగునూరు గ్రామంలో లభించిన గంగాధర మంత్రిని గురించి తెలిపే కాకతి రుద్రదేవుని కాలంనాటి శాసనం ఒకటి. ప్రస్తుతం ఈ శాసనం కరీంనగర్ కలెక్టరేట్ బంగ్లాలో ఉంది.

రుద్రదేవుని కాలనికి సంబంధించిన చారిత్రక విశేషాలతోపాటు తనను ఆశ్రయించుకొన్న ఉద్యోగుల వివరాలను తెలిపేశాసనాలు కూడా కొన్ని లభించాయి. ఉదా:"దాక్షారామ శాసనములలో ఒకదాని నుండి యినగాల బ్రహ్మిరెడ్డియను నొక మంత్రి తెలియవచ్చుచున్నాడు. తన రాజ్యకాలముననే రుద్రదేవుడు ఓరుగల్లుపురమున రాచనగరునుంగట్టించి ఇందులూరి వంశీయులగు పిన మల్లన, పెదమల్లన యను నిర్వురు సోదరులను మంత్రులుగా నియమించి యచ్చట రాచకార్యములను నెరవేర్చు చుండమని శివయోగసారమున జెప్పబడియున్నది. రెడ్డికులజులగు రేచర్ల వంశీయులీ కాలమునం గడుప్రసిద్ధికెక్కి యుండిరి. వీరిలో నొకఁడగు కామచమూపతి రెండవ ప్రోలరాజునకుం దక్షిన హస్తమై యొప్పియుండెను. అతని తనయులగు బేతిరెడ్డి, కాటరెడ్డి, నామిరెడ్డి యనువారలు రుద్రదేవుని కాలమున వాసికెక్కి యుండినటుల శాసనములనుండి తెలియుచున్నది" (రామారావు, మారెమండ,1935:పేజి.28). వీరితోపాటు పెర్కొనదదిన వారిలో గంగాధర మంత్రి ఒకరు. "నైజాం రాష్ట్రమునందలి కరీంనగరమునందలి యొక శాసనమునుండి కాకతిరుద్రుని వద్ద గంగాధరుండనుకొక బ్రాహ్మణమంత్రిగూడ నుండెనని తెలియుచున్నది. ఈతడు రెండవ ప్రోలరాజు కాలమున రాచనగరులో నొకయుద్యోగిగనుండి రుద్రదేవుని కాలమున మంత్రి పదవిని సముచిత లాంఛనములను బొందెను. ధర్మచిత్తుఁడును మహాభక్తుడునగు నీమంత్రినత్తముఁడు హిడింబాశ్రమము, నగరూరు, అనుమకొండ మున్నగుచోటుల ననేక దేవాలయములనుఁ బుష్పవాటికలను నిర్మించెను. ఈ కాలమున బౌద్ధపూజ సామాన్యముగ జరుగుచుండెను. అందుచే నీమంత్రి బుద్ధదేవునకుఁగూడ నొకయాలయము గట్టించెను." (రామారావు, మారెమండ,1935:పేజి.29). ప్రస్తుత నగునూరులో గంగాధర మంత్రి తానే స్వయంగా వేయించిన శాసనం ద్వారా తన యొక్క స్వీయ చరిత్రను పరిచయం చేయడమే ఈ వ్యాస ఉద్దేశ్యం. కరీంనగర్ జిల్లా శాసనాలు గ్రంథంలోని శాసనం ఆధారంగా ఈ వ్యాస నిర్మాణం చేశాను.

**శాసన పరిచయం:**

శాలివాహన శకం 1092, వికృతి, మాఘ, శుద్ధ, పంచమి, బుధవారము. క్రీ.శ.1171, జనవరి,13 నాడు కాకతి రుద్రదేవ పరిపాలన కాలంలో నగునూరులో గంగాధర మంత్రి వేయించిన శాసనం. ఇది పొడవాటి రాయిపై నాలుగు ప్రక్కల ఈ శాసనం చెక్కబడి ఉంది. ఇందులో తెలుగు, సంస్కృత భాషామిలితమై తెలుగు లిపిలో 172 పంక్తులున్నాయి.

**శాసన సారంశం:**

గంగాధర మంత్రి ఇతను వల్లకీపుర బ్రాహ్మణ కుటుంబానికి చెందినవాడు.కాకతీయ సామ్రాజ్యంలో రెండవ ప్రోలరాజుతన మంచి గుణాలకు ముగ్ధుడై అతన్ని హన్మకొండ పట్టణ సాధారణ పరిపాలనా అధికారిగా నియమించాడని తెలుస్తుంది.రెండవ ప్రోలరాజు తర్వాత పారిపాలించిన చేసిన రుద్రదేవుడు (1158-1195) కాలంలో మంత్రిగా పదవి బాధ్యతలు స్వీకరించినట్లు తెలుపుతుంది. రెండవ ప్రోలరాజు, రుద్రదేవుడి కాలంలో పొలవాసను పాలించిన దొమ్మరాజులను, నగునూరును పాలించిన మేదరాజులను, మంథనిని పాలించిన గుండరాజులను ఓడించి ఆ ప్రాంతాలను తన స్వాధీనంలోకి తెచ్చుకొవడానికి యుద్ధాలలో గంగాధరుడు సహకరించినట్లు తెలుస్తుంది. తర్వాత రుద్రదేవుడు సబ్బినాడుకి రాజధానిగా ఉన్నప్రస్తుత కరీంనగర్ దగ్గరలోని నగునూరుని అభివృద్ధి చేయడం కోసంప్రాంతీయ పరిపాలకుడిగా నియమించినట్లుఈ శాసనంలోతెలిపాడు. అంతేగాక హన్మకొండ, మంథని, కాళేశ్వరం, నగునూరు మొదలైన దేవాలయాలతోపాటు పండ్ల తోటలు, చెరువులు, కోనేరులు నిర్మించినట్లు తెలిపాడు.

అంతేగాక తన పుట్టుపూర్వోత్తరాలతో పాటు తన స్వీయ చరిత్రను ఈ శాసనంలోస్వయంగా చెప్పుకోవడం ఈ శాసన ప్రత్యేకత.

**శాసనపాఠం: మొదటి ప్రక్క**

1. శ్రీరామాధిపు డింద్రనీలనిభ శారీ
2. రుం డుదారుండు గౌరీరామాధి
3. పుం డుజ్వల స్ఫటిక శారీరుండు ధీరుండు
4. భాషా రామాధిపుం డబ్జకేసరల స
5. చ్ఛారీరుండునుం గారుణ్యంబున మా
6. కు నీవుత సదా కాలంబుం గామ్యార్థ్ ము
7. లు (1★) వెలయంగ వేంగి దేశంబులోన నా
8. త్రేయగోత్ర పుంగవులు మహాత్ములు
9. వెల్లెకిపురంబున బలవన్తులు వుట్టి పెరిగి
10. పాలించి చనను॥ (2★) మనుచరితుం డఖిల జ
11. గజ్జన పూజితుండైన యత్రిసంతానము
12. నను జనియించి కొమ్మనాయ్యు్ండు విను
13. తశ్రీ శుభ సమృద్ధి వెలయంగం బ్రభతో
14. న్ ॥(3★) ఆయతయశుం డతనికి నాత్రేయా
15, స్వయ భూషణుం డతిస్థిరమతి నారాయ
16. నుం దుదియించె వచశ్రీయుతుండై సుకవి
17. బన్ధు చిన్తామణియైః ॥(4★) వ్రిత్తు॥ అతులశ్రీయు
18. తుండై సమస్తజనచిత్తానంద సంజాత వి
19. స్తిత నానాగుణియైన యాతనికి నీరేజాత పత్రి
20. ప్రకాశిత లోలేక్షణి యయ్యమాంబికకు
21. లక్ష్మీనాథుండై పుట్టె నున్నతి గోవిందుండు ని
22, మ్మ9ల ప్రథితవిజ్ఞానంబుతో నిమ్మహిని ॥(5★) కంద॥
23. వితతయశుండైన యతనికిం బతివ్రతా
24. గుణవిభాసి భాగ్యవతి మహాసతి యైన
25. తురుకమాంబకు నుతచరితుండ బంధుజనమ
26. నోముదకరుండను॥ (6★) వ్రిత్తు॥ భూధరధైయ్యు9
27. నత్యధిక పుణ్యచరితుం డపారకీర్తి్ లక్ష్మీ
28. ధరమూర్తి్ శిష్టజనమిత్రుండు గోత్ర ప
29. విత్రుం డచ్యుతారాధన తత్పరుండు సు
30. రరాజగురుండు మతిప్రభాతి గంగాధ
31. రుం డిద్ధరిత్రి ననంగా నుదియించి శుభోదయం
32. బునన్ ॥(7★) కంద॥ మాతాపిత్రు వగ్గ్ము సంప్రీ
33. తిం జదివించి మన్చి పెన్చి లసద్విద్యాతిశయ
34. కుశలుం జేసి విభూతిం బరిణయము
35. సేసి పోషింపంగాను ॥(8★) వ్రిత్తు॥ సకలకలావిధి
36. జ్ఞుండనం జాలి సమస్త జనా(లి) సద్గుణ ప్రకర
37. మునెప్పుడును బుధసభం బ్రణుతింప
38. ంగ నున్నయట్టి ననుం బ్రకటితకీర్తి్
39. వ్రోలజనపాలుండు ఘోరతరాజి
40. లోలుం డత్యకుటిల చిత్తుం డీతండని యాదరి
41. కం బిల్పించి పంపంగాన్ ॥ (9★)కంద॥ చనవుమె
42. యి నగరిలోం దగుపనులెల్లనుం బెంపు
43. మెఱసి పరికించుచు నేప్పు్న భక్తి యు
44. క్తి నతిముదమునం జేయుచుం దత్పరోక్ష
45. మున మతియుం బ్రభను ॥ (10★)

వేంగిదేశంలోని వెల్లకీపురంలో ఆత్రేయగోత్ర శ్రేష్ఠుడైన కొమ్మనార్యుడుఅఖిల జగ్జన పూజితుడైన బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. (ప్రస్తుతం ఈ గ్రామం కిష్ణాజిల్లాలో ఉంది). ఈ కొమ్మనార్యునికి నారయణ అనే కొడుకు జన్మించాడు. ఇతడు సుకవిగా,శబ్దచింతామణిగా ప్రశంసలందుకున్నాడు. ఇతనికి సుగుణవతి అయిన అయితమాంబికతో వివాహం జరిగిన తరువాత సాక్షాత్తు మహావిష్ణు రూపుడైన గోవిందుడు జన్మించాడు. గోవిందునకు ప్రతివ్రత శిరోమణి అయిన తురకమాంబకు వివాహం జరిగింది. వీరికి గంగాధరుడు జన్మించాడు.

అతడు దయార్ద్రహృదయుడు, పుణ్యచరితుడు, అపార లక్ష్మీ కీర్తిసంపన్నుడు, శిష్టజన మిత్రుడు, ఆత్రేయ గోత్రంలో ప్రసిద్ధుడు. ఇతని జన్మ బంధుజన వర్గంలో చెప్పుకోదగినదిగా తెలిపాడు. గంగాధరుడికి తల్లిదండ్రులు విద్యాబుద్ధులు చెప్పి పెంచారు. సకలకళావల్లభుడైన గంగాధరునికి గొప్పగా వివాహం చేశారు. విద్యావినయ సంపన్నుడైన ఇతన్ని చూసి బంధుజనులు, మిత్రులు, సమాజము ప్రశంసించారు.

**రెండవ ప్రక్క**

46. శ్రీకాన్తా కాన్తుచే నాశ్రిత విబు
47. ధ జనాభిస్థిర ప్రాజ్యరాజ్యశ్రీ
48. కాన్తా కాన్తుచే విస్తిత నిజ
49. భుజనిస్త్రింశనీతాన్యరాజ శ్రీకా
50. న్తా కాన్తులే దిక్షితి గగవ స
51. మాశ్లిష్ట విస్పష్ట కీర్తి్ శ్రీకాన్తా
52. కాన్తుచే నూజ్జి9తరిపుమ్రి
53. గరాజీ మ్రిగారాతి చేతన్ ॥(11★) వ్రి॥
54. వరనరపాల మౌళిమణి భాసు
65. ర దీప్తిలతా వితాన విస్ఫురిత
56. పదాబ్జుచే నహిత భూతలనా
57. థవరూథినీ సరోవరమథనప్రభూ

58. త మదవద్విరదాధిపుచే విరోధి
50. భూధర శిఖర ప్రభిన్న విదిత త్రి
60. దశేంద్రనిశాత హేతిచేన్ ॥ (12★) ॥క॥
61. సురకరిపరి(తి) ప్రిగపతి హరి
62. సురసతి దమల సరసీరుహ
63. శుక్తిరుహ సదృకే (శుచే) సురు చిర
64. విశద యశోభాసుర నిధిచే
65. సుకవి ధరణీసుర నిధిచేతన్ ॥ (13★)
66. సరనిధిపరీత ధాత్రీ పరిపాలి
67. త దక్షిణ ప్రభాసి భుజవిస్తరు
68. చేత నన్మకుండా పురనాథుండైన రు
69. ద్రభూపతి చేతను ॥ (14★) వ్రిత్త॥ వెల
70. య నమాత్యసంపదయు విశ్రు
71. తమైన నియోగవ్రిత్తు లందలము
72. శితాతపత్రము లతక్య విభూష
78. ణ లేపనాంబరంబులుం దగు వ్రిత్తు
74. లుం బడసి భూసుర వగ్గ ముం బ్రో
75. చి దేవతానిలయము లత్థి౯ంబెక్కొ
76. నర నిల్పుచుం బూజలు ప్రీతిం జ
77. ల్పుచున్॥ (15★) ॥కంద॥ జననాథు కరు
78. ణం **దిండోం దనం**గాంబరగిన మహాగ్ర
79. హారము విద్వజ్జనములకు నిచ్చి య
80. జ్ఞములొనరంగ జేయించి నా
81. మహోన్నతి వెలయను ॥ (16★) వ్రిత్త॥
82. అందుం ద్రికూటనిమ్మి౯తశివా
83. లయమును విలసత్తటాకమును
84. సుందరపుఃపవాటికలుం జుట్టి
85. న లుంగలవంగతాల మాకంద
86. వనంబులును జనసుఖప్రద (మై)
87. వెలయంగం జేసి శ్రీనందనమూ
88. త్తి౯ రుద్రజననాథు దయను మ
89. తి యన్మకొండలోను ॥ (17★) ॥కంద॥

**మూడవ ప్రక్క**

90. శ్రీవిభుంబ్రసన్న కేశవదేవుం బురమధ్యము
91. న నతిస్థిరముగ సద్భావన నా రుద్రే
92. శ్వరదేవు సమీపమున నిల్పితిం గదు
93. భక్తిని ॥(18★) పున్నేశ్వర దేవాలయ సాన్నిధ్య
94. మునందు కదుబ్రసన్నుతముగ
95. నప్పన్నగభూషణునకు నత్యున్నతిగు
96. డి నిల్పితిని మహోత్సవమునను ॥ (19★) పు
97. ష౯నిధి వుష౯రత్నము వుషో౯త్తమమూ
98. త్తి౯ యన్నుబొగడంగ జను లుద్ధష౯మ
99. తి వెలయంగా ద్రైపుష౯లం జేసితిం బ్రతి
100. ష్ఠ పూజాహ౯ముగాను ॥ (20★) ॥గంగాచియచె
101. ఋవున యొద్దం గేశవదేవు గుడియు
102. ధమ్మ౯స్థితి తత్సంగతి విప్రులకునుసంధ్యాం
103. గన గొలువంగ జనాశ్రయము
104. సేసితి నేన్ ॥ (21★) వ్రిత్త॥ అంబుధివేష్టితావని
105. కి నాభరణం బగు నా హిడింబతీర్థ౯ం
106. బునం బాడవోత్తము లుదాత్తమతు
107. లు మును భీమనాథ గేహంబు మొద
108. ల్గంబెక్కు దివిజాలయములు సృజియిం
109. చి రేను భక్తిం బుషో౯త్తమును హరి బ్ర
110. తిష్ఠితుం జేసితి వాని సన్నిధిని ॥ (22★)క॥ పర
111. మేశుండు హరి బుద్ధస్వరూపుండై యసుర
112. వరుల వంచించుట నా హరియనియ పట్టశా
113. లం జిరముగ బుద్ధ ప్రతిష్ఠ సేసితి భక్తిని ॥ (23★)
114. వ్రిత్త? ధర నత్యుత్తమమైన తీత్థ౯ము శి
115. వ స్థానంబు సంవత్త౯కేశ్వర మంచును శశిఖం
116. డశేఖరుని విశ్వస్తుత్యుం బూజించి సుస్థిర
117. మై యుండం దటాకమును గుడియు నత్థి౯ం
118. జేసి చేయించి యీశ్వరు సద్భక్తిం బ్రతిష్ఠసే
119. సితి జగద్వంద్యును భవానీపతిని॥ (24★)కంద॥
120. ఎన్నంగం గోటిభవంబులం దన్నుంబ్రాపించుదు(:)
121. క్రితములెల్లం జెడున్ భిన్నాసంగమ మా
122. డినంబన్నగ భూషణునిం జూడబడసిన
123. మాత్రను ॥ (25★) అనునాదిమునుల వచనము
124. విని కాకతిరుద్రదేవవీరుండు విద్వజ్జన
125. ముల యనుగ్ర .......... ధమ్ము౯వు
126. నిల్ప దలంచిద............(26★) వ్రిత్త॥ ఆ
127. (కా)లేశ్వరదే (వె)........న్త తేజో (మ)
128. యంబై కైలా............ మగు దేవా
129. గారముంనిల్పి ......... ండొప్పం బ్రతిష్ఠ
130. సేసెం బరమేశును (తం – –) బు రుద్రేశ్వ
131. రును శ్రీకంఠును దశకంఠపూజిత
132. నిజ శ్రీపాదపంకరుహును ॥ (27★)కంద॥ం

హన్మకొండను పరిపాలించిన రుద్రదేవుని చేత మంత్రి పదవి చేపట్టిన తరువాత రుద్రదేవుని కోరిక మేరకు హన్మకొండలో తటాకములు, త్రికూటాలయములు, అందమైన వాటికలను నిర్మించి నగరాన్ని సుందరంగా నిర్మాణం చేశాడు. అంతేగాక రుద్రదేవుడి దయతో హన్మకొండలో రుద్రేశ్వరాలయం సమీపంలో ప్రసన్న కేశవ దేవాలయం, పున్నేశ్వర దేవాలయ సమీపంలో ఈశ్వరాలయం మరియు త్రికూటాలయం ఒకటి నిర్మాణం చేశాడు. అలాగే చెరువు దగ్గర ఒక కేశవ దేవాలయం నిర్మించిణట్లు తెలిపాడు.

హిడింబాతీర్థం దగ్గర భీమేశ్వరాలయం మొదలైన దేవాలయాలు నిర్మించినట్లు చెప్పుకున్నాడు. గంగాధరుని కాలంలో బౌద్ధారాధకుల కోసం కరీంనగర్ దగ్గరలోని నగునూరులో బౌద్ధ ఆరామం నిర్మాణం చేశాడు. అంతేగాక కాళేశ్వరంలోని త్రికూటాలయం నిర్మించినట్లు తెలిపాడు.

**నాల్గవ ప్రక్క**

133. ఆ రుద్రేశ్వరదేవాగార సమీ
134. పంబున(ం)దు గమనియ్యను
135. రాగారంబు సేసి నిల్పితి గౌరీవ
136. ల్లభుం ద్రిణేత్రుం గామాంగ
137. హరున్ ॥ (28★) తత్సన్నిధానమున
138. శ్రీవత్సాంకుం బ్రతిష్ఠసేసి
139. వఱలంగ జెఱు వం దుత్సవ
140. ముతోడం బెట్టి జగత్సుందర
141. కీత్తి ర్వెలయంగాం బరగి మహి
142. ని ॥(29★) వరమన్త్రకూటపురము
143. న వరదునకు జగజ్జనాభి
144. వందిత చరణాంబురుహు
145. న కాచంద్రాక్క ర్స్థిరముగ గు
146. డివ్రిత్తి నిల్పితిం త్రిణయు
147. నకును ॥(30★) వ్రిత్తు॥ శంకిత భ
148. క్తియుక్తి ననిష(శ)ంబు నిజాంఘ్రు
149. లు గొల్చు నబ్జభూవంశము
150. ఖాఖల ప్రజనవాంఛి
151. ఈ పుణ్యఫలప్రదును సు
152. రాయ్య ర్ం శజవంశదప్పు ర్ హ
158. రు నచ్యుతు నీ నగరూరనం
154. జతువ్వి ర్ం శతి మూర్తి ర్యు
155. క్తముగ విశ్వమయాత్ముం
156. బ్రతిష్ఠ సేసితిని ॥ (31★) కంద॥
157. తన పెంచిన సన్తానముం దన
158. సన్తానంబుం గ్రితియుం దన న
159. ల్లిల్లును వనమునుం బెఱువును
160. గుడియునుం జనవినుతము
161. లైన సప్తసంతానంబులు॥ (32★)
162. స్వస్తిశ్రీశకవష ర్ములు
163. 1092 విక్రితి సంవత్సర
164. మాఘ శుద్ధ పంచమి బు
165. ధవారమున శ్రీమన్మ
166. హామండలేశ్వర కాకతి
167. య రుద్రదేవరాజులు
168. నగరూరెక్కించి నగరూరు
169. (–) పలుగాను సబ్బినాండెల్లా
170. (ను) సముద్ధ (రింపుమని గం)
171. (గ) రాజున కిచ్చె మంగళ.....
172. (హా) శ్రీ శ్రీ

పైన తెలిపిన విశేషాలే కాకుండా మంథని (మంత్రకూటపురము)లో ఈశ్వరాలయం, నగునూరు (నగరూరు)లో త్రికూటాలయం నిర్మాణం చేశాడు. తర్వాత గంగాధరుడు మంత్రిగా సబ్బినాడును అభివృద్ధి పరచడానికి రుద్రదేవుడు గవర్నర్ గానియమించినట్లు ఈ శాసనంలో తనగురించి తెలుపుకున్నాడు.

ఆధార గ్రంథాలు:

1. Parabrahma Shastri, P.V,. 1974., Inscriptions of Karimnagar District, Department of Archaeology & Museums, Govt. of Telangana, Hyderabad.
2. Parabrahma Shastri, P.V,. 1975., 'The kakatiyas and their times', Thesis Submitted to the Karnatak University, Dharwar.
3. Parabrahma Shastri, P.V.,1978., 'The Kakatiys of Warangal', The Govt. Of Andhrapradesh, Hyderabad.
4. రామారావు, మారెమండ (సం)., 'కాకతీయ సంచిక'. 1935, ఆంధ్రేతిహాస పరిశోధక మండలి, రాజమహేంద్రవరము.
5. సత్యనారాయణ, ఎస్వీ (సం)., 'తెలంగాణ చరిత్ర, సంస్కృతి (వ్యాస సంకలనం)., 2018., పొ.శ్రీ. తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

★ రచయిత: సీనియర్ ఫెలో, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు

# ఇచ్ఛంత్రపు ఇడుపుకాయిదం

రవి కుర్మకోం

దేవమ్మత్తా! ఓ... దేవమ్మత్తా! ఏమాయె సప్పుడు జెయ్యవ్..?

ఎడ్డి దయ్యాలోలే ఎంతసేపని గూసుందం ఈడ.

నేనేం సప్పుడు జెయ్యాల బిడ్డా..! నేనేం సప్పుడు జేసుడులేదు.

కాళ్లు జేతులు ఆడినప్పుడు అన్నీ... కష్టం జేసి సాదుకచ్చినమ్!

కాటికి కాళ్లు జాపుకొని, కాలం ఎల్లదీస్తున్న ముసల్లోల్లం.

మా మాట యాడ జాగుతది, మా మాట యాడ పారుతది.

ఇగా..! నీల్లల్ల ముంచినా మీరే! పాలల్ల ముంచినా మీరే..!

నీ యవ్వా..! 'సల్లకచ్చి ముంత దాసినట్టు' జేస్తరేందే మీరు.

ముదుకాళ్లతో నడిసే ముసల్దాన్నడిగితే ఏం జెప్తది బావా!

కలిసి కాపురమే జెయ్యమనీ, కచ్చీరు గద్దెక్కినోళ్లను అడుగుండ్రీ..!

అగో..! కరువు, కాలం, ఆపతి, సంపతి అన్నీ జూసిందాయే

ఆ ఇంటిదాన్నిగాకపోతే అవుతలింటోల్లను అడుగుతారోయ్ బామ్మర్ది

ఇడిపోయి బత్కుతమనే గదా బావా! ఇంటి గుట్టు ఇక్కడకు దెచ్చిర్రు.

అనుకోంగనే అయిపోతదా..! అరునుకునే లెక్కొకటుంటుది గదా!

పతారేందో దెల్వకుంట పంచాదెట్ల చేస్తమోయ్ బామ్మర్దీ!

కొన, మొదలు దొరికితెనే గదా..! కొట్లాట మతలబు దెలుస్తది.

గొడవేందో జెప్పకుండా గోడకు సరిసిన పిడుకోలుంటే!


పద్దినాలు గూసున్న, పదూర్ల మంది గూసున్న, పంచాదే దెగది.

సెప్పుకుంటే బారతం, సెప్పుకుంటే రామాయణం అయ్యా...!

కాన్పుల తల్లినీ, ఆరున్నెల్లప్పుడు అయ్యను వోగొట్టుకున్నోడు.

తాతా, నాయనమ్మలవే! ఆనికి అయ్యవ్వలవై పెంచినం.

కడుపునవుట్టినోడు కాలంజేస్తే కాపాయం జేసి



సాదుకచ్చినం.

అయినోని సేతి ఆసర దొరకలే! కానోని కాలాసర దొరకలే!

సేనుతోనే సెలిమిజేసిండు, సెట్టు, గుట్టలే ఆని సుట్టమైండ్రు.

పండుగైనా, పబ్బమైనా పచ్చిపులుసే పరమాన్నంగ దిన్నడు.

పనికాడ అందరికీ ముందున్నడు, తినేకాడ అందరి ఎనుకున్నడు.

ఫలానోడని పేరు దెచ్చుకుండు, పనిమంతుడని ఊర్ల దెల్సిండు.

ఎగపోస్తు ఎదురుకోలే! సాటుగవొయ్యి సంబంధం కలుపలే!

ఇంట్లజొచ్చుకొనొచ్చి మా ఊరి అల్లుడని మురిసింద్రు
నోట్ల సెక్కరివోసి మా ఇంటి మనిషని ఎగిరింద్రు...!

కలిగినంతల కల్యానం జేసినం, ఉన్నంతల దావత్‌జేసినం

పెట్టువోతలకాడ ఎసొంటి పెడుసు మాటలు అనుకోలే
ఉండవాను పెట్టెతాడ ఎసొంటి బండ మాటలెత్తేసుకోలే
మనువైన తొలిసూరే మంకు జేసుదు సురుజేసింది.

మునుము మొదలునాడే ఆ పొల్ల ముక్కిరిసినట్టు జేసిందయ్యా

అయిందానికి, కానిదానికి అలిగి పంటే అట్ల ఓర్చుకున్నం

తిండంటే సెండై ఎగిరింది, పనంటే లండై ముదురుకుంది.

బువ్వకింది పొయి బొగ్గులు బువ్వ కూరల్ల దేలవట్టినయ్.
నీడకు వెరిగిన పిల్లని, నిగనిగ దగ్గకుంట జూసుకున్నడు
శానిగవెరిగిన పిల్లని సంబరపడి మురుసుకున్నడు.

ఇంటి పనున్న ఎంటదీసుకపోలే! బయటపని అసలే ఎర్కలే

అవ్వగారిల్లు ఆరుదినాలు, అత్తగారిల్లు మూడుదినాలైంది సంసారం.

రుసిమరిగిన నాలుక, సుఖం దొరికిన పెయి ఊకుంటదా?

అగ్రేకుడు ఆరు పాల్జైంది, ఇరుకునవెట్టుడు ఇరవైపాల్జైంది

కోపాన సెయిలేపితే కొంపలంటుకునే మంటవెట్టింది.

కయ్యంగాని కాపురం లేదు, సావు జూడని ఇల్లు లేదన్నట్టు!

కొత్తగ లగ్గమైన కాపురమాయే కోపతాపాలుంటయనుకున్న

కష్టం జేయనిదానిని ఇష్టపడైనా ఇంట్లుంచుకోవచ్చు.

ఇష్టంలేనిదాని మనుసులా ఇసమెత్తుగూడా సొగ్రలేము

పనిపాట చేయకుంట ఇంట్ల ఏనాడు ఫరాకత్ పండలేదు?

శాతగాదనుకుంట ఏనాడు సాలిచ్చుకొని ఉండలేదు?

సేనుకున్న పెండ్లాం మొగోన్ని సేతువట్టి నడిపినట్టుండాలే

కాళ్లల్ల కట్టెలు వెట్టి మొగోన్ని కాటగలిపెటట్టు ఉండొద్దు.

పల్లెల్లవుట్టి పల్లెల వెరగకా! పట్నంల చదివిందటగదా బామ్మర్దీ!

పదకొండు జదివిన పొల్ల పనిమంతురాలు గాదంటరా?

నదువుకున్న పొల్లనే గదా..! నంసారం సక్కదిద్దుకోదంటరా?

సదువా..! సాకలోల్ల లెక్కకు తక్కువ, కోమటోల్ల లెక్కకు ఎక్కువ

సాలెల జదివింది, సాటుకు సదివింది ఫరకుండదా బావా?

ఉత్త కోడి గుడ్డును తాగొచ్చు, ఉడికిన గుడ్డును తినొచ్చు
ఉడికీ ఉడకని గుడ్డును ఏంజేస్తం! ఉత్త పుణ్యానికి పడేస్తం.

సదివిన సదువు మనిషి పుట్టుకకు సాలు జూపియ్యాలే బావా!

నంసారం ఆగంజేనుకుని నక్కని తొవ్వలు కూడుపుకోవద్దు

మోటోడని, మొరటోడని, ఎద్దు మొద్దుగుంటడని ఎక్కిరిస్తది.

కష్టంజేసుకొని బతికెటోని పెయి కంపుగాకపోతే ఇంపుటదా?

కలిసి బతకాలనే కాయిసే ఉంటే కంపైనా ఇంపుగనిపిస్తది.

ఎద్దులప్పటి బుద్దులు ల్యాగల్లగున్నప్పుడే దెలుస్తదన్నట్టు.
కలిసి నడిసే అడుగులు తడబడినా! ఎడబాయయ్...
ఆలుమెగలుగా కలిసి బతుకాలంటే అదృష్టంగావాలే

ఒక్కసేతి వేళ్లే ఒక్క తీర్గుండయ్, ఇగ మనుషులుంటరా?

పట్టి ఫంగనామాలు వెడితే గోడసాటుకు తూడ్చిందన్నట్టు
దొరకవట్టి సంసార జేపిస్తే ఇరకవట్టి ఇజ్జత్ దీస్తది.
రంజిలేని పానానికి రాళ్లనిదిన్నా అరుగుతయ్ అంటరు
కుదెం ఉన్న పానానికి కుండెడుదిన్నా పెయికివట్టదు
కలిపి కాపురం జెయ్యుమని కష్టపెట్టుడు అద్దయ్యా!
ఇద్దరినీ ఇడగొట్టి ఇదుపుకాయిదం రాయుండయ్యా!
నశీబు మొత్తం నల్లగై మసిలాగా అంటుకున్నా...!
గాశారాన్ని మాపేసుకొని ఉషారుగైనా బతుకుతడు.

★ రచయిత: తెలుగు అధ్యాపకుడు డిగ్రీ & పి.జి. కళాశాల, కామారెడ్డి

# తెలంగాణ మాండలిక నవలలు: భాషా పరిశీలన

డా. మంత్రి మల్లేష్

**పరిశోధన శీర్షిక** (Title of the Research)


తెలంగాణ రచయితలు మాండలికంలో రాసిన నవలల్లోని భాషపై పరిశోధన చేయాలనే ఆలోచనతో 'తెలంగాణ మాండలిక నవలలు: భాషాపరిశీలన' అనే అంశంపై పిహెచ్.డి. పరిశోధన చేశాను. ఆచార్య పమ్మి పవన్ కుమార్ పర్యవేక్షణలో తెలుగుశాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి 2018లో సమర్పించాను.

**పరిశోధన నేపథ్యం**(Backgrund of research)

తెలుగు సాహిత్యంలో వివిధ అస్తిత్వ ఉద్యమాల కారణంగా స్త్రీవాదం, దళితవాదం, మైనారిటీవాదం, ప్రాంతీయవాదం, బి.సి మొదలైన వాదాలలో సాహిత్యం వెలువడింది. ప్రాంతీయ వాదంలో భాగంగానే తెలంగాణ కవులు/రచయితలు తమ ప్రాంత భాషలో సాహిత్య సృజన చేయాలనే తపనతో అందుకు ఉపక్రమిస్తున్నారు. అటవంటి రచనల్లోని భాషపై పరిశోధన చేయాలనే ఆలోచన, తెలంగాణ ఉద్యమ ప్రభావం వల్ల ఈ పరిశోధనకు పూనుకున్నాను. తెలంగాణ ప్రాంత మాండలికాన్ని వెలికి తీయాలని, ప్రధానంగా తెలుగు భాషాపరిపుష్టికై భాషా వైవిధ్యాన్ని విశ్లేషించటానికి ఈ పరిశోధన చేయదలిచాను.

**పూర్వపరిశోధనల సమీక్ష** (Review of literature)

తెలుగు భాషను విశ్లేషించే ప్రధానమైన పూర్వ పరిశోధన గ్రంథాలు: డా. పమ్మి పవన్ కుమార్‌గారి 'కట్టావరదరాజు ద్విపద రామాయణం-భాషా పరిశీలన' అనే పిహెచ్.డి. పరిశోధన గ్రంథం, డా. ఎస్ చంద్రయ్యగారి 'తిమ్మాజీపేట మండల మౌఖిక భాష-వర్ణనాత్మక వ్యాకరణం' పిహెచ్.డి. పరిశోధన గ్రంథం, డా. ఎ.కె. ప్రభాకర్‌గారి 'తెలుగులో మాండలిక కథా సాహిత్యం (తెలంగాణాపై ప్రత్యేక దృష్టితో)', పరిశోధన గ్రంథం. చేకూరి రామారావు గారి 'తెలుగు వాక్యం', ఆచార్య పరిమి రామనరసింహంగారు రాసిన 'తెలుగు వాక్యం' అనే బృహద్వ్యాసం, తెలుగు అకాడమి వారు వివిధ జిల్లాల మౌఖిక భాషకు తయారు చేయించిన వర్ణనాత్మక వ్యాకరణాలు మొదలైనవి.



telaṅgāṇa māṇḍalika navalalu: bhāṣā pariśīlana

(A Thesis submitted to the University of Hyderabad in partial fulfilment of the Degree of Doctor of Philosophy in Telugu)

Researcher
MALLESH MANTHRI
13HTPH01

Supervisor
Dr. PAMMI PAVAN KUMAR

Department of Telugu
School of Humanities
University of Hyderabad
Hyderabad-500 046
TELANGANA, INDIA
JUNE 2018

**పరిశోధన మెథడాలజీ, సిద్ధాంత భూమిక**(methodology and conceptual frame work)

'కట్టావరదరాజు ద్విపద రామాయణం-భాషా పరిశీలన' అనే పిహెచ్.డి. పరిశోధన గ్రంథం, డా. ఎస్ చంద్రయ్యగారి 'తిమ్మాజీపేట మండల మౌఖిక భాష-వర్ణనాత్మక వ్యాకరణం' పిహెచ్.డి. పరిశోధన గ్రంథం, తెలుగు అకాడమి తెలుగు ప్రాంత జిల్లాలకు రాసిన వర్ణనాత్మక వ్యాకరణాలు నా పరిశోధన శాస్త్రీయ నేపథ్యంగా ఉపకరించాయి. తెలంగాణలో మాండలికంలో (మాండలికం లేదా సంభాషణాత్మక మాండలికం) వచ్చిన నవలలు 30కి పైగా ఉన్నాయి. పిహెచ్.డి కాలపరిమితిని దృష్ట్యా, తెలంగాణ రాష్ట్రాన్ని ప్రధాన ప్రాంతంగా తీసుకొని ఎంపిక చేసుకున్న తొమ్మిది మాండలిక నవలలను పరిశోధన పరిధిగా నిర్ణయించుకున్నాను. తెలంగాణ రాష్ట్రంలో పది జిల్లాలు ఉన్నాయి. వాటిలో తొమ్మిది జిల్లాలకు ప్రాతినిధ్యం వహించే తొమ్మిది నవలలను మాత్రమే పరిశోధనకు ఎంచుకున్నాను. ఖమ్మం జిల్లాకు సంబంధించిన మాండలిక నవల లభ్యం కాలేదు. తొమ్మిది నవలలు, రచయితల పేర్లు వరుసగా 1. అడవి-వసంతరావ్ దేశ్‌పాండే (ఆదిలాబాద్), 2. ఆడపిల్ల-

ఐతా చంద్రయ్య (మెదక్), 3. కక్క–వేముల ఎల్లయ్య (నల్గొండ), 4. కొలిమంటుకున్నది–అల్లం రాజయ్య (కరీంనగర్), 5. చిల్లర దేవుళ్ళు–దాశరథి రంగాచార్య (వరంగల్), 6. జెగ్గని యిద్దె–లోకమలహరి (నిజామాబాద్), 7. ముత్యాల పందిరి–పోరంకి దక్షిణామూర్తి (మహబూబ్‌నగర్), 8. వొయినం–జాజుల గౌరి(రంగారెడ్డి), 9. నలాం హైద్రాబాద్–వరవస్తు లోకేశ్వర్(హైద్రాబాద్).

ఈ పరిశోధన ప్రారంభించేనాటికి ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 31 జిల్లాలు లేవు. పది జిల్లాలే ఉన్నాయి. ఆయా జిల్లాలకు ప్రాతినిథ్యం వహించే తొమ్మిది నవలను మాత్రమే పరిశోధనకు ఎంచుకోవడమైంది. జిల్లాల విభజనకు ముందే సమాచార సేకరణ, పరిశోధన ప్రారంభమైంది. ఎంచుకున్న తొమ్మిది నవలల్లోని సమాచారాన్నంత సంగణీకరించి, తద్వారా పరిశోధనకు సంబంధించిన భాషాంశాలను పర్యవేక్షకుల సూచనల మేరకు విశ్లేషించాను.

**పరిశోధన ఉద్దేశం, లక్ష్యం**(Aims & Adjectives)

భాషలోని మాండలికాల సమాహారమే ప్రామాణికం. సాధారణంగా మాండలికాలు మౌఖిక వ్యవహారంలో ఎక్కువగా వినిపిస్తుంటాయి. అటువంటి మాండలికాలను వాడుకలోకి తేవాలి. వివిధ ప్రక్రియల రూపంలో రచనల్లోకి తేవాలి. పరిశోధనలు జరగాలి. అప్పుడు వివిధ మాండలిక (వ్యవహర్తలకు) ప్రజలు జీవన సంస్కృతి, భాష (మాండలికం) పరస్పరం పంచుకొని చైతన్యమౌతారు. తద్వారా భాష, సంస్కృతులు అభివృద్ధి చెందుతాయి. 1. తెలంగాణ మాండలిక నవలల్లో ఉన్న భాషావిశేషాలను పరిశీలించి తెలుగు భాషలో భాగం చేసి, భాషాభివృద్ధికి తోడ్పడటం. 2. లిఖిత తెలుగు భాషలో చేరిన మాండలిక వైవిధ్యాలను పరిశీలించి, తెలుగు సమగ్ర వ్యాకరణ రచనకు, సమగ్ర నిఘంటువుకు నిఘంటువులకు సాధ్యమైనన్ని విశేషాలను అందించడం ఈ పరిశోధన లక్ష్యం. 3. తెలుగు ప్రధాన భాషావ్యవహార ప్రాంతంలోగల ఉత్తర మండలంలోని రచనల్లో (నవల) మాండలికాలను పరిశీలించి తెలుగును పరిపుష్టి చేయడం. 4. భావి పరిశోధకులు తెలంగాణ రాష్ట్రంలోని ఇతర రచనా ప్రక్రియల్లోని మాండలికం, ఇతర భాషా మండలాలలోగల రచనల్లోని మాండలిక వైవిధ్యాలను పరిశీలించడానికి ఉపకరించే గ్రంథం ఇది.

**అధ్యాయ విభజన** (Chapter Division)

తెలంగాణ మాండలిక నవలల్లోని భాష ఆధారంగా, ఈ కింది అధ్యాయ అనుసరించాను. 1. తెలంగాణ మాండలిక నవలా వికాసం, 2. వర్ణ విజ్ఞానం (phonology), 3. సంధి విజ్ఞానం (morpho - phonemics), 4. నామరూప విజ్ఞానం (noun Morphology), 5. క్రియారూప విజ్ఞానం (verb Morphology), 6. పదకల్పకావ్యయాలు (clitics), 7. వాక్య విజ్ఞానం (syntax), ముగింపు, అనుబంధాలు, ఉపయుక్త గ్రంథసూచి.

**పరిశోధన ఫలితాంశాలు** (Research findings)

తెలంగాణ మాండలిక నవలల్లోని భాష పరిశోధనలో భాగంగా గుర్తించిన పరిశోధన ఫలితాంశాలు.

తెలంగాణ మాండలిక నవలల్లోని భాషలో పదాది సంయుక్త హల్లుల్లో క, గ, జ, త, ద, శ కార హల్లుల సంయుక్తత తప్ప మిగతా హల్లుల సంయుక్తత లేదు. మూడు హల్లుల సంయుక్తత 'ణ, న, స' కార హల్లులలో తప్ప మిగతా హల్లులలో కనిపించదు. ఉదా: సంద్ర, అంద్కని, తాపీమేస్త్రీ. తెలంగాణ మాండలిక నవలల్లో హల్లుల వర్ణాంతరత 'శ–/స–, న–/మ–, డ–/ద–, –య/ –వ, –ట–/–స–, –ర–/–ల, –గ–/–ద–, ద–/స–' ల మధ్య కన్పిస్తుంది. ద్విరుక్త, అద్విరుక్త అంతరత 'ద్ద/ద, న్న/న, ప్ప/ప, ర్ర/ర, ల్ల/'ల ల మధ్య కన్పిస్తుంది. ప్రాథమిక (నిష్పన్న) నామాల్లో లింగవచన ప్రత్యయాలు చేరని నామ ప్రాతిపదికలు మహతీతర అమహద్వాచకాలుగా దోతి, సీకు, గెంజి, గొంగడి, సాలె వంటివి తెలంగాణ మాండలిక నవలల్లో కన్పిస్తాయి. తెలంగాణ మాండలిక నవలల్లో '–తోటి, –తోన, దితోని' అనే తృతీయా విభక్తి ప్రత్యయాలు, '–కొరకు, –కోసం' అనే చతుర్థీ విభక్తి ప్రత్యయాలు, '–నుంచి, –నుండి, –కంటె, –కన్న' అనే పంచమీ విభక్తి ప్రత్యయాలు, 'దిల, దిల్ల, దిలె, –న, –లోపట, –లోపల' అనే సప్తమీ విభక్తి ప్రత్యయాలు ఇదే కారకార్థంలో ప్రవర్తిల్లే సంప్రదాయ ప్రత్యయాల కంటే ప్రత్యేకంగా కన్పిస్తున్నాయి.

**భావి పరిశోధకులకు సూచనలు**(Suggestions for upcoming researchers)

తెలుగు భాషా పరిపుష్టికి పూర్వ పరిశోధకులు చేసిన కృషికి ఈ పరిశోధన కొనసాగింపు. తెలంగాణలో రచయితలు, కవులు రాసిన సృజన సాహిత్యంపై ఎన్నో భాషా పరిశోధనలు రావాల్సిన అవసరం ఉంది. అంతేగాక తెలుగులో ఇతర మాండలికాలలో వచ్చిన రచనలపై భాషాశాస్త్ర దృష్టితో పరిశోధనలు చేసి, సారూప్యతలను, వైవిధ్యాలను తెలుసుకోవచ్చు. తద్వారా తెలుగు భాష మాండలిక వైవిధ్యాలను తనలో కలుపుకుని పరిపుష్టమవుతుంది.

**పరిశోధకుని వివరాలు:** డా. మల్లేశ్ మంత్రి, తేర్యాల గ్రామం, మోటకొండూర్ మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా, తెలంగాణ–508111, ఫోన్:984942704.

manthrimallesh@gmail.com.

★ రచయిత: తెలుగు ఉపాధ్యాయుడు

RNI Number: APTEL/2011/37247 ISSN 2349-2376



Save Water
Save Life

Address for communication
Editor, Nadusthunna Telangana
Flat no.301, vaishnavi smart apartments,
street no.2, Kakateeya Nagar, Habsiguda,
Hyderabad-500007